www.jagritiweekly.com
సంపుటి : 76 సంచిక : 09 పుటలు : 52

# జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ మార్గశిర బహుళ ద్వాదశి
08-14 జనవరి 2024
వెల : ₹20/-

# @75




జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

76 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# అయోధ్య విమానాశ్రయం

అయోధ్యలోని మర్యాద పురుషోత్తముడైన శ్రీరాముని అంతర్జాతీయ విమానాశ్రయానికి 'మహర్షి వాల్మీకి' పేరు పెట్టారు. నగర శైలిలో నిర్మిస్తున్న ఈ విమానాశ్రయం నిర్మిస్తున్నారు. దీని ప్రధాన ద్వారానికి మనకు పలు చోట్ల ఆలయాలలో కనిపించే శిఖరం ఉంటుంది. అడుగడుగునా పవిత్ర గ్రంథాలను చెప్పే దృశ్యాలను మలుస్తున్నారు. విమానాశ్రయం పై కప్పు రామాయణంలోని పలు అధ్యాయాలకు సంకేతంగా కనిపిస్తుంటుంది.

అయోధ్య సుసంపన్నమైన సంస్కృతి, ఆధునిక సౌకర్యాల మిశ్రమంగా ఉండనున్న ఈ విమానాశ్రయాన్ని డిసెంబర్ 30వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారికంగా ప్రారంభించారు. భారత వైమానిక దళానికి చెందిన ఎయిర్ బస్ -320 విజయవంతంగా అయోధ్య విమానాశ్రయంలో దిగింది. ఢిల్లీ, అహ్మదాబాద్, ముంబై, కోల్‌కతా, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, గోవా నగరాల నుంచి అయోధ్యకు విమానాలను నడిపేందుకు ఇండిగో సంస్థ సిద్ధంగా ఉంది. ఒక్కరోజులో 150 విమానాల రాకపోకలను నిర్వహించగల సామర్థ్యం ఈ విమానాశ్రయానికి ఉంది.



# 2024...
# రెండు ఆలయాలు...

హిందూ సమాజం ఔన్నత్యం ఎలాంటిదో 2024 సంవత్సరం ప్రపంచం ముంగిటకు తీసుకువెళ్లబోతోంది. హిందూత్వకు సంబంధించిన రెండు గొప్ప జ్ఞాపకాలను ఈ సంవత్సరమే ప్రపంచ ప్రజలకు అందించబోతున్నది కూడా. జనవరి 22, 2024న అయోధ్యలో శ్రీరామ చంద్రుడి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుంది. ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ చెప్పినట్టే, ఈ అద్భుత సందర్భం కోసం ప్రపంచం ఎదురు చూస్తున్నది. ఐదు వందల సంవత్సరాల పోరాటం తరువాత హిందువులు సాధించిన ఘన విజయానికి గుర్తుగా రామమందిరం వెలసింది. ఈ చరిత్రాత్మక కార్యక్రమం ముగిసిన మూడు వారాలకు అంటే ఫిబ్రవరి 14, 2024న మరొక ఉత్సవం ప్రపంచ ప్రజలకు గుర్తుండి పోయేదే, చరిత్రలో చోటు చేసుకోబోతున్నది. అది అబు ధాబిలో బీఏపీఎస్ మందిర ప్రారంభోత్సవం. భారతదేశానికి 2700 కిలోమీటర్ల అవతల అరబ్బు దేశాలలో నిర్మించిన ఈ మహోన్నత హిందూ ఆలయాన్ని బీఏపీఎస్ ఆధ్యాత్మిక గురువు బ్రహ్మవిహారీ స్వామిజీతో కలసి మన ప్రధాని నరేంద్ర మోదీయే ప్రారంభిస్తారు. ఈ విశేషాలను స్వామీజీ గుజరాతీ పత్రిక గుజరాతీ జాగరణ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

అబు ధాబిలో ఒక హిందూ దేవాలయం నిర్మించాలని స్వామి మహరాజ్ 1997లోనే స్వప్నించారు. 26 సంవత్సరాల తరువాత ఇప్పుడు ఆ స్వప్నం సాకారమైంది. ప్రధాని మోదీయే ఆ ఆలయానికి 2015లో శంకుస్థాపన చేశారు. దుబాయ్‌లోని ఒపేరా హౌస్‌లో ఫిబ్రవరి 11,2018న జరిగిన ఒక కార్యక్రమంలో బీఏపీఎస్ స్వామినారాయణ్ ఆలయం నమూనాను మోదీయే ఆవిష్కరించారు. ఆ సందర్భంలోనే ఆలయ నిర్మాణానికి అనుమతించినందుకు అబు ధాబి యువరాజుకు మన ప్రధాని ధన్యవాదాలు తెలియచేశారు. యువరాజు ఔదార్యం 130 కోట్ల భారతీయులను గౌరవించే విధంగా ఉందని మోదీ శ్లాఘించారు కూడా. డిసెంబర్ 27, 2023న స్వామి బ్రహ్మవిహారీ, ఈశ్వరచరణ్ స్వామి ఆలయం ప్రారంభోత్సవానికి అబు ధాబి రావలసిందిగా మోదీని ఆహ్వానించారు.



అయోధ్య

ఈ ఆలయానికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. పలు దేవతా మూర్తులు ఇందులో కనిపిస్తాయి. వాటిని కొన్నేళ్ల పాటు పరిశోధన చేసి తయారు చేయించారు. ఇలాంటి ఆలయాన్ని గడచిన 700 ఏళ్లలో ఎక్కడా నిర్మించలేదని బ్రహ్మవిహారీ స్వామి తెలియచేశారు. దీనిని సింగిల్ లెవెలం కట్టడం అంటారు. 108 అడుగుల ఎత్తుతో, 12 శిఖరాలు, 402 స్తంభాలు ఇందులో ఉన్నాయి. 180 అడుగుల వెడల్పు, 262 అడుగుల వెడల్పుతో దీనిని నిర్మించారు. రెండు గుమ్మటాలు ఉన్నాయి. లోపల గోడల నిండా రామాయణం చెక్కారు. శివాలయం దగ్గర శివపురాణం చెక్కించారు. రాధాకృష్ణ, జగన్నాథస్వామి ఆలయాల దగ్గర భారత, భాగవతాల గాథలు శిల్పాలుగా చెక్కించారు. అలాగే జగన్నాథుడి లీలల తెలిపే గాథలు కూడా దర్శనమిస్తాయి. వెంకటేశ్వరస్వామి-పద్మావతి, అయ్యప్ప గాథలు కూడా ఈ ఆలయంలో శిల్పాల రూపంలో కనిపిస్తాయి. ఇదంతా సనాతన ధర్మం ఔన్నత్యాన్ని వెల్లడించే కళాత్మక ప్రయత్నమేనని బ్రహ్మవిహారీ స్వామి తెలియచేశారు. భారతీయ రుషుల సూక్తులను కూడా గోడల మీద చిత్రించారు. ఆలయ రక్షణ కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ఉపయోగించారు. పునాదులలోను, గుడి ప్రాంగణంలోను మొత్తం 450 సెన్సార్‌లను ఉపయోగించారు. ఉష్ణోగ్రతలలో తేడాలు, భూకంపాలు వంటి వాటి గురించి ఇవి తెలియచేస్తాయి.

ఈ ఆలయం మొత్తం తిరిగి క్షుణ్ణంగా చూడాలంటే మూడు గంటల సమయం పడుతుంది. సాధారణంగా చూసి రావాలంటే కనీసం గంట పడుతుంది. నిర్మాణ మంతా సహజ పదార్థాలతోనే సాగించారు. ఏదైనా లోహం ఉపయోగించి నిర్మించిన కట్టడం జీవితకాలం 100 నుంచి 150 ఏళ్లు. అందుకే అబు ధాబి ఆలయ నిర్మాణంలో కృత్రిమ పదార్థాలేవీ ఉపయోగించలేదు. ఇనుము, ఉక్కు, క్లోరిన్, గంధకం కలిసిన ఏమీ ఇందులో లేవు. అందుకే ఈ ఆలయం వేయి సంవత్సరాలు నిలిచి ఉంటుందని చెబుతున్నారు. ★



అబు ధాబి

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

**జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013**

## చందాదారులకు విన్నపం

జాగృతి వారపత్రికలను క్రమంతప్పకుండా అందజేయుటకు తపాలశాఖ వారు ఈ మధ్యనే **'మ్యాగజైన్ పోస్ట్'** అనే పేరుతో **'ట్రాకింగ్ సిస్టం'** ప్రవేశ పెట్టారు. ట్రాకింగ్ ఉంటుంది కాబట్టి పత్రిక తప్పనిసరిగా అందుతుంది. చందాదారునికి పత్రిక పోస్ట్ చేసిన తేదీ, పత్రిక అందజేసిన విషయం ఎస్ఎంఎస్ ద్వారా తపాలా శాఖవారు తెలియజేస్తారు. జాగృతి వారపత్రికను **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పొందుటకు అదనంగా సంవత్సరానికి **రూ. 624/–** (వారానికి రూ. 12/–) తపాలాశాఖకు చెల్లించాల్సి ఉంటుంది. కాబట్టి ఈ సదుపాయం పాఠకులు వినియోగించుకోవాలని విన్నపం. అందుకోసం జాగృతి అకౌంట్‌కు అదనంగా రూ. 624/– చెల్లించగలరు. ప్రస్తుత చందా దారులు రాబోయే వారాలకు తగిన మొత్తం (వారానికి రూ. 12/– చొప్పున) పంపిన వివరాలతోపాటు తమ చందా నెంబరు వివరాలు, పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెంబరు తెలుపగలరు. ఈ వివరాలు అందిన 15 రోజుల నుండి **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పత్రిక పంపే ప్రక్రియ మొదలవుతుంది.

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust,**
**92001006140 5325, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

**మరిన్ని వివరాలకు**

**040-27561453/9959997013** నెంబర్లలో సంప్రదించవచ్చు.

– సర్క్యులేషన్ మేనేజర్

**విడి ప్రతి రూ.20**

**5 సం॥ల చందా రూ.4000**  **సంవత్సర చందా రూ.850**

**చందా పంపవలసిన చిరునామా :**

✦ 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

| | |
|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ |
| సబ్ ఎడిటర్ | 9959991304 |

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

విష ప్రచారాలకీ, విధ్వంసక సిద్ధాంతాలకీ విద్యార్థి లోకాన్ని దూరంగా ఉం చడం ప్రతి వ్యవస్థా నిర్వహించవలసిన ప్రథమ కర్తవ్యం. దేశ భవిష్యత్ చిత్రపటాన్ని రూపొందించేది నేటి విద్యార్థి లోకమేనన్న సంగతి నిరంతరం స్పృహలో ఉంచుకోవలసిన వాస్తవం. కానీ ఇప్పుడు చాలా విశ్వవిద్యాలయాలలో, విద్యాలయాలలో నెలకొని ఉన్న వాతావరణం కంటతడి పెట్టిస్తున్నది. కొన్ని విద్యా సంస్థలలో వీస్తున్న విషపు గాలులను తలుచుకుంటే మనసు వికలం కాక మానదు. దేశ రాజధానిలో ప్రతిష్టాత్మకంగా చెప్పుకునే జేఎన్‌యూ వంటి విఖ్యాత విద్యా సంస్థలో 'ఈ దేశాన్ని ముక్కలు చేస్తాం' అన్న నినాదం వినపడడం ఎంత ఘోరం? పార్లమెంట్ మీద దాడి చేసిన వారిని ఉరికంబం ఎక్కిస్తే దానిని చట్ట వ్యవస్థ చేసిన హత్యగా విద్యార్థులు రోడ్లెక్కి గగ్గోలు పెట్టడం ఎంతటి కలవరం కలిగించే పరిణామం! సుప్రీం కోర్టు తీర్పులనీ, పార్లమెంట్ చట్టాలనీ విద్యార్థుల చేత తిట్టిస్తూ, విద్యార్థి సంఘాల చేత అవహేళన చేయించడం ఒక దేశానికి ఎంత క్షోభ? గణతంత్ర భారత్ అంటే కళ్లల్లో నిప్పులు పోసుకునే దేశాలనూ, వ్యక్తులనూ రేపటి పౌరులు ఆదర్శంగా తీసుకోవడం ఏమిటి? స్వరాజ్య సమర యోధులనీ, ప్రజాస్వామ్య స్ఫూర్తినీ, రాజ్యాంగాన్నీ తూలనాడడం ఏమిటి? ఇలాంటి విద్రోహక వాతావరణానికి వ్యతిరేకంగా ఏడున్నర దశాబ్దాల నుంచి పోరాడుతున్న విద్యార్థి సంఘమే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్.

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన ఒక్క సంవత్సరం తరువాత, 1948లో ఏబీవీపీ ఆవిర్భవించింది. 1949లో లాంఛనంగా ప్రభుత్వ రికార్డులలో నమోదయింది. 75 వసంతాలు చూసిన ఈ విద్యార్థి సంఘం దాదాపు యాభయ్ లక్షలమంది సభ్యులతో దేశమంతటా విస్తరించింది.

ఆర్ఎస్ఎస్ ఆశయాలను తుచ తప్పకుండా పాటిస్తున్న విద్యార్థి వేదిక ఏబీవీపీ. విద్యార్థులలో జాతీయతా స్పృహ, దేశం పట్ల బాధ్యతను, తాము పుట్టి పెరిగిన సమాజం పట్ల జవాబుదారీతనంతో వ్యవహరించడం

**శాలివాహన 1945 శ్రీ శోభకృత్ మార్గశిర బహుళ ద్వాదశి**

## లోపలి పేజీలలో...



ముఖపత్ర కథనం
**ఏబీవీపీ @75**
6లో



చైతన్యం
**నాగరికత మేల్కొంటున్న వేళ..**
20లో



ప్రత్యేక వ్యాసం
**సంక్రాంతి... ఒక సమ్యక్ క్రాంతి**
26లో

# జాగృతి

## సంపాదకీయం

ఎలాగో తెలియ చేయడం ఆ సంస్థలో ప్రధానంగా కనిపిస్తుంది. జాతీయ సమగ్రత, అందుకు పాటు పడడం ఏబీవీపీ ఆశయాలలో ప్రధాన అంశంగా వెలుగొందుతున్నది. విద్యాప్రాంగణాలలో వామపక్ష భావజాలం చలవతో పాకిస్తాన్, చైనా అనుకూల శక్తులు పెట్రేగిపోయి వందేమాతరం ఆలపించినా, సరస్వతీ ప్రార్థన చేసినా దాడులకు దిగే వైపరీత్యం దాపురించింది. ఈ దుష్ట సంస్కృతిని ప్రాణాలకు తెగించి నిరోధిస్తున్న ఏకైక విద్యార్థి సంఘం మనదే. 1948 నాటి కశ్మీర్ సంపూర్ణ విలీనోద్యమం మొదలు, నిన్న మొన్నటి కరోనా వరకూ ప్రతి కీలక సందర్భంలోను ఏబీవీపీ

# విద్యార్థి పరిషత్ వర్ధిల్లాలి!

దేశ పౌరులకు అండగా నిలిచే ప్రయత్నం చేసింది. విద్యాలయ ప్రాంగణాలకే పరిమితం కాకుండా దేశం ఎలాంటి పరిస్థితులలో ఉన్నదో గమనించడం, సమాజం ఇక్కట్లలో ఉంటే సేవాకార్యక్రమంలో ముందు ఉండడం ఈ సంస్థ చరిత్రలో కనిపిస్తుందన్న మాట అక్షరసత్యం. 1962 నాటి చైనా దురాక్రమణ వేళ, 1971 నాటి భారత్ పాకిస్తాన్ యుద్ధకాలంలో పౌర సమాజానికి అండగా నిలిచిన విద్యార్థి సంఘం ఏబీవీపీ. జాతీయ సమగ్రత కోసం 1966లో జరిగిన ఉద్యమంలో భాగస్వాములు కావడం, 1970ల నాటి లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ సంపూర్ణ విప్లవానికి అండగా నిలవడం, 1987లో బోఫోర్స్ అక్రమాల మీద ఉద్యమం, కశ్మీర్ రక్షించుకుందాం నినాదంతో 1990లో పదివేల మందితో ఆ రాష్ట్రానికి ప్రదర్శనగా వెళ్లడం, వందేమాతరం నూరేళ్ల ఉత్సవం, పశ్చిమ బెంగాల్‌లో సీపీఎం అరాచకాలకు వ్యతిరేకంగా ప్రదర్శన, అన్నా హాజారే అవినీతి వ్యతిరేక పోరుకు బాసట.. ఇవికాక, జాతీయ విద్య మీద, ఎల్‌టీటీఈ సమస్య మీద, విద్య వ్యాపారం కావడానికి వ్యతిరేకంగా, దేశభద్రత మీద అనేక జాతీయ స్థాయి గోష్టులు నిర్వహించింది.

దేశంలో ఏబీవీపీతో పాటు విద్యార్థిలోకంలో పనిచేస్తున్న సంస్థలు ఇంకా ఉన్న మాట నిజం. ఏఐఎస్ఎఫ్ 1936లోనే ఆవిర్భవించింది. ఇది రష్యాకు అనుకూలంగా ఉండేది. ఇందులో నుంచి విడివడిన ముక్క ఎస్ఎఫ్ఐ. 1970లో ఏర్పడిన ఈ సంస్థకు ఆదర్శం చైనా, మావో. మరొక విద్యార్థి సంఘం ఎన్ఎస్‌యుఐ. ఇది కాంగ్రెస్ అనుబంధ సంస్థ. ఇందులో ఏఐఎస్ఎఫ్ తయారు చేసి దేశం మీదకు వదిలిపెట్టిన నాయకుడే కన్హయకుమార్. జేఎన్‌యూ విద్యార్థి సంఘం నాయకుడిగా ఉన్నప్పుడే ఇతడు దేశాన్ని ముక్కలు చేస్తామని రంకెలు వేసి దేశద్రోహ నేరంతో విచారణను ఎదుర్కొంటున్నాడు. ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరిపోయాడు.

ఎనిమిది వందల ఏళ్ల దాస్యం తరువాత స్వతంత్రం సాధించుకున్న దేశం భారత్. కాబట్టి ఇక్కడి సమస్యల స్వరూపం వేరు. ఆ వాస్తవాన్ని సానుకూల దృక్పథంతో, దేశం పట్ల నిబద్ధతతో అర్థం చేసుకుని పనిచేస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఏబీవీపీ. ప్రస్తుతం ఈ సంస్థ అవసరం మరింత పెరిగింది. రాజకీయ, కార్మిక రంగాలలో భారతీయమైన భావాలు ఎంత అవసరమో, విద్యారంగంలోను అంతే అవసరమన్న సంగతి విస్మరించరానిది. భారత సమగ్రతకు, సమైక్యతకు చేటు చేయడానికి అనేక మార్గాలను అక్కడ అన్వేషిస్తున్నారు. చాలా విద్యాలయాలు ఈనాడు అర్బన్ నక్సల్స్‌కు, మతోన్మాదాన్ని ఎక్కించే విధ్వంసకారులకు కేంద్రాలుగా మారిపోయాయి. అలాంటి వాటి బారిన పడి అటు కుటుంబానికీ, ఇటు దేశానికీ ఉపయోగపడకుండా జీవితాన్ని నాశనం చేసుకుంటున్న విద్యార్థులకు రక్షణ కవచంగా ఏబీవీపీ వంటి సంస్థ చిరకాలం వర్ధిల్లాలి. ★

08 జనవరి 2024, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్




40లో

కథ

**నేను మలచిన శిల్పాలు**

– డా. కనుపూరు శ్రీనివాసుల రెడ్డి

దరహాసం





అప్పుల కుప్పతో ఖజానా తిప్పలు (తెలంగాణ) – 14
ఇంటా బయట అసమ్మతి హోరు (ఆంధ్రప్రదేశ్) – 16
అక్షరార్చనలో 'వేట'పురి పఠనాలయం (సారస్వతం) – 24
స్వంత దేశంలోనే పరాయివారు (అంతర్జాతీయం) – 29
వికసిత సంకల్ప భారత్: విహంగ వీక్షణం (ముందడుగు) – 30
ఉత్తుంగ తరగం భారత మహిళా క్రికెట్! (క్రీడ) – 43
ప్రత్యేకతల వనిత (మహిళ) – 44
రాశిలో గ్రేట్... వాసిలో వేస్ట్! (సినిమా) – 50

**ఢిల్లీలోని జవాహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో దేశ వ్యతిరేక నినాదాలు వినిపించాయి. పశ్చిమ బెంగాల్‌లోని జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయంలో ఆజాదీ రంకెలు మిన్నుముట్టాయి. అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయంలో జిన్నా బొమ్మకు నీరాజనాలు సమర్పించారు. ఇలాంటి వార్తలు కలవరం కలిగిస్తాయి. ప్రజాధనంతో నడిచే ఈ విద్యాలయాలలో ఈ పోకడలేమిటన్న ప్రశ్న ఎవరికైనా సహజం. కానీ ఈ నిర్వాకాన్ని విద్యార్థులందరికీ అంట గట్టలేం. పలు విద్యార్థి సంఘాలనే ఇందుకు తప్పు పట్టవలసి ఉంటుంది. తమ విధ్వంసక ఎజెండాకు భగత్ సింగ్ పేరునూ, అంబేడ్కర్ పేరునూ కూడా దుర్వినియోగం చేస్తున్న విద్యార్థి సంఘాలివి. సరస్వతీ నిలయాలుగా ఉండవలసిన పెద్ద విద్యాలయాలలో, ఉన్నత విద్యాసంస్థలలో జాతి వ్యతిరేక వాతావరణమేమిటి? దీనిని చిత్తశుద్ధితో ప్రశ్నిస్తున్నదే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్. ఒక విద్యార్థి సంఘం నిబద్ధతతో, నిర్మాణాత్మక దృష్టితో, దేశం పట్ల ప్రేమతో పనిచేస్తే ఎలాంటి ఫలితాలు వస్తాయో రుజువు చేసిన సంస్థ విద్యార్థి పరిషత్.**

ఇటీవల ముగిసిన ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల తరువాత వచ్చిన ముఖ్యమంత్రులలో నలుగురు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) సభ్యులేనని ప్రముఖ పత్రికా రచయిత శేఖర్ గుప్తా ఒక సంచలన విశ్లేషణ అందించారు. బీజేపీ గెలిచిన రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఏబీవీపీలో పనిచేశారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరి ఉండవచ్చు కానీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఏబీవీపీ నేపథ్యం నుంచి వచ్చిన వారేనని గుప్తా తేల్చారు. ఆర్ఎస్ఎస్ విద్యార్థి విభాగం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్. ఈ దేశం నాకేమిచ్చిందని కాదు, నేను దేశానికి ఏం చేశానని ప్రశ్నించుకోమంటుంది ఆర్ఎస్ఎస్. కాబట్టి ఇదే ఏబీవీపీ నినాదం కూడా. ఈ నినాదం ఫలితం ఏమిటో ఏబీవీపీ 75 ఏళ్ల ప్రస్థానంలో ప్రస్ఫుటమవుతుంది.

# ఏబీవీపీ




భారతదేశంలో అత్యుత్తమ రాజకీయ పాఠశాల ఏది? నిస్సందేహంగా విద్యార్థి పరిషత్ అని అంటారు మేధావులు. ఆర్ఎస్ఎస్ ఈ అనుబంధ విద్యార్థి సంఘమే నాటి జనసంఘ్‌కీ. నేటి బీజేపీకి అనుబంధంగా ఉంది. ఏబీవీపీని ఎందుకు అత్యుత్తమ రాజకీయ పాఠశాలగా చూడాలి? గడచిన మూడు దశాబ్దాలుగా భారత రాజకీయాలలో ఆ సంస్థ నుంచి వచ్చిన వారు నిర్వహిస్తున్న పాత్ర దీనికి సరైన సమాధానం చెబుతుంది. దేశ పునర్నిర్మాణం కోసం వారు పడిన తపన, తప్పిదాలను సరిదిద్దడానికి చేస్తున్న కృషిలో, ఆ క్రమంలో వారు ప్రదర్శించిన నిజాయితీలో కూడా ఆ ప్రశ్నకు జవాబు లభిస్తుంది. భారతదేశ ముఖ చిత్రాన్ని సంపూర్ణంగా

# @75

మార్చివేసిన అటల్ బిహారీ వాజపేయి, నరేంద్ర మోదీల ప్రభుత్వాలలో అత్యధికులు ఏబీవీపీ నేపథ్యం కలిగినవారే. ఆధునిక పాలనా వ్యవస్థలో, దేశ భద్రత విషయంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన రాజ్‌నాథ్‌సింగ్, అరుణ్‌జెట్లీ, మనోహర్ పారికర్, అమిత్‌షా వంటి వారు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దేశానికి అందించిన నాయకులే. ఆత్మ గౌరవం, వారసత్వాన్ని విస్మరించని పురోగతి వంటి అంశాలలో బీజేపీ ప్రభుత్వాలకు అండగా ఉన్నవారు వీరే. ప్రస్తుతం ఆర్ఎస్ఎస్‌లో ముఖ్య భూమిక నిర్వహిస్తున్న దత్తాత్రేయ హోసబళె, సునీల్ అంబేకర్ కూడా విద్యార్థి పరిషత్‌ను ముందుకు తీసుకువెళుతూ తమను తాము శిల్పించుకున్నవారే.

భారతదేశంలో గురుశిష్య సంబంధం ప్రత్యేకమైనది. మారిన కాలంలో అది కూడా మారింది. కానీ శిష్యుల మౌలిక లక్షణం మారడం వాంఛనీయం కాదు. విద్యా విధానం మారినా, విద్యార్జన లక్ష్యం పెడతోవ పట్టకూడదు. నేర్పడానికి గురువు దగ్గర జ్ఞానం ఉండాలి. దానిని అందుకోవడానికి విద్యార్థి సిద్ధంగా ఉండాలి. విదేశీయుల రాకతో విద్యాకేంద్రాల స్వరూపం కూడా మారింది. 1858లో ఆధునిక విశ్వవిద్యాలయాలు వచ్చాయి. బ్రిటిష్ ఇండియాలో తొలి విద్యార్థి సమ్మె లాహోర్‌లోని కింగ్ ఎడ్వర్డ్ వైద్య కళాశాలలో జరిగింది. అది కూడా విద్య విషయంలో ఆంగ్లేయులకూ, భారతీయులకూ నడుమ అధికారులు చూపుతున్న వివక్షకు నిరసనగానే. ఆ సమ్మె ఆహ్వానించదగినది. కానీ సుప్రీంకోర్టు తీర్పును గుడ్డిగా ధిక్కరిస్తూ విశ్వవిద్యాలయాలలో నినాదాలు చేయడం విద్యార్థుల పని కాకూడదు. నిజానికి స్వరాజ్య ఉద్యమంలో విద్యార్థులు పాల్గొనడం గురించి ముందు నుంచి భిన్నాభిప్రాయాలే ఉన్నాయి. అయినా స్వరాజ్య సమరంలో విద్యార్థుల పాత్ర వాస్తవం. కానీ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత విద్యారంగంలో ఒక శూన్యం ఏర్పడింది. దేశీయమైన భావనలతో, అవసరాలతో విద్య రూపొందవలసిన తరుణంలో అంతర్జాతీయ పరిణామాల కారణంగా, తొలినాటి పాలకుల భ్రమల వల్ల అవాంఛనీయ పోకడలు పాఠాలుగా ప్రవేశించాయి. ఫలితంగా స్వతంత్ర భారత నిర్మాణంలో విద్యార్థుల భాగస్వామ్యం డోలాయమాన స్థితిలో పడింది. ఆ నేపథ్యంలోనే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆలోచన మొగ్గ తొడిగింది. ఆధ్యాత్మిక జాతీయవాద ద్రష్టలు స్వామి వివేకానంద, బాలగంగాధర తిలక్, వినాయక్ దామోదర్ సావర్కర్‌ల స్ఫూర్తితో ఈ సంస్థ అంకురించింది. భారతీయత విషయంలో రాజీ లేకుండా భారత్‌ను మాతృభూమిగా, కర్మభూమిగా ఏబీవీపీ ఆరాధిస్తుంది. మనదైన సంస్కృతి, విలువలు, శాస్త్రం, కళలను గౌరవించడం కూడా సంస్థ సిద్ధాంతాలలో ఒకటి.

ఆర్ఎస్ఎస్ ప్రచారక్, తరువాత భారతీయ జనసంఘ్‌లో కీలక పాత్ర పోషించిన బలరాజ్ మధోక్ చొరవతో 1948లో ఆరంభమైన ఏబీవీపీ, జూలై 9, 1949న లాంఛనంగా రిజిస్టరయింది. ప్రస్తుతం ఇది దేశంలోనే అతి పెద్ద విద్యార్థి సంఘం. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఒక్కసారిగా కమ్యూనిజం ప్రభావం పెరిగింది. ఆ భ్రమలో భారత తొలి ప్రభుత్వ పెద్దలు కూడా పడిపోయారు. విద్యాలయాలనూ, విద్యార్థి లోకాన్నీ ఆ వాతావరణం నుంచి దూరంగా ఉంచడమే ప్రథమ కర్తవ్యంగా ఏబీవీపీ పని చేసినట్టు కనిపిస్తుంది. సంస్థ తొలి సమావేశాలు 1948లో అంబాలాలో జరిగాయి. ప్రొఫెసర్ ఓం ప్రకాశ్ బహాల్ తొలి జాతీయ అధ్యక్షుడు. కేశవదేవ్ వర్మ తొలి ప్రధాన కార్యదర్శి. ఇదొక కార్మిక సంఘం వంటిది కాదని మొదటే ప్రకటించారు. అంటే కేవలం హక్కుల సాధనకే పరిమితమైనది కాదు. సామాజిక బాధ్యతను కూడా కలిగి ఉంటుంది. బీజేపీకి అనుబంధ సంస్థ అన్న అభిప్రాయం ఉన్నా, ఏబీవీపీ కొంతమేర స్వతంత్రంగానే వ్యవహరిస్తుంది. విద్యా వ్యవహారాలే ప్రధానంగా ఒక స్వతంత్ర సంస్థగా ఉండేందుకే ఎక్కువ ఇష్టపడుతుంది. 1958లో బొంబాయి (నేటి ముంబై) అధ్యాపకుడు యశ్వంత్‌రావ్ కేల్కర్ నాయకత్వంలో సంస్థ కొత్త మలుపులు తిరిగింది. ఆయననే ఏబీవీపీ రూపశిల్పిగా చెబుతారు. విద్యారంగంలో, విద్యార్థులలో, ఉపాధ్యాయులలో అర్థవంతమైన సానుకూల పరిణామాలు తీసుకురావడమే దీని ప్రధాన ధ్యేయం. అందరూ చెబుతున్నట్టు విద్యార్థులంటే రేపటి పౌరులు అని ఏబీవీపీ భావించదు. వారు కూడా నేటి సమాజ పౌరులేనని చెబుతుంది. 'రాష్ట్రీయ ఛాత్రశక్తి' ఏబీవీపీ అధికార పత్రిక.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన పాతిక సంవత్సరాలలోనే అవినీతి, బంధుప్రీతి విపరీతం కావడంతో కలత చెందిన లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ 1970లలో ప్రారంభించిన సామాజిక ఉద్యమాలలో కీలక పాత్ర వహించిన విద్యార్థులలో ఎక్కువమంది ఏబీవీపీ వారే. అంటే, ఆ సంస్థ కేవలం విద్యార్థి సమస్యలకే పరిమితం కాకుండా సమాజంలో


మధోక్


కేల్కర్

పెచ్చరిల్లుతున్న, మధ్య తరగతిని బలి చేస్తున్న అవినీతి మీద కూడా పోరాటం ఆరంభించింది. 1974 నాటికి ఏబీవీపీ సభ్యత్వం 790 విద్యాసంస్థలలో దాదాపు 1,60,000. 1983 నాటికి ఈ సంఖ్య 2,50,000కి పెరిగింది. అప్పటికి దేశవ్యాప్తంగా 1100 శాఖలు ఉన్నాయి. ప్రస్తుతం అరకోటి సభ్యత్వంలో దేశం నలుమూలలా 4500 ప్రాంతాలలో సంస్థ పనిచేస్తున్నది. ప్రతి విద్యార్థి జాతి ఐక్యత, సమగ్రత అనుభూతిని పొందేందుకు క్రియాశీలత, సేవ, సమర్పణ సంస్కృతికి హామీ ఇవ్వడమే కాక తన కార్యకలాపాల ద్వారా ఏబీవీపీ దానిని వ్యక్తీకరిస్తూ వస్తోంది.

న్యూఢిల్లీలో డిసెంబర్ 8న జరిగిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 69వ జాతీయ



శేషాద్రి



జేపీ

సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తూ, దేశానికి యువతే వెన్నుముక అని, దేశాన్ని, సమాజాన్ని అత్యున్నత స్థాయికి తీసుకువెళ్లేది వారి శక్తేనని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. "ఇది భారత్ కాలం, ఈ పరివర్తనకు సంబంధించిన పనిని ముందుకు తీసుకువెళ్లే పనిని చేయవలసింది యువతే"నని అన్నారు. స్వయంగా విద్యార్థి పరిషత్‌కు చెందిన ఆయన, విద్యార్థులను అయోధ్య రామమందిరాన్ని సందర్శించవలసిందిగా ఆహ్వానిస్తూ, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, అభివృద్ధి పరస్పర విరుద్ధమైనవి కావని స్పష్టీకరించారు.



అరుణ్ జైట్లీ



మనోహర్ పారీకర్



అనంత కుమార్

హోం మంత్రి సందేశం, పిలుపు కూడా ఏబీవీపీ ఆదర్శాలకు ఏకభావతను కలిగి ఉన్నాయి. 'విద్యార్థులు రేపటి పౌరులు కాదు, నేటి పౌరులు' అన్నది ఏబీవీపీ విశ్వాసం. ఈ ఆదర్శాన్ని 1971లో జరిగిన జాతీయ సమావేశంలో స్పష్టీకరించారు. విశ్వవిద్యాలయ ఆవరణలలో పెరుగుతున్న కమ్యూనిస్టు సిద్ధాంతం, భావ జాలాన్ని ఎదుర్కొనేందుకు తమను తాము సంఘటితం చేసుకోవాలన్న విషయంలో ఏబీవీపీ వ్యవస్థాపకులు అత్యంత స్పష్టతతో ఉన్నారు. 1970వ దశకం నాటికి అవినీతి, దేశ పునర్నిర్మాణ యత్నాలలో ప్రభుత్వ వైఫల్యం వంటి సమస్యలపై సంస్థ పోరాటం ప్రారంభించింది. అనేక ఇతర విద్యార్థి సంఘాలలా ఏబీవీపీ ఎప్పుడూ జాతీయ, రాష్ట్ర రాజధానులకే పరిమితం కాలేదు. ఇందిరాగాంధీ, ఆమె కమ్యూనిస్టు మిత్రపక్షాల ఫాసిజానికి నిరసనగా పరిషత్‌కు చెందిన కేడర్ సత్యాగ్రహం చేస్తున్న సమయంలో 10వేలమందికి పైగా అరెస్టు అయిన ఎమర్జెన్సీ సమయం (1975-77) – రెండవ స్వాతంత్ర్య పోరాటంలో ఏబీవీపీ పాత్రను గుర్తు చేసుకోవచ్చు.

గువాహతిలో 'సేవ్ అస్సాం' ఉద్యమానికి,

# తొలి అడుగులు

విద్యాలయాల నుంచి బయటి ప్రపంచంలోకి అడుగుపెట్టేవారే వ్యవస్థ నిర్మాణంలో భాగస్వాములవుతారు. వారు వ్యవస్థను నడిపించే శక్తి ఉన్నవారు కాకున్నా, నాశనం చేసేవారు మాత్రం కాకూడదు. అందుకు కలుషితం కాని విద్యా వ్యవస్థ కావాలి. ఎక్కడి నుంచి వచ్చిన ఆలోచనలనైనా పరిశీలించవచ్చు. ఏ మూల నుంచి వీచిన జ్ఞానాన్నయినా స్వీకరించవచ్చు. కానీ ఇల్లు అలుకుతూ పేరు మరచిన ఈగ చందంగా ఆ జ్ఞానం, ఆ ఆలోచనలూ దేశం పట్ల విద్యార్థులు తమ బాధ్యతను మరచిపోయేటట్టు చేయకూడదు. దేశం పట్ల ద్వేషాన్ని పెంచేవి కాకూడదు.

ఈ మట్టివాసనను భరించ లేనితనం పెంచేవి కాకూడదు. కాబట్టి విద్యార్థి తరగతి గది నుంచి బాధ్యతాయుతమైన పౌరునిగా, దేశాన్ని గౌరవించే ఉత్తమ పౌరునిగా సమాజంలో ప్రవేశించాలంటే విద్యాలయాలలో ఆరోగ్యకరమైన వాతావరణం ఉండాలి. అందుకోసం 75 ఏళ్లుగా పాటుపడుతున్న విద్యార్థి సంఘం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్. ఆంధ్ర ప్రాంతానికి కూడా ఏబీవీపీ విస్తరించింది. జాగృతి వారపత్రికలో వచ్చిన కొన్ని విశ్లేషణల ద్వారా ఆ తొలి అడుగులను పరిశీలిద్దాం.

అక్షరం తరగతి గదుల నుంచి నిరక్షరాస్యత దగ్గరకు కూడా వెళ్లాలన్న వినూత్న ఆలోచన ఆది నుంచి సంస్థకు ఉంది. 'అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సభ్యులు ఈ సెలవులలో గ్రామాలలో నివసించి నిరక్షరాస్యులైన గ్రామీణులను విద్యావంతులను చేయాలని సంకల్పించుకోవడం వల్ల ఒక నూతన యుగం ఆరంభం అయిందని నిరాఘాటంగా చెప్పవచ్చు. ఇది మహత్తరమైన కార్యం. దీనికి నేను నా శాయశక్తుల సహాయం చేస్తాను. కానీ ఈ కార్యం ఇంతటితో ఆగిపోకూడదు. గ్రామాలలోనే నివసిస్తూ గ్రామీణలను అన్ని విధాలా ఉద్ధరించడానికి ప్రయత్నించే ఉదారమూర్తులైన నవ యువకులు ముందుకు రావాలి' (జాగృతి/ 22.5.1949) అని రాజ్యాంగ పరిషత్ అధ్యక్షులు బాబూ రాజేంద్ర ప్రసాద్ (తరువాత ప్రథమ రాష్ట్రపతి) వ్యాఖ్యానించారు. జూలై 9, 1949న లాంఛనంగా రిజిస్టరు కావడానికి ముందే ఏబీవీపీ తన నిర్మాణాత్మక కార్యకలాపాలను ప్రారంభించింది. దేశంలోని కొన్ని ప్రాంతాలలో పని చేస్తున్న విద్యార్థి పరిషత్ శాఖల వారు ఆ వేసవిలో గ్రామీణులకు విద్యాదానం చేస్తారని ప్రాంతీయ కార్యదర్శి కృష్ణబహదూర్ విడుదల చేసిన ప్రకటనకు ఆ రాజనీతిజ్ఞుడి స్పందన ఇది. అధికంగా ఆహార ధాన్యాలు ఉత్పత్తి చేయాలంటూ మధ్య పరగణాలు, బీరార్ ప్రభుత్వ అధికారులు చేపట్టిన ప్రచార కార్యక్రమంలో కూడా విద్యార్థి పరిషత్ సభ్యులు పాల్గొన్నారు (జాగృతి/ 13.10.1949). దాదాపు నలభయ్ మంది విద్యార్థులను నాగపూర్ నుంచి గుంతారా అనే ప్రదేశానికి వ్యవసాయ శాఖ ప్రత్యేక వాహనాలలో తీసుకుని వెళ్లింది.

ఆనాడు దేశమంతటా ఏబీవీపీ వెంట విద్యార్థులు నడిచారు. డిసెంబర్, 1953లో గుంటూరులో జరిగిన జిల్లా స్థాయి ప్రథమ మహాసభలు ఇందుకు ఉదాహరణ. పరిషత్ వ్యవస్థాపకులలో ఒకరు ప్రొఫెసర్ బలరాజ్ మధోక్ ఆ సభలలో ప్రారంభోపన్యాసం చేశారు (జాగృతి/1.1.1954). ఆచార్య మధోక్ ప్రఖ్యాత పత్రికా రచయిత, చరిత్రకారుడు. అన్నిటికి మించి అప్పుడు అఖిల భారతీయ జనసంఘ్ కార్యదర్శి. ఈ సభకు గుంటూరు హిందూ కళాశాల ప్రిన్సిపాల్ వల్లభజోస్యుల సుబ్బారావు అధ్యక్షత వహించారు. ప్రొఫెసర్ మధోక్ ఇచ్చిన సందేశం అద్భుతమైనది. 'దేశంలోని విద్యార్థి సముదాయాన్ని సక్రమ పద్ధతిలో వికసింపచేయని పక్షంలో మనకు అభ్యుదయమంటూ



వెంకయ్య నాయుడు



అమిత్ షా





రాజ్‌నాథ్ సింగ్



జేపీ నడ్డా



రవి శంకర్

ప్రదర్శనలకు మద్దతుగా వేలాదిమంది ఏబీవీపీ కార్యకర్తలు దేశవ్యాప్త ఆందోళనను చేపట్టారు. రాజీవ్ గాంధీ ప్రభుత్వం 1986లో నూతన విద్యా విధానాన్ని (ఎన్ఇపి)ని ప్రవేశపెట్టినపుడు, దానిపై సంస్థ అనేక సెమినార్లను, పౌర చర్చలను నిర్వహిస్తూనే, బోఫోర్స్ ఒప్పందానికి, ఆ ప్రభుత్వ హయాంలో జరిగిందిగా చెప్తున్న అవినీతికి వ్యతిరేకంగా జాతీయ ఉద్యమాన్ని నిర్వహించింది.

నేటి రాజకీయాలలో తన ప్రభావశీలమైన ఉనికి ఉన్నప్పటికీ, ఏబీవీపీ ఎప్పుడూ గతానికి సంబంధించిన వివేకాన్ని, అది మన బంగారు భవిష్యత్తును ఎలా మలుస్తుందనే విషయాన్ని విస్మరించలేదు. స్వామి వివేకానంద చికాగోలో ఉపన్యసించి వంద ఏళ్లు అయిన సందర్భంగా నిర్వహించిన శతవార్షిక ఉత్సవాలకు చిహ్నంగా 23 వేలమంది విద్యార్థులతో 1993లో కోల్‌కొతాలో ఒక చారిత్రిక విద్యార్థి ర్యాలీని నిర్వహించారు. ఆ కార్యక్రమంలో మోనికా కక్కర్ (డియుఎస్‌యు అధ్యక్షురాలు), హెచ్‌వి శేషాద్రి (ఆర్ఎస్ఎస్ సర్‌కార్యవాహ) కూడా పాల్గొన్నారు.

కొవిడ్-19 మహమ్మారి మరింతగా వ్యాపించకుండా నియంత్రించేందుకు దేశవ్యాప్త లాక్‌డౌన్‌లో భాగంగా విద్యా సంస్థలను మూసివేశారు. సహాయ, పునరావాస పనులను చేపట్టడం ద్వారా తనను తాను పునరావిష్కరించుకునేందుకు తొలుత సంకల్పించినప్పటికీ, తర్వాత ప్రధానమంత్రి కార్యాలయంతో సమాచారాన్ని పంచుకునేందుకు విద్యార్థుల నుంచి నిరంతర ఫీడ్ బ్యాక్‌ను సేకరించింది. ఏబీవీపీ రూ. 2.86 కోట్లను సేకరించి, పిఎం కేర్స్ నిధికి విరాళమిచ్చింది. దీనితో పాటుగా 58 లక్షలకు పైగా మాస్కులను, 30 లక్షల ఆహార ప్యాకెట్లను, 31.7 లక్షల రేషన్ కిట్లను పంచింది. దాదాపు 17వేల మందికి పైగా విద్యార్థులు ఇళ్లకు చేరేందుకు తోడ్పడింది. వీరిలో ఎక్కువమంది దేశంలోని గిరిజన ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాలకు చెందినవారే. దాదాపు 59 వేలమంది కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుకుగా, క్రియాశీలకంగా పనిచేయగా, 700మంది నేపాలీ కార్మికులు చిక్కుకుపోయిన ఉత్తరాఖండ్‌లోని పితోడ్‌గఢ్ సహా పలు ప్రాంతాలలో 100 రోజులకు పైగా 477 వంటశాలలను సంస్థ నిర్వహించింది.

ఢిల్లీలో దాదాపు 100కు పైగా మురికివాడలలో కొవిడ్-19 లక్షణాలను కనుగొనడం కోసం

ఉండదు. ఇంతవరకు విద్యార్థులలో ప్రబలిన వాతావరణాన్ని చూస్తే పరిస్థితి చాలా నిరాశాజనకంగా కనిపిస్తుంది. క్రమశిక్షణ గాని, సక్రమ ప్రవర్తన కాని కనిపించడం లేదు. చదువులో కూడా చాలా నిమ్న స్థాయికి దిగజారుతున్నారు.' అని ఆ రోజులలోనే విచారం వ్యక్తం చేయడం గమనిస్తాం. కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్య సమరంలో విద్యార్థులను ఉపయోగించుకోవాలని అనుకున్నా కొందరు వారిస్తే, కాంగ్రెస్ వారిని దూషించిందని గుర్తు చేశారు.

ఇప్పుడు ఇతర విద్యార్థి సంఘాలు ఉద్యమాలలోకి వస్తుంటే కాంగ్రెస్ విమర్శలకు దిగుతున్నదని కూడా ఆచార్య మధోక్ విమర్శించారు. ఆ సమయంలోనే జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీని ఢిల్లీ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి పిలిస్తే కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు ధ్వజమెత్తిన సంగతిని కూడా ఆ సభలో మధోక్ వివరించారు. అంటే జాతీయవాదం ప్రభావం నుంచి విశ్వవిద్యాలయాలను దూరంగా ఉంచాలన్న విధ్వంసక వైఖరిని ఆ రెండు పార్టీలు ఆనాటి నుంచే అనుసరిస్తున్నాయని అర్థమవుతుంది. శ్రీనగర్ మీద పాకిస్తాన్ మూకలు వచ్చినపుడు కశ్మీర్ మహరాజా కోరిక మేరకు విద్యార్థి పరిషత్ సభ్యులు 150మంది ముందుకు ఉరికిన సంగతిని కూడా మధోక్ గుంటూరులో చెప్పారు. ఉపాధ్యాయునికీ విద్యార్థికీ మధ్య ట్రేడ్ యూనియన్ పద్ధతిలో కాకుండా సమన్వయ పద్ధతిని విద్యార్థి పరిషత్ ప్రోత్సహిస్తుందని వెల్లడించారు. ఉపాధ్యాయులు నేర్పడానికి సంసిద్ధంగా ఉండాలి, విద్యార్థులు నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండాలంటారాయన. విద్యార్థులు రాజకీయాలను అభ్యసించడం అవసరమే కానీ, అది విజ్ఞానదాయకంగా ఉండాలని ఆయన సూచించారు.

1955, మార్చిలో ఢిల్లీలో జరిగిన పరిషత్ సభలను ఏకనాథ్ రానడే ప్రారంభించారు (జాగృతి/ 4.3.1955). ఈ సభలలో ఆయన ఇచ్చిన సందేశం మరింత స్పష్టంగా సంస్థకు మార్గదర్శనం చేసింది. ఆనాడు ఉన్న విశ్వవిద్యాలయాలలో ఐదింటి నుంచి తప్ప, మిగిలిన అన్నింటి నుంచి సభ్యులు హాజరయ్యారు. విద్యార్థులను భారతీయకరణం చేయడమే సంస్థ ఆశయమని రానడే చెప్పారు. అలాగే విద్యార్థి ఉద్యమం హక్కుల కోసం పోరాడే కార్మిక సంస్థల మాదిరిగా కాకుండా చూడాలని కూడా ఆయన పిలుపునిచ్చారు.

ఢిల్లీ సభలలో ఏబీవీపీ చేసిన తీర్మానాలు విశిష్టంగా కనిపిస్తాయి. ప్రాథమిక విద్యను ఉచితంగా



జాగృతి

ఆదివారం 22-5-49

రెండు మూడునెలల్లో ౫౦,౦౦౦ ప్రజలకు విద్యాదానం!

అఖిలభారతీయ విద్యార్థి పరిషత్ ప్రయత్నం

అందించడమే కాకుండా, నిర్బంధం చేయాలని కూడా ఏబీవీపీ కోరింది. మాధ్యమిక విద్యను దేశ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల అభిరుచులను అనుసరించి ఉండాలని మరొక తీర్మానం ఆమోదించారు. సరైన విద్యార్థి వేతనాలు చెల్లిస్తూ, పేదలకు ఉన్నత విద్యను అందుబాటులోకి తేవాలని కూడా ఏబీవీపీ కోరింది. వృత్తి సాంకేతిక విద్యలు ఎంత ప్రధానమో కూడా సభ ఒక తీర్మానంలో పేర్కొన్నది. గుమాస్తాలను తయారు చేస్తున్న ఈ విద్యా విధానం మారాలని ఈ సభలో కూడా పాల్గొన్న బలరాజ్ మధోక్ పిలుపునిచ్చారు. ★


గడ్కరి


జవదేకర్


శివరాజ్ సింగ్


ధర్మేంద్ర ప్రధాన్


గిరిరాజ్ సింగ్


పీయూష్ గోయెల్

ఇంటింటికీ వెళ్లి స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించడమే కాక టీకాకరణ కోసం నమోదు చేసుకోవలసిందిగా ప్రజలను ఏబీవీపీ ప్రోత్సహించింది. మిషన్ సాహసీ వంటి కార్యక్రమాలను అమలు చేయడం ద్వారా అమృత్ కాల్‌లో పంచ్ ప్రాణ అన్న ప్రతిజ్ఞను పరిషత్ ముందుకు తీసుకువెడుతున్నది. మిషన్‌కు అనుగుణంగా, పాఠశాలలు, కళాశాలల వ్యాప్తంగా ఆడపిల్లలకు ఆత్మరక్షణలో శిక్షణను ఇస్తారు.

పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచి సరిహద్దులు, హద్దుల వరకు, ఏబీవీపీ జాతి, దేశ పునర్నిర్మాణానికి కట్టుబడి ఉన్నది. దేశానికి 2022లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పంచ ప్రాణ లక్ష్యాలను అందించినప్పటి నుంచి దాని పని పరిధి విస్తరించింది. ఆగస్టు 15,2022న ఇచ్చిన చారిత్రాత్మక ఉపన్యాసంలో ఆయన, "తమ జీవితంలో రాబోయే 25 ఏళ్లను దేశాభివృద్ధికి అంకితం చేయమని నేను విజ్ఞప్తి చేస్తున్నాను. వారు మొత్తం మానవాళి కోసం పని చేయాలి" అని అన్నారు.

జాతీయ సమగ్రత అంశం ఏబీవీపీ ఊపిరి. దాని ఫలితమే అంతర్రాష్ట్ర భారతీయ విద్యార్థుల అనుభవాల వేదిక (ఎస్ఈఐఎల్). 1965లో సంస్థ ప్రతినిధులు కొందరు ఈశాన్య భారత రాష్ట్రాలలో పర్యటించినప్పుడు ఎదురైన అనుభవాలతో ఈ వేదికను ఏర్పాటు చేశారు. అక్కడి యువత, విద్యార్థులు మిగిలిన భారతదేశం పట్ల ఏర్పరుచుకున్న అపోహలు, వినిపించిన దుష్ప్రచారాలు ఏబీవీపీ సభ్యులను కదిలించాయి. తాము భారతదేశానికి చెందినవారం కామన్న భావనకు కూడా కొందరు ఈశాన్య భారతవాసులు వచ్చేసిన వాస్తవం అవగతమైంది. అక్కడ 166 గిరిజన తెగులవారు ఉన్నారు. వారి జీవన విధానం, ఆరాధనా పద్ధతులు, ఆహారం, ఆహార్యం వేర్వేరు కావచ్చు. కానీ వారంతా భారతీయులు. దీనితో ఒకే దేశం ఒకే ప్రజ, ఒకే సంస్కృతి నినాదంతో ఎస్ఈఐఎల్ ప్రయాణం ఆరంభించింది. ఈశాన్య భారతదేశంలో ఉన్న జాతీయవాదులకు ఎస్ఈఐఎల్ వేదికగా మారింది. ఇతర ప్రాంతాల నుంచి ఈశాన్య భారతదేశానికి వెళ్లి అక్కడి వారి కుటుంబాలతో కలసి ఉండే ఒక కార్యక్రమం రూపొందించారు. అలాగే వారు మిగిలిన భారతావనికి వచ్చి కుటుంబాలతో ఉండే ఏర్పాటూ జరిగింది. దీనితో భారతీయత ఏమిటో పరస్పరం అర్థమైంది. భావ వినిమయం జరిగింది. చాలామంది ఆదివాసీ నేతలతో ఏబీవీపీ సన్నిహిత సంబంధాలు ఏర్పరుచుకుంది. ఆ క్రమంలో యువ వికాసకేంద్రాలు ఏర్పడినాయి. ఏమైనా ఏబీవీపీ ప్రారంభించిన ఎస్ఈఐఎల్ జాతీయ భావన సాధనలో గొప్ప విజయం. ఈ సంస్థ స్వర్ణోత్సవాలు 2015–16లో వైభవంగా జరిగాయి. యాభయ్‌వేల మంది ఏబీవీపీ కార్యకర్తలతో మహా ప్రదర్శన జరిగింది. థింక్ ఇండియా, డబ్ల్యుఓఎస్‌వై, జిజ్ఞాస, మెడివిజన్, అగ్రివిజన్, ఫార్మా విజన్, శోధ్, స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ కూడా ఏబీవీపీ అనుబంధ వేదికలే.

విద్యార్థి సంఘంగా ఏబీవీపీ దేశం పట్ల, దాని భద్రత పట్ల, పురోగతి పట్ల నిబద్ధత కలిగిన వ్యక్తులను తయారు చేసింది. ప్రస్తుతం నరేంద్ర మోదీ ప్రభుత్వంలో 56 మంది మంత్రులు ఉన్నారు. వీరిలో 24 మంది ఏబీవీపీ నేపథ్యం కలిగినవారు. 1980లో ఆవిర్భవించిన తరువాత ఇప్పటి వరకు వివిధ కాలాలలో ఆయా రాష్ట్రాలకు 28 మంది బీజేపీ ముఖ్యమంత్రులుగా పనిచేశారు. వారిలో 13 మందికి ఏబీవీపీ నేపథ్యం ఉంది. ఒకప్పుడు ఏబీవీపీ కార్యకర్తలుగా ఉన్నవారు తరువాత బీజేపీకి అధ్యక్షులు లేదా ఉపాధ్యక్షులుగా పదోన్నతి పొందారు. అరుణ్ జైట్లీ, నితిన్ గడ్కరీ, రాజ్‌నాథ్ సింగ్ (ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి), వెంకయ్యనాయుడు, రవిశంకర్ ప్రసాద్, అమిత్ షా, అనంత కుమార్, మనోహర్ పారికర్ (రక్షణ మంత్రి, గోవా ముఖ్యమంత్రి), శివరాజ్ సింగ్ చౌహాన్ (మధ్యప్రదేశ్), దేవేంద్ర ఫడనవీస్ (మహారాష్ట్ర), ప్రకాశ్ జవదేకర్, రాధామోహన్ సింగ్, పుష్కరధామి, విజయ్ రూపాని (గుజరాత్), బిప్లవ్ మోహన్‌దేవ్ (త్రిపుర), జయరాం ఠాకూర్ (హిమాచల్ ప్రదేశ్), ధర్మేంద్ర ప్రధాన్, గిరిరాజ్ సింగ్, అశ్వినీ చౌబే, పీయూష్ గోయెల్ వంటి వారంతా ఏబీవీపీ నుంచి రాష్ట్ర, దేశ రాజకీయాలకు వెళ్లారు. ప్రస్తుత బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా ఏబీవీపీ నుంచి వచ్చినవారే. ఇక ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీలుగా, ఉన్నతోద్యోగులుగా, అధ్యాపకులుగా, రచయితలుగా, వ్యాపారవేత్తలుగా ఉన్నవారు ఇంకా ఎందరో. మనోహర్ పారికర్, అమిత్ షా, నితిన్ గడ్కరీ, శివరాజ్ సింగ్ చౌహాన్ వీరంతా దేశ రాజకీయ, పరిపాలనా వ్యవహారాలకు కొత్త రూపు ఇచ్చినవారే.

అమృత్ కాలంలో ఏబీవీపీ తన అత్యుత్తమ సామర్థ్యంతో దేశ పునర్నిర్మాణానికి సహకారాన్ని అందించడాన్ని కొనసాగిస్తుంది. అది జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి), 1010 లక్ష్యాలు కావచ్చు, విద్య స్వదేశీకరణ, వలసమనస్తత్వం నుంచి ముక్తి కావచ్చు, జాతి ఐక్యతకు, సమగ్రతకు వ్యతిరేకంగా పనిచేసే కొన్ని దుష్టశక్తుల ప్రమాదకర పన్నాగాలను అర్థం చేసుకునేందుకు యువతకు, విద్యార్థులకు తోడ్పటం కావచ్చు, బహుముఖంగా ఏబీవీపీ తన సేవలను అందిస్తోంది. ఎల్లప్పుడూ క్రియాశీలత, సేవ, అందరినీ కలుపుకుపోవడమనే సమర్పణ సంస్కృతికి హామీ ఇవ్వడమే కాక తన కార్యకలాపాలతో దానిని వ్యక్తీకరిస్తూ వస్తోంది. పక్షపాతులు, భావజాలపరమైన శిక్షణ పొందిన, ఆశ్రితపక్షపాత విద్యార్థి సంఘాలను మా నుంచి ఒకటి రెండు పాఠాలు నేర్చుకుని దేశ ప్రయోజనాల కోసం సానుకూలంగా సహకరించాలని పిలుపునిస్తున్నాం. వైఖరిలో భేదాలు, విభేదాలు ఉండవచ్చు కానీ జాతి ప్రయోజనాల విషయంలో ఉండకూడదు. కశ్మీర్ అయినా, గువాహతి అయినా, ఇది మన దేశం, మన మట్టి!

గన్నేరు విత్తనాలు వేసి మామిడిచెట్టు మొలవాలనడం అసహజం. దేశ చరిత్రనీ, సంస్కృతినీ, జీవన విధానాన్నీ నిరంతరం అవమానించే రాజకీయ సంస్థలకు అనుబంధంగా ఉన్న విద్యార్థి సంఘాల నుంచి మంచి ఫలితాలు ఆశించడం వ్యర్థం. వాటితో విద్యాలయాలు కలుషితం కావడం తప్ప ఒరిగేదేమీ ఉండదు. చదువు అంటే, విశ్వవిద్యాలయాలలో గడపడం అంటే అరాచకం సృష్టించడం కాదు. ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న దేశంలో ప్రజాధనాన్ని అత్యంత హేయంగా దుర్వినియోగం చేయించడం కాదు. చదువు అంటే ఇక్కడి సమాజం పట్ల బాధ్యతను పెంచేది. గౌరవించగలిగేదీ మాత్రమే. దీనిని అర్థం చేసుకుని మనుగడ సాగిస్తున్నదే ఏబీవీపీ. అందుకే మిగిలిన విద్యార్థి సంఘాలలో కాగడా వేసి వెతికినా కానరాని క్రమశిక్షణ, దేశభక్తి, సిద్ధాంత నిబద్ధత విద్యార్థి పరిషత్‌లో కనిపిస్తాయి.

– జాగృతి డెస్క్


# మాతృభూమి కోసం – ఒక మహోద్యమం




"నేను ఏబీవీపీ ఆర్గానిక్ ప్రొడక్ట్‌ను. జాతీయ మహాసభల్లో ముఖ్య అతిథిగా పాల్గొనడం నాకు ఎంత గర్వంగా ఉందో చెప్పలేకపోతున్నాను. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో జరిగిన ఏబీవీపీ జాతీయ మహాసభల్లో చివరి వరసలో కూర్చొని పరిషత్‌తో ప్రయాణం మొదలుపెట్టిన ఒక సామాన్య కార్యకర్తకు మాత్రమే నా భావోద్వేగం అర్థం అవుతుంది." ఈ మాటలు అన్నది ఎవరో కాదు, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా. డిసెంబర్ 8, 2023న ఢిల్లీలో ప్రారంభమైన పరిషత్ 69వ జాతీయ మహాసభలలో ముఖ్య అతిథిగా పాల్గొని సంస్థతో తన అనుబంధాన్ని పదివేలమంది కార్యకర్తలతో ఇలా గర్వంగా పంచుకున్నారు.

అవును, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ప్రారంభమై 75 ఏళ్లు కావస్తుంది. పేరుకు తగ్గట్టుగానే కశ్మీరు నుండి కన్యాకుమారి వరకు అన్ని రాష్ట్రాలకు విస్తరించి 50 లక్షల సభ్యత్వం కలిగిన ఏబీవీపీ అఖిల భారత హోదాను పొందింది. నిజంగానే ఇప్పుడు అందరూ పరిషత్‌తో తమకు ఉన్న సంబంధాన్ని వెల్లడించడానికి గర్వపడుతున్నారు. ఈ మధ్య పత్రికలు కూడా దేశంలో ఎక్కడ కొత్తగా ముఖ్యమంత్రులు, మంత్రులు బాధ్యతలు చేపట్టినా వారికి ఏబీవీపీతో ఉన్న సంబంధాలను వివరిస్తున్నాయి. గోవా, అండమాన్ దీవులు, సిక్కిం చివరకు ఈశాన్యంలోని నాగాలాండ్, మిజోరం లాంటి అన్ని ప్రాంతాలకు పరిషత్ పని విస్తరించింది.

అయితే విద్యార్థి పరిషత్ మిగిలిన విద్యార్థి సంఘాల కంటే చాలా భిన్నమయింది. ఏదో ఒక రాజకీయ పార్టీకి అనుబంధంగా మిగతా సంఘాలు పనిచేస్తాయి. ఏబీవీపీ 'జాతి పునర్నిర్మాణం' ధ్యేయంగా, స్వతంత్రంగా పనిచేస్తుంది. పరిషత్ చేపట్టే కార్యక్రమాలు, ఉద్యమాల కారణంగా కార్యకర్తల్లో 'దేశం కోసం జీవించాలి – దేశంకోసం మరణించాలి' అనేంత దేశభక్తి రగిలి పోతుంటుంది. అలాంటి శిక్షణే పరిషత్‌లో ఉంటుంది. 'నేటి విద్యార్థి – నేటి పౌరుడే' అంటుంది ఏబీవీపీ. అందులో సామాన్య విద్యార్థి కూడా ఎంతో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తాడు. ఇతర విద్యార్థి సంఘాలకు రాజకీయ నాయకులు మార్గదర్శనం చేస్తారు. కానీ ఏబీవీపీలో ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు విద్యార్థులతో కలిసి పనిచేయడం, మార్గదర్శనం చేయడం చూస్తాం. ఎందుకంటే "విద్యారంగం ఒక కుటుంబం" అని పరిషత్ నమ్ముతుంది. నేటి భారతం ప్రపంచ దేశాలతో పోటీ పడాలి. భారత్ సూపర్ పవర్‌గా ఎదగాలి. అలాగే దేశంలో ప్రతి వ్యక్తి కనీస అవసరాలు తీరాలి, సమాన అవకాశాలు లభించాలి. సామాజిక దురాచారాలు పోవాలి. భారత్ ప్రాచీన జీవన విలువలు, జ్ఞాన పరంపర, కొనసాగాలని కూడా పరిషత్ కోరుకొంటుంది. 75 ఏళ్లుగా ఈ ఆదర్శాల కోసం పరిషత్ కార్యకర్తలు ఎంతో నిష్ఠ, అంకిత భావంతో పనిచేస్తున్నారు. "దేశమే అన్నింటి కన్నా మిన్న" అనే భావన వారిలో స్పష్టంగా కనిపిస్తుంది. 'వ్యక్తి నిర్మాణము' అనే పని కార్యక్రమాల ద్వారా నిరంతరం కొనసాగు తుంటుంది. ప్రొఫెసర్ యశ్వంతరావ్ కేల్కర్ పరిషత్‌ను మలిచిన శిల్పిగా భావిస్తారు. వారు అందించిన 'కార్యపద్ధతి'కి పరిషత్‌లో చాలా ప్రాముఖ్యం ఉంటుంది. సామాన్య కార్యకర్తల్లో కూడా 'క్రమశిక్షణ', సిద్ధాంతం పట్ల నిబద్ధత కనిపిస్తాయి.



**మురళీ మనోహర్ పుట్టి**
విద్యాభారతి (ఉన్నత విద్య) జాతీయ ఉపాధ్యక్షులు, ఏబీవీపీ మాజీ జాతీయ అధ్యక్షుడు

**విద్యారంగంలో ఏబీవీపీ ముద్ర**

ఈ దేశం పేరు 'భారత్'గానే ఉండాలని ఏబీవీపీ స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలోనే కోరింది. వందేమాతర గీతాన్ని జాతీయ గీతంగా గుర్తించాలని, హిందీని అనుసంధాన భాషగా గుర్తించాలని కూడా కోరింది. 1960 దశకంలో దేశమంతా క్యాంపస్ సంక్షోభం నెలకొన్నది. నాణ్యమైన ఉచిత విద్య కోసం పరిషత్ డిమాండ్ చేసింది. కానీ దేశమంతటా విద్యార్థులకు పోలీసుల నిర్బంధం సమాధాన మయింది.

ఈ చదువుల సంక్షోభాన్ని అరికట్టడానికి మొదటి విద్యా కమిషన్ వేశారు. ఇదే కొఠారీ కమిషన్ (1964–66). విద్యార్థి కూడా ఒక బాధ్యత గల పౌరుడే. అందుకే విద్యారంగంలో అన్ని రకాల నిర్ణయ ప్రక్రియలో విద్యార్థి భాగస్వామ్యం ఉండాలని 1969లో గజేంద్ర గడ్కరీ కమిషన్ ముందు పరిషత్ కోరింది. వృత్తి, విద్య చదువులో భాగం కావాలని 1970లో కేంద్రాన్ని డిమాండ్ చేసింది. జీడీపీలో 6 శాతం బడ్జెట్ విద్యకు కేటాయించాలనీ డిమాండ్ చేసేది. అయితే, ఈ మధ్య మోదీ ప్రభుత్వం తెచ్చిన కస్తూరి రంగన్ కమిషన్‌కు పరిషత్ ఎన్నో సూచనలు చేసింది. NEP–2020లో ఏబీవీపీ ఎన్నో దశాబ్దాలుగా చేస్తున్న డిమాండ్లు కనిపిస్తాయి. వొకేషనల్ విద్య, నైతిక విలువలు, క్రీడలు, మాతృభాషకు ప్రాధాన్యం లాంటి అనేక అంశాలకు ఇప్పుడు విలువ వచ్చింది.


విశ్వవిద్యాలయ ప్రాంగణాలలో హింసను,

మతోన్మాదాన్ని ఏబీవీపీ నిరంతరం అడ్డుకున్నది. క్యాంపస్‌లో శాంతి నెలకొల్పడానికి దేశవ్యాప్తంగా వందలాదిమంది కార్యకర్తల బలిదానాల చరిత్ర చాలా గొప్పది. జనవరి 26,1982న జాతీయ జెండా గౌరవం కోసం కాకతీయ విశ్వవిద్యాలయంలో జరిగిన సామ జగన్ వీరోచిత గాథ తెలియంది కాదు. యుకెలో అమ్మానాన్నతో ఉన్న విశాల్‌కుమార్ అనే 20 ఏళ్ల కుర్రాడు కేరళలోని అలపుజ్జ జిల్లాలో డిగ్రీలో చేరాడు. కేవలం ఆర్‌ఎస్ఎస్, ఏబీవీపీలలో పనిచేస్తున్నాడని కాలేజీ క్యాంపస్‌లో క్యాంపస్ ఫ్రంట్ అనే ఇస్లామిక్ టెర్రర్ గ్రూప్ హత్యచేసింది. ఏపీ, కేరళ, బెంగాల్, అస్సాం అనేక రాష్ట్రాలలో ఏబీవీపీ కార్యకర్తల బలిదానాల చరిత్ర అనంతం. అయితే, ఈ రోజు దేశంలో క్యాంపస్‌లు అన్ని కూడా 'వందేమాతరం' గానంతో ఊగిపోతున్నాయి. ఫిబ్రవరి 9, 2016న జేఎన్‌యు క్యాంపస్‌లో 'తుక్డే' గ్యాంగ్ చేసిన రచ్చ దేశ ప్రజలు చూసి విస్తుపోయారు. 'భారత్ కా బర్‌బాదీ తక్' (భారత్ ముక్కలు అయ్యేంతవరకు) యుద్ధం చేస్తామని చేవ చచ్చిన 'లెఫ్ట్ లిబరల్' గ్యాంగ్‌లు చివరిశ్వాసను పీలుస్తున్నాయి. ఇంత రచ్చచేసిన వీళ్ల నాయకుడు కన్హయకుమార్ వెళ్లి కాంగ్రెస్‌లో కలిసాడు. ఆ రోజు అంతగా గొంతు చించుకున్న 'షెహ్లా రషీద్' ఇప్పుడు స్వరం మార్చింది. అప్పుడు చేసినదంతా తప్పే అని చెంపలు వేసుకొంది. ఇలా 75 ఏళ్లలో ఏబీవీపీ దేశ వ్యాప్తంగా సేవ్ కాంగ్రెస్ అని సెవ్ క్యాంపస్ కల్చర్ అంటూ అనే ఉద్యమాలు చేసింది. విద్య వ్యాపారీకరణను అడ్డుకునే ప్రయత్నం ఇంకా కొనసాగిస్తున్నది.

దేశ రక్షణ కోసం – కశ్మీరు నిర్వాసితుల కోసం పరిషత్ దశాబ్దాల పాటు చేసిన కృషి మరువలేనిది. 'చలో కశ్మీర్' అంటూ పదివేల మంది విద్యార్థులు తరలి వెళ్లడం ఒక చరిత్ర. అస్సాంలో బంగ్లా చొరబాటుదారులకు వ్యతిరేకం 1981లోనే 'చలో గౌహతి' పిలుపును ఇచ్చింది. ఇలాంటి పరిషత్ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విద్యార్థులు బూట్లు పాలిష్ చేసి వచ్చిన డబ్బుతో కశ్మీరు వెళ్లడం ఆశ్చర్యకరం. అందుకే ఈ 370 ఆర్టికల్ తొలిగి పోయిందంటే ఆనాటి పరిషత్ కార్యకర్తల కృషి – రామజన్మభూమి ఉద్యమంలో ఏబీవీపీ పాత్ర ఎంతో కీలకం.

**సమరసత - సామాజిక చైతన్యం**

ప్రగతి శీలం గురించి మాట్లాడే లెఫ్ట్ లిబరల్స్ ఇప్పుడు దేశమంతా కుల సంఘాలను నడుపుకుంటు న్నారు. అంబేద్కర్ పేరుతో నడిపే ఈ కుల సంఘాల మావో వాదులు హిందువుల మధ్య చిచ్చుపెట్టే అనేక కార్యక్రమాలను దేశవ్యాప్తంగా క్యాంపస్‌ల నుంచి రచిస్తున్నారు. 'బీఫ్ ఫెస్టివల్' అందులో భాగమే. పెద్ద కూర తినడం ఎస్సీల హక్కు అని వీళ్ల వాదన. 'క్యాంపస్‌లో పెద్ద కూర తింటాం. ధైర్యముంటే


హరిహర శర్మ


గౌరీశంకర్

తమను ఆపా'లని సవాళ్లు విసురుతుంటారు. మెకాలే మా దేవుడు అంటూ క్యాంపస్‌లలో మెకాలే పుట్టిన రోజులు జరుపుతారు. మనుస్మృతిని తగలబెట్టడం మరో కార్యక్రమం. జనవరి 1 నాడు భీమా కోరేగాం సంస్మరణ దినం. కార్యక్రమాలు వేరు వేరైనా చివరి ఆశయం ఒక్కటే. సామాన్య హిందువులకు దళితుల మధ్య చిచ్చు రగిలించడమే. సర్వస్పర్శి పరిషత్ ధ్యేయం. అందుకే ఏబీవీపీ అంటే భారతీయులది. అందుకే క్యాంపస్‌లలో 'బీఫ్' తినే ఎస్సీల సంఖ్య చాలా తక్కువ. కానీ వీటిని వ్యతిరేకించే ఎస్సీల సంఖ్య పరిషత్‌లో చాలా ఎక్కువ. అందుకే సామాన్య విద్యార్థులకు పరిషత్‌లో పనిచేసే దళితుల మద్దతు ఉండేది. దేశమంతటా లెఫ్ట్ లిబరల్ కుట్రలు సంపూర్ణంగా విఫలం చెందాయి. దీని వెనక పరిషత్ కృషి ఎంతో ఉంది.

డిసెంబర్ 6న అంబేద్కర్ వర్ధంతిని 'సామాజిక సమరసతా దినం'గా 1986 నుండి పరిషత్ పాటిస్తున్నది. పరిషత్ మహాసభల్లో స్వర్గీయ గౌరీశంకర్ 'అంబేద్కర్ కథ' చెప్పడం ప్రారంభిం చారు. కుల సమస్య, అంటరానితనం, రిజర్వేషన్ లాంటి సమస్యలను ఎలా అర్థం చేసుకోవాలనే విషయాలను గౌరీశంకర్ నేర్పించారు. అంతేకాదు, ఆచరణలో 'సమరసత' ఎలా? అనే విషయం పరిషత్‌లో బాగా చర్చ జరిగేది. దేశంలో అనేక విశ్వవిద్యాలయాల్లో ఏబీవీపీ విద్యార్థుల హాస్టల్ గదుల్లో వివేకానందుడితో పాటు అంబేద్కర్ మహాశయుడి చిత్రపటాలను ఉంచడం, గౌర వించడం కొన్ని దశాబ్దాలుగా ఆచరణలో ఉంది. అంతేకాదు, నిరుపేద విద్యార్థులకు అండగా నిలబడడం పరిషత్‌కు అలవాటు. అలా నిమ్నవర్గాల ప్రేమను పరిషత్ చూరగొన్నది. 1992లోనే ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంలోని వందలాది సంక్షేమ హాస్టళ్ల స్థితిగతులపై పరిషత్ ఒక సర్వే నిర్వహించింది. హాస్టళ్లలో నిద్ర చేస్తేనే అక్కడి సమస్యలను అర్థం చేసుకోవచ్చని స్వర్గీయ హరిహరశర్మ సూచన. సర్వే రిపోర్టును 'బ్లాక్ పేపర్'గా ముద్రించి ఉస్మానియా యూనివర్సిటీలోని టాగూర్ ఆడిటోరియంలో హాస్టల్ విద్యార్థుల సదస్సులో విడుదల చేశారు.

రాష్ట్ర అధ్యక్షుడుగా ఉన్న నేను ఆ కార్యక్రమానికి అధ్యక్షత వహించాను. ముఖ్య అతిథిగా విచ్చేసిన జస్టిస్ కొత్తపల్లి పున్నయ్య విద్యార్థుల గోడు విని ఆశ్చర్యపోయారు. విజయనగరం నుండి వికారాబాద్ వరకు, ఆదిలాబాద్ నుండి అనంతపురం వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ విద్యార్థులు ఈ సదస్సులో మాట్లాడారు. రాష్ట్రంలో అప్పుడు ఒక్క హాస్టల్‌కు కూడా మరుగుదొడ్లు లేవు అని అమ్మాయిలు వాపోయారు. జస్టిస్ పున్నయ్య ఇది విప్లవమని, విప్లవం అంటే మార్పు అని కూడా అన్నారు. ఈ రోజు పరిషత్ కార్యకర్తలు హాస్టళ్లలో నిద్ర చేశారు. పదేళ్ల తరువాత ప్రజా నాయకులు కూడా నిద్ర చేస్తారు. సంక్షేమ హాస్టళ్లు బాగుపడతాయి. మీరు చేసిన ఈ బ్లాక్ పేపర్ ఈ పేద విద్యార్థుల జీవితాలకు వెలుతురు ప్రసాదిస్తుంది అన్నారు. దేశ వ్యాప్తంగా జనజాతి విద్యార్థుల హాస్టళ్లపై సర్వేచేసి ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని వేసినపుడు స్వయంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బాలక్రిష్ణన్ కూడా ఒక టివి ఇంటర్వ్యూలో ఏబీవీపీని అభినందించారు.

అందుకే ఏబీవీపీ కేవలం విద్యారంగంలోనే కాకుండా అనేక జాతీయ, సామాజిక సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్నది. 90వ దశకంలోనే ఉభయ రాష్ట్రాలలో 'జల సంరక్షణ' కోసం పరిషత్ గ్రామ గ్రామానికి పాదయాత్రలు చేసింది. దేశంలో సుమారుగా 90 శాతం విద్యా సంస్థలలో భారత్ మాతకు జై కొట్టే విద్యార్థులే కనబడుతారు. దేశం ఏ గొప్ప విజయం సాధించినా నేటి విద్యార్థి త్రివర్ణ పతకాన్ని భుజాన వేసుకొని వందేమాతర మంటూ నినదించడం నేటి ఫ్యాషన్‌గా మారిందంటే కారణం– 75 ఏళ్ల ఏబీవీపీ కృషి. ★

# 'తెలంగాణ విస్మృత వీరులు' గ్రంథావిష్కరణ



ఆవిష్కరణ సభలో ప్రముఖులు

**భాగ్యనగర్ :** చరిత్ర పరిశోధన గ్రంథం 'తెలంగాణ విస్మృత వీరులు' ఆవిష్కరణోత్సవం డిసెంబర్ 31, 2023న హైదరాబాద్ (బోడుప్పల్)లో జరిగింది. భారతీయ ఇతిహాస సంకలన సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు డా. కిషన్‌రావు అధ్యక్షత వహించారు. సాలార్జంగ్ మ్యూజియం విశ్రాంత సంచాలకులు వీరేంద్ర, చారిత్రక నవలా చక్రవర్తి ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్ (ఈ ముగ్గురి చేతుల మీదుగా పుస్తకం విడుదలైంది), ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ మాజీ అధ్యక్షులు ప్రొఫెసర్ కసిరెడ్డి, ఇంకా ఇతిహాస సంకలన పదాధికారులు, ప్రభృతులు కూడా పాల్గొన్నారు.

ఇతిహాస సంకలన సమితి ప్రధాన లక్ష్యాలను ఆచార్య కిషన్‌రావు పరిచయం చేశారు. సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలు మిగతా రాష్ట్రాలకు కూడా ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయని కొనియాడారు. ఇందుకోసం పనిచేస్తున్న ప్రతి కార్యకర్త కృషిని అభినందించారు.

ఆచార్య శివప్రసాద్ గ్రంథాన్ని సమీక్షిస్తూ, నిజమైన భారతీయ చరిత్రను వెలికి తీయాల్సిన అవసరాన్ని ఉదాహరణలతో సహా వివరించారు. ఇతిహాస సంకలన సమితి తెలంగాణ ఆధ్వర్యంలో ఇప్పటివరకు ఆజాది కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా 50-60మంది తెలంగాణ స్వాతంత్ర్య పోరాట యోధుల చరిత్ర బయటికి వచ్చిందని, ఈ చరిత్ర తర్వాత తరాల వారికి అందించాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. అజ్ఞాతవీరుల కుటుంబాలను కలసి, వారికి సంబంధించిన చరిత్రను తెలుసుకొని ఆధారాలతో సహా రచన చేసి పుస్తక రూపంలో అందించిన రచయితలందరిని అభినందించారు. ఈ కృషి ఇక్కడితోనే ఆగి పోకూడదని సూచించారు. ఈ పుస్తకం పాఠ్యాంశంగా కూడా విద్యార్థులకు అందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాన వక్త ఆచార్య కసిరెడ్డి ప్రసంగిస్తూ, చరిత్రకు చాలా ప్రాధాన్యం ఉందని, చరిత్ర తెలియనివాడు చరిత్రను నిర్మించలేడని అన్నారు. భారతీయుల చరిత్ర భయపడే చరిత్ర, ఓడిపోయే చరిత్ర కాదని ఇది వీరులకు నిలయమని పాశ్చాత్య దాడుల వల్ల వారు నాటిన విషబీజాల వల్ల తప్పుడు చరిత్రలని ప్రచారం చేస్తున్నారని, వాటన్నిటికీ ఇతిహాస సంకలన సమితి సమాధానంగా నిలుస్తుందని అన్నారు. సాధారణ శకం 712 నుంచి దేశంలో ఏ విధంగా ఇస్లాం స్థాపన జరిగిందో తెలియజేస్తూ... తెలంగాణలో కులీ కుతుబ్‌షా సామ్రాజ్య పతనం తరువాత నైజాము పరిపాలనలో జరిగిన దురాగతాలు, దీనికి వ్యతిరేకంగా పోరాటం చేసిన తెలంగాణ వీరులు వీరోచిత సంఘటనలు ఎన్నింటినో ప్రస్తావించారు. ఈ వ్యాసాంశాలు పాఠ్యపుస్తకాలుగా రావాలని డాక్టర్ కసిరెడ్డి కూడా ఆశాభావం వ్యక్తం చేశారు. తదనంతరం తెలంగాణ స్వాతంత్ర పోరాట యోధుల కుటుంబ సభ్యులను, వారి చరిత్రలను ఆవిష్కరించిన రచయితలను సన్మానించారు. ఎం. వీరేందర్ వందన సమర్పణ చేశారు.

## గవర్నర్‌కు అయోధ్య అక్షితలు



అయోధ్యనుండి వచ్చిన అక్షితలను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు అందించిన అయోధ్య రామజన్మభూమి తీర్థక్షేత్ర సభ్యులు, తెలంగాణ

## సేవాబస్తీలో...



**రంగారెడ్డి జిల్లా :** 2024 జనవరి 22 అయోధ్యలోని రామమందిరంలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా జనవరి 1 నుండి 15 వరకు ప్రతి గడపకు శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ద్వారా అయోధ్య అక్షితలు వితరణలో భాగంగా రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో బుడగజంగాల బస్తీలో అఖిల భారత సంచార జాతుల సంక్షేమసమితి ప్రముఖ్ దుర్గాదాస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ప్రముఖ్ సువీర్, ప్రాంత సంయోజక్ సిద్ధి రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



# అప్పుల కుప్పతో ఖజా


**తెలంగాణలో ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా తయారయ్యింది. పెద్ద మొత్తంలో అప్పులు, భారీ మొత్తంలో వడ్డీలు, ఈఎంఐలతో కొత్త ప్రభుత్వం మైండ్ బ్లాంక్ అవుతోంది. ఈ కారణంగానే ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేసింది. కానీ, అప్పులు, వడ్డీలు మాత్రం వెంటాడటం తప్పవు కదా.. అందుకే రేవంత్ రెడ్డి సర్కారు తొలి హస్తిన పర్యటన చేపట్టింది. నిధుల కోసం కేంద్రాన్ని అభ్యర్థించింది.**

ఇటీవలే ఏర్పాటైన కొత్త ప్రభుత్వానికి త్వరలోనే బడ్జెట్ పొంచి ఉంది. దీంతో, బడ్జెట్ రూపకల్పన కోసం సర్కారు కసరత్తు మొదలెట్టింది. ఈ ఏడాది రూపొందించాల్సిన బడ్జెట్ లక్ష్యం మేరకు రాష్ట్ర ప్రభుత్వ రుణ సేకరణ లక్ష్యం నాలుగు నెలల ముందే దాదాపు పూర్తవడంతో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ సర్కారుకు నిధుల సేకరణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ఏడాది బడ్జెట్ రుణ సేకరణ లక్ష్యం రూ. 38 వేల 234 కోట్లు కాగా.. గత నవంబరు నాటికే రూ. 38 వేల 151 కోట్లను గత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రభుత్వం తీసేసుకుంది. అంటే నాలుగు నెలల ముందే బడ్జెట్ రుణ సేకరణ లక్ష్యం ముగిసింది. ఈ కారణంగా కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వానికి నిధుల సేకరణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో, ఎఫ్ఆర్‌బీఎం పరిమితి సడలింపుపై కాంగ్రెస్ సర్కారు ఆశలు పెట్టుకుంది.

ప్రస్తుత 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ. 38 వేల 234 కోట్లమేర రుణాలు తీసుకోనున్నట్లు గత ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో ప్రకటించింది. సాధారణంగా ఈ లక్ష్యం మేరకు రుణాలను ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే నాటికి అంటే.. ఏప్రిల్ నుంచి మార్చి ముగిసే నాటికి దశల వారీగా తీసుకోవడం ఆనవాయితీ. కానీ, గత ప్రభుత్వం ముందే తీసేసుకుంది. బడ్జెట్ లక్ష్యాల మేరకు ఆదాయం సమకూర్చుకోలేకపోవడం, గతేడాదితో పోలిస్తే రాబడులు తక్కువగా ఉండటం, అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పలు పథకాలకు నిధులు పంపిణీ చేయడానికి నవంబరు నెల నాటికే అంటే.. కేవలం 8 నెలల్లోనే గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 38 వేల 151 కోట్ల రుణాలను తీసుకుంది. అంటే.. పూర్తి 12 నెలల్లో తీసుకోవాల్సిన రుణం మొత్తంలో 99.78 శాతం కేవలం ఎనిమిది నెలల్లోనే తీసేసుకుంది. కాగ్ తాజా నివేదికలో కూడా ఈ వివరాలు వెల్లడించింది. ఇక గతేడాది చూస్తే.. ఇదే సమయానికి 49.7 శాతం మాత్రమే తీసుకుంది. కానీ, ఈ యేడాది మాత్రం ఈ కాలానికి దాదాపు వందశాతం తీసుకుంది బీఆర్ఎస్ ప్రభుత్వం.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో ఖజానా ఖాళీ అవడంతో.. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. డిసెంబర్ నెలలో మరో రూ. వెయ్యి 400 కోట్లు రిజర్వ్ బ్యాంకు నుంచి సేకరించింది. రెండు దఫాలుగా ఈ మొత్తాన్ని సేకరించింది. డిసెంబర్ 12వ తేదీన రూ. 500 కోట్లు, 19వ తేదీన 900 కోట్ల రూపాయలను కాంగ్రెస్ ప్రభుత్వం బాండ్ల విక్రయ వేలం ద్వారా రిజర్వ్ బ్యాంకు నుంచి సేకరించింది. వీటితో కలిపితే ఈ ఆర్థిక సంవత్సరం రుణ సేకరణ లక్ష్యాన్ని ఇప్పటికే మించిపోయింది. ఈ ఆర్థిక సంవత్సరం రుణ సేకరణ లక్ష్యం 38వేల 234 కోట్ల రూపాయలు కాగా.. దానిని మించి మొత్తంగా 39వేల 551 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది.

అయితే, ఇప్పటికే వందశాతం రుణ సేకరణ లక్ష్యాన్ని మించిపోవడంతో ఇకపైన తీసుకునేందుకు రిజర్వు బ్యాంకు అనుమతించే అవకాశం లేదంటున్నారు నిపుణులు. ఈ నేపథ్యంలో కొత్తగా రుణాల సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఎఫ్ఆర్‌బీఎం కింద రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే రుణ పరిమితి నిబంధనను కేంద్ర ఆర్థికశాఖ సడలిస్తేనే మార్చి వరకు కొత్త రుణాలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. సాధారణంగా ఏటా పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం అంటే.. జనవరి నుంచి మార్చి మధ్య కాలంలో నిధుల కొరతను ఎదుర్కొంటాయి. ఆయా ప్రభుత్వాల విన్నపం మేరకు మరిన్ని రుణాలు సేకరించే వెసులుబాటు కల్పించేలా ఎఫ్ఆర్‌బీఎం నిబంధనను కేంద్రం అప్పుడప్పుడూ సడలిస్తూ వస్తోంది. ఈ ఏడాది కూడా కేంద్రం సడలింపు



సుజాత గోపగోని, 6302164068



# నా తిప్పలు

ఇస్తుందని ఆశిస్తున్నట్లు ఆర్థిక శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

మరోవైపు.. కేంద్రం నుంచి రావాల్సిన నిధుల మొత్తం కూడా తగ్గిపోయింది. కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో 41వేల 259 కోట్ల రూపాయలు వస్తాయని బడ్జెట్‌లో గత ప్రభుత్వం అంచనా వేసింది. నవంబరు ఆఖరు నాటికి అందులో కేవలం 10.99 శాతం మాత్రమే అంటే.. 4వేల 532 కోట్ల రూపాయలే వచ్చాయి. గతేడాది ఇదే ఎనిమిది నెలల కాలంలో కేంద్రం నుంచి గ్రాంట్లుగా 16.15 శాతం రాగా, ఈ ఏడాది అంతకన్నా 5.16 శాతం తక్కువగా రావడం గమనార్హం. ఈ గ్రాంట్లను త్వరగా విడుదల చేయాలని ఇటీవల ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రధాని నరేంద్రమోదీకి విన్నవించారు.

కేంద్ర పన్నుల్లో రాష్ట్రం వాటా కింద రావాల్సిన సొమ్ము కూడా గతేడాదితో పోలిస్తే తక్కువగా వచ్చినట్లు కాగ్ నివేదికలో తేలింది. ఈ ఏడాది ఈ పద్దు కింద 14వేల 528 కోట్ల రూపాయలు వస్తాయని బడ్జెట్‌లో అంచనా వేయగా, నవంబరు నాటికి అందులో 56.29 శాతమే సమకూరాయి. గత యేడాది ఇదే సమయానికి 60.92శాతం నిధులు సమకూరాయి. రాష్ట్ర పన్నుల రాబడి కూడా గతేడాది స్థాయిలో ఈ యేడాది కనిపించలేదు. పన్నుల ద్వారా ఈ ఏడాది మొత్తం లక్షా 52 వేల కోట్ల రూపాయలకు పైగా సమకూరుతుందని బడ్జెట్‌లో అంచనా వేయగా, నవంబరు నాటికి అందులో 57.10 శాతమే సమకూరింది. కానీ గత యేడాది ఇదే సమయానికి 63.86శాతం సమకూరడం గమనార్హం.

ఇక.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రం అనేక అంశాలను బట్టబయలు చేసింది. గత ప్రభుత్వం చేసిన అప్పులకు ప్రతిఏటా చెల్లించాల్సిన వడ్డీలు, కిస్తీల భారమే 62 వేల కోట్ల రూపాయలు ఉందని తేలింది. ఇందులో వడ్డీలే సగం అంటే 32వేల 502 కోట్ల రూపాయలు ఉన్నాయి. బడ్జెట్లో మెజార్టీ కేటాయింపులు ఎలా ఉంటాయనే దానిపై అంచనాలు వేసుకోగా ఉద్యోగుల జీతాలు, పెన్షన్లతో పాటు కిస్తీలు, వడ్డీలు తడిసిమోపెడు అవుతున్నాయని తెలిసింది. ఈ రెండు కలిపితే ఏకంగా లక్ష కోట్ల రూపాయలకు చేరుతోంది. అంటే బడ్జెట్లో సింహభాగం వీటికే కేటాయించాల్సి వస్తోందంటున్నారు ఆర్థికశాఖ అధికారులు.

వాస్తవానికి తీసుకున్న అప్పులకు రాష్ట్ర ప్రభుత్వం క్రమం తప్పకుండా కిస్తీలు, వడ్డీలు కట్టాల్సి ఉంటుంది. అలా కడితేనే భవిష్యత్ అప్పులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. దీంతో వీటి చెల్లింపులకు కచ్చితంగా కేటాయింపులు చేయాల్సి ఉంటుందని అధికారులంటున్నారు. అయితే ఇందులో బడ్జెట్లో చూపేవి ఎంత? బడ్జెట్ వెలుపల కట్టాల్సింది ఎంత? అనేదానిపై అధికారులు లెక్కలు కడుతున్నారు. వడ్డీల విషయానికొస్తే ఈ ఆర్థిక సంవత్సరం 22 వేల 407 కోట్ల రూపాయలు కట్టనున్నట్లు అంచనా వేశారు. ఇందులో నవంబర్ నాటికి రూ.14 వేల కోట్లు కట్టారు. మిగతా మొత్తం మార్చి ఆఖరు నాటికి చెల్లిస్తారు. ఇక కిస్తీల కింద 12వేల 606 కోట్ల రూపాయలు కడుతున్నారు. ఇదంతా బడ్జెట్లో పెట్టుకున్న దాంట్లో నుంచి చెల్లించారు. ఇవి కాకుండా బడ్జెటేతర కిస్తీలు, వడ్డీల కింద 25వేల 58 కోట్ల రూపాయలు అదనంగా రాష్ట్ర ఖజానా నుంచే కడుతున్నారు. ఇదే పద్ధతిలో 2024–25లో 62వేల 718 కోట్ల రూపాయలు కట్టాల్సి ఉంటుందని అధికారులు తేల్చారు. ఇందులో బడ్జెట్ నుంచి 38వేల 245 కోట్ల రూపాయలు, బడ్జెటేతర పద్దుల నుంచి 24వేల 473 కోట్ల రూపాయలు ఆర్బీఐ, ఇతర ఆర్థిక సంస్థలకు కట్టాల్సి ఉంటుందని ఆఫీసర్లు చెబుతున్నారు.

అప్పులు తీసుకోవడం, వాటికి వడ్డీలు చెల్లించడం కొన్నేళ్లుగా భారీమొత్తంలో పెరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో ప్రభుత్వం 5 వేల కోట్ల రూపాయలు వడ్డీ కట్టింది. సరిగ్గా తొమ్మిదేండ్లలో ఇది ఏడింతలకు చేరువైంది. ప్రతినెలా.. ప్రతి ఏడాది ఇలా కిస్తీలు, వడ్డీలు అంతకంతకు పెరుగుతు పోతున్నాయి. ప్రధానంగా ఇరిగేషన్ ప్రాజెక్టుల పేరుతో తీసుకున్న అప్పులతోనే ఈ పరిస్థితి తలెత్తిందని ఆఫీసర్లు చెబుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు ఆలస్యం కావడానికి కూడా అప్పులే కారణమని అంటున్నారు. 2015– 16లో 10వేల 941 వేల కోట్ల రూపాయలు కిస్తీలకు, వడ్డీలకు కడితే.. అదే 2023–24 నాటికి అది 60 వేల కోట్ల రూపాయలు దాటింది.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్





# ఇంటా బయట

2023 ఏడాదంతా ప్రజలకు ఆందోళనలు.. ఆక్రందనలు తప్పలేదు. రైతన్న మొదలు ప్రభుత్వ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కార్మికులు, విద్యార్థులు సహా అందరికీ.. రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో చుక్కలు కనిపించాయి. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రోడ్డెక్కి నిరసనలు, ఆందోళనలు, ధర్నాలకు దిగక తప్పని దుస్థితి. మరో వంక వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి తీరు నచ్చని నాయకులు పార్టీని వీడుతూ విమర్శనాస్త్రాలను సంధిస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వం పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయలేక పోయింది. ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయలేదు. పరిశ్రమలు పూర్తిగా మూతపడ్డాయి. యువతకు ఉద్యోగావశాకాలు కల్పించే పరిశ్రమ ఒక్కటి కూడా ఈ ఏడాది ఆరంభించలేదు. గతంలో ప్రారంభించిన పారిశ్రామికవాడలు వంటివి సైతం ఎక్కడివక్కడ ఆగిపోయాయి. దీంతో నిరుద్యోగులు తీవ్ర నైరాశ్యానికి గురయ్యారు. రైతులకు గిట్టుబాటు ధర లేక, ప్రభుత్వం తీసుకున్న ధాన్యానికి నగదును సకాలంలో ఇవ్వక, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన పంటలకు సంబంధించి రైతును ఏ రకంగానూ ఆదుకోలేదు. ప్రజలకు కనీస మౌలిక సౌకర్యాల్లో ప్రధానమైన.. రహదారుల పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది.

**రైతుల కడగండ్లు**

ఈ ఏడాది రైతుకు ప్రకృతి తీవ్ర నష్టాలను మిగిల్చింది. ఒకవైపు వర్షాభావ పరిస్థితుల్లో నీరందక 400 మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. కానీ ప్రభుత్వం 103 మండలాలనే కరవు ప్రాంతాలుగా ప్రకటించింది. అకాల వర్షాలు, తుపాన్ల దెబ్బకు రైతులు మరింత దెబ్బతిన్నారు. మిచౌంగ్ తుఫాన్‌తో సుమారు 6 లక్షల ఎకరాల్లో (తుఫాన్ వల్ల 4.50 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ (ప్రాథమికంగా అంచనా వేసింది) వరి, మొక్కజొన్న, పసుపు, అరటి, వేరుశనగ సహా పంటలన్నీ నీట మునిగిపోయాయి. పంటల నష్టంపై అంచనా వేసినా పరిహారం మాత్రం ఇవ్వలేదు. తుఫాన్ నష్టం కింద కేంద్రం మంజూరు చేసిన రూ.493 కోట్లను కూడా రైతులకు పంచలేదు.

అంతకు ముందు రబీ సీజన్‌లో పంటల బీమాకు ప్రభుత్వం ఎగనామం పెట్టింది. 2023 ఖరీఫ్ పంటల బీమా పరిహారం ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితి. ఏ సీజన్ పంట నష్టానికి ఆ సీజన్‌లోగా పరిహారం, ఏ ఏడాదికాయేడే పంట రుణాలపై సున్నా వడ్డీ రాయితీ ఇస్తావని వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి గొప్పలు చెప్పారని, కానీ నెలలు, సంవత్సరాలు గడిచినా చెల్లింపుల ఊసే ఎత్తడం లేదని అంటున్నారు. రైతులకు ఇవ్వాల్సిన వడ్డీ రాయితీ, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ కలిపి రూ. వేల కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. పైగా నిబంధనల పేరిట సంబంధిత పథకాలు అందకుండా చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఎకరాకు రూ.30 వేల నష్ట పరిహారం ఇవ్వాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు డిమాండ్ చేసిన వైసీపీ అధినేత, అధికారంలోకి వచ్చాక ఎకరాకు రూ.6 వేలు మించి ఇవ్వడం లేదు. 2022-23 రబీ రైతులకు అక్టోబరులోనే బీమా పరిహారం చెల్లించే ప్రక్రియ మొదలవుతుందని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అంతకు ముందు నెలలో అసెంబ్లీలో ప్రకటించారు. కానీ ఇప్పటికీ ఆ ఊసేలేదు.

**పరిశ్రమలకు శరాఘాతం**

వైసీపీ ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణాన్ని ధ్వంసం చేసిందనేది అందరి ఆవేదన. కొత్త పరిశ్రమలను రప్పించడం అటుంచి... ఒప్పందాలు కుదుర్చుకున్న వాటినీబ తరిమేసిందంటున్నారు. అధికారంలోకి వచ్చీ రావడంతోనే పరిశ్రమలకు కేటాయించిన భూముల సమీక్ష పేరిట పారిశ్రామికవేత్తలను వేధింపులకు గురిచేసింది. అదే ఇప్పుడు రాష్ట్రానికి పెనుశాపంగా మారింది. నిరుద్యోగిత పెరిగేందుకు కారణమైందంటున్నారు. 'వేల మందికి ఉపాధి కల్పించే భారీ పరిశ్రమలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయినా ఫర్వాలేదు. ఉపాధి, ఉద్యోగావకాశాలు లేక యువత పొరుగు రాష్ట్రాలకు తరలిపోయినా నష్టం లేదు. గత ప్రభుత్వ హయాంలో ఒప్పందాలు కుదుర్చుకున్న పెట్టుబడులు మాత్రం రాష్ట్రానికి రాకూడదనేదే తమ విధానం' అన్నట్లుగా వ్యవహరించిందని పారిశ్రామికవర్గాలు చెబుతున్నాయి. ఆసియా పేపర్ అండ్ పల్ప్ (ఏపీపీ) రూ.24 వేల కోట్లు, జాకీ ఇండస్ట్రీస్ రూ.129 కోట్లు, లులూ గ్రూప్ రూ.2,200 కోట్లు, రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.15 వేల కోట్లు, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ రూ.450 కోట్లు, అదానీ డేటా సెంటర్ రూ.70 వేల కోట్లు, అమరరాజా బ్యాటరీస్ (విస్తరణ ప్రాజెక్టు) రూ.9,500 కోట్లు మొత్తం కలిపి రూ.1,21,279 కోట్లు విలువైన పెట్టుబడులు తరిమేశారంటున్నారు. ఈ పెట్టుబడులు వస్తే సుమారు 2 లక్షల మందికి ఉపాధి అవకాశాలు వచ్చేవని చెబుతున్నారు. ఇవి కాక మూతపడిన ఎంఎస్‌ఎంఈలు విలువ రూ.20 వేల కోట్లుగా ఉందంటున్నారు. పారిశ్రామికవాడలు ఊసురుమంటున్నాయి. ప్రభుత్వం నుంచి సహకారం అందక.. పరిశ్రమలు ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలు లేక, పరిశ్రమలు రాక చదువుకున్న యువత తీవ్ర నిరాశలో ఉన్నారని విపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. గ్రాడ్యుయేట్లలో 24 శాతం నిరుద్యోగ రేటుతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవడం ఆందోళన కలిగించే అంశం. పట్టభద్రుల్లో నిరుద్యోగిత జాతీయ సగటు కంటే రాష్ట్రంలో 11 శాతం అధికంగా ఉంది.

**కార్మికుల ఉద్యమాల**

రాష్ట్రంలో వరుస సమ్మెల సైరన్ మారుమోగుతుంది. అంగన్‌వాడీలతో మొదలైన ఈ సమ్మెల పరంపరలో ప్రస్తుతానికి సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు, మున్సిపల్ కార్మికులు చేరారు. ఇంకా ఆశా కార్మికులు, వాలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు,

**టీఎస్. భూషణ్**



# అసమ్మతి హోరు

ఉపాధ్యాయ సంఘాలు సమ్మెలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇదే బాటలో మరికొందరు వచ్చే అవకాశాలు ఉన్నాయి. సమ్మె చేస్తున్నా, లేదా చేయడానికి సిద్ధమవుతున్న కార్మికుల, ఉద్యోగుల మొదటి డిమాండ్.. ముఖ్యమంత్రి తమకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని. రెండవ డిమాండ్... సమానపనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలన్నది. అన్ని హామీలు అమలు చేసామని అధికార పార్టీల నేతలు చెబుతుంటే తమ హామీల మాటేమిటని కార్మికులు, ఉద్యోగులు అడుగుతున్నారు. ఇప్పుడు అమలు చేయకపోతే ఇంకెప్పుడు అని పోరుబాట పట్టారు. తమకు ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేయాలని, పీఆర్సీ బకాయిలు చెల్లించాలని, ఐఆర్ కంటే ఫిట్మెంట్ తక్కువ ఇచ్చారంటూ ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యమాలకు సిద్ధం అవుతున్నారు.

**ప్రత్యర్థులపై కేసులు**

గత మూడేళ్లుగా చేసినట్టే.. గడచిన ఏడాది కూడా రాజకీయ ప్రత్యర్థులు, ప్రభుత్వ విధానాలపై గొంతెత్తిన వారిపై పోలీసు కేసులతో అధికార పార్టీ నేతలు కక్ష సాధింపు ధోరణి ప్రదర్శించారు. గత మూడేళ్లకు మించి ఈసారి.. మరీ దారుణంగా కేసులను పెట్టారు. ప్రతిపక్షాల కార్యాలయాలపై దాడులు చేయడం, వాహనాలను పెట్రోలు పోసి తగలబెట్టడం వంటివి చోటుచేసుకున్నాయి. ప్రతిపక్షాల నేతలు, సానుభూతిపరులు, సామాన్య ప్రజలపై.. వేధింపుల పర్వం కొనసాగుతూనే ఉంది. కొందరు పోలీసులు అధికార పార్టీకి కొమ్ముకాస్తూ వారి అనుచరులు, కార్యకర్తల్లా పనిచేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తాయి. అవినీతిని ప్రశ్నించిన విపక్షాల నాయకులు, కార్యకర్తలపై పోలీసులు అక్రమకేసులు పెట్టడం ఆయా పార్టీల కార్యకర్తలు ఎదురుతిరగడం, ఆందోళనలు చేయడంతో శాంతిభద్రతలు క్షీణించాయి. ఇదే సమయంలో యువత లక్ష్యంగా మాదకద్రవ్యాల అమ్మకాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. యువత మత్తుకు అలవాటుపడటం, గంజాయి కేసుల సంఖ్య అంతకు ముందు ఏడాదితో పోలిస్తే రెట్టింపు కన్నా ఎక్కువే నమోదు కావడం ఇందుకు నిదర్శనంగా చెబుతున్నారు. కళాశాల విద్యార్థులకు సైతం గంజాయిని అక్రమంగా విక్రయిస్తున్న కేసులు నమోదయ్యాయి.

**మద్యం మాఫియా దోపిడి**

మద్యం సరఫరాను కేంద్రంగా చేసుకుని రాష్ట్రంలో తీవ్ర అరాచకం ప్రబలుతోంది. నాసిరకం మద్యాన్ని పదిరెట్లు అధిక ధరకు అమ్ముతూ దోచేస్తున్నారని మద్యం ప్రియులు ఆరోపిస్తున్నారు. నగదు రూపంలోనే అమ్మకాలు సాగించడం ద్వారా లాభాలలో కొంత భాగాన్ని తాడేపల్లి ప్యాలెస్‌కు పంపుతోందని కూడా ఆరోపణలు మిన్నంటాయి. రాష్ట్రంలో తయారైన మద్యంపై నిరాశక్తను గమనించి పక్క రాష్ట్రం నుంచి అక్రమంగా తెప్పించి బ్లాక్‌లో అమ్మకాలు ప్రారంభించారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా సరిహద్దు గ్రామాల్లో మద్యం అక్రమ రవాణా కేసులు గణనీయంగా నమోదవుతున్నాయి. మద్య నిషేధ సమయంలో ఇలాగే పక్క రాష్ట్రాల నుంచి అక్రమంగా తెచ్చి అమ్మారు. కాని ఏపీలో మద్యం తయారవుతున్నా పొరుగు రాష్ట్రాల బ్రాండ్లపైనే ఆసక్తి చూపుతున్నారు. దీనిని బట్టి ఏపీలో తయారైన మద్యం నాణ్యతపై అనుమానాలు బలపడుతున్నాయి.


**చిన్న రాయిని పేర్చలేదు**

రాష్ట్ర అభివృద్ధి గురించి మాట్లాడటానికి ఏం లేదు. ఒక్క ప్రాజెక్టు కూడా ఏర్పాటు చేయలేదు. గతంలో ప్రారంభమైన పనులను పూర్తి చేయలేదు. రాష్ట్ర వ్యాప్తంగా రహదారులు ఛిద్రమై, వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతూనే ఉన్నారు. అయినా కనీసం ఒక్క గుంతను కూడా పూడ్చలేని దారుణమైన పరిస్థితి. ఆరు నెలలకోసారి గుంతలను పూడ్చడం తప్ప.. కొత్త రోడ్లను వేసే పరిస్థితే లేకుండా పోయింది. ఇక జిల్లాల్లో తిరిగే పల్లెవెలుగు, నగరాల్లో నడిచే సిటీ బస్సులు కాలం చెల్లిపోయింది. అవి పరిమితికి మించి ఎక్కువే తిరిగినా.. ఇంకా రోడ్లపైకి ఎక్కిస్తుండడంతో ఎక్కడికక్కడ ఆగిపోతున్నాయి. కనీసం వాటికి మరమ్మతులు కూడా చేయించకుండా తిప్పుతూ ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

**అందర్ని ముంచి తాను మునిగి...**

2023 ఏడాది ముగిసినట్లు వైసీపీ కూడా మునిగిపోయింది. ఈ పార్టీ నాలుగేళ్ల ఏడు నెలల పాలనలో తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంది. అన్ని వర్గాలను ఇబ్బందిపెట్టి శత్రువులా మారింది. తన వెన్నంటి ఉన్న అనుచరగణాన్ని సైతం దూరం చేసుకుని ఏకాకిగా మారారు ఆ పార్టీ అధినేత. ఎప్పుడు ఎన్నికలొస్తాయా... ఎప్పుడు పార్టీని తరిమేద్దామా అని ఓటర్లు ఎదురుచూస్తున్నారు. పలుగూ పారతో గోతిని తవ్వితే జాప్యం అవుతుందని భావించి ప్రొక్లయిన్లతో పెద్ద గోతిని తవ్వుకుని అందులో దూకినట్లయింది వైసీపీ అధినేత తీరు. సుమారు అయిదేళ్ల ఈ పాలన సృష్టించినంత బీభత్సం, అవినీతి, వనరుల దోపిడీ, విపక్షాలపై వేధింపులు, మరే ప్రభుత్వ హయాంలోనూ లేవని ప్రజలే అంటున్నారు. ‘2019లో వెల్లువలా వచ్చిన ఆదరణతో వైసీపీ అధినేత నియంతగా మారారు. ప్రజా సమస్యలు గాలికొదిలేశారు. హామీలన్నీ నీటి మూటలయ్యాయి. భూకజ్జాలు, ప్రకృతి వనరుల దోపిడిలో నాయకులు పోటీలు పడ్డారు. ఇసుక, మద్యం, గనుల లూటీలు దేశంలోనే అతిపెద్ద అవినీతి వ్యవహారంగా మారాయి’ అని విపక్షాలు ధ్వజమెత్తుతున్నాయి. ఇసుక తరలింపు, సెంటు భూమి పంపిణీ కోసం భూ సేకరణలో, ట్యాబ్‌ల కొనుగోళ్లలో రూ. వేల కోట్ల అవినీతి జరినట్లు వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. చివరికి ఎన్నికల్లో గెలిచేందుకు లక్షల కొద్దీ నకిలీ ఐడీలు సృష్టించి దొంగ ఓట్లు నమోదు చేయించినట్లు కేంద్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదులు అందాయి. తనపై వచ్చిన వ్యతిరేకతను ఎమ్మెల్యేలపై నెట్టి వారిని తప్పించి కొత్తవారికి సీట్లు ఇవ్వాలని అధినేత నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఒక్కో ఎమ్మెల్యే బయటకు వచ్చి అధినేతను విమర్శించడంతో పార్టీ పీకలలోతు కూరుకు పోయిందని భావిస్తున్నారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్



8

# హద్దులు దాటిన అతిశయం
# ఆదికావ్యాన్ని కించపరిచే యత్నం

ఈ దుష్ప్రచారానికి తోడు పాశ్చాత్యులు ప్రకటించుకున్న అతిశయం కూడా హద్దులు దాటింది. రోట్ ఇలా అన్నాడు, "సాయన పండితుడు వేద పరిభాషను ఐరోపా పండితులకన్న ఎక్కువగా అర్థం చేసుకున్నారని మేము విశ్వసించడంలేదు. చిత్తశుద్ధి కలిగిన ఐరోపా పండితుడు సాయన పండితుని కన్నా వేదాలను మరింత చక్కగా వ్యాఖ్యానం చేయగలడని మేము భావిస్తున్నాము."

మాక్స్‌ముల్లర్ బ్రాహ్మణములు, నిరుక్తములు ఇత్యాది గ్రంథాలనే సమాప్తం చేశారు. ఆయన ఇలా వ్రాశాడు: ' బ్రాహ్మణముల రచయితలు మత సిద్ధాంతాలవల్ల అంధులైపోయారు. నిరుక్తముల రచయితలు భాషాశాస్త్ర సంబంధమైన కల్పనలవల్ల మోసపోయారు. వీరిద్దరూ కలసి సాయనుని వంటి తర్వాతి వ్యాఖ్యాతలను పెడత్రోవనట్టించారు."

ప్రొ. బంపో ఇలా అన్నాడు. 'వ్యాఖ్యానంలో భారతీయమైన పద్ధతి పూర్తిగా లోపభూయిష్టమైనవి. ఎందువల్లనంటే పరిస్థితులను భావనలను ఊహించడంలో దానికి ఎన్ని భ్రమలు, అపోహలు ఉన్నాయి."

భారతీయ పరంపరకు, వాతావరణానికి క్రోసుల కొలది దూరాన ఉండి వైదిక శబ్దకోశం సహాయంతో వేదాలకు అర్థాలు కరతలామలకాలు అయ్యాయనుకునే పండితుల అవస్థ నిజానికి దయనీయమైనవి. శబ్దాలను ఇష్టం వచ్చినట్లు వికృతం చేసి తీసిన అర్థాలను గురించి గర్వపడే ఈ పండితమ్మన్యులు చివరకు అడుగడుగునా ఈ పాదం కష్టంగా ఉంది. ఇది నాకు పూర్తిగా అర్థం కాలేదు. ఈ శ్లోకం చాలా గూఢంగా ఉంది. దీన్ని అనువదించడానికి నేను ప్రయత్నించను" అని వ్రాసుకోవలసి వచ్చింది.

ఈ పండితుల సిద్ధాంతాలకు బ్రిటిషుపాలన కాలంలో ప్రఖ్యాతి వచ్చింది. ఆంగ్లేయ విద్యావిధానంలో వారికి గౌరవస్థానం లభించింది. ఫలితంగా భారతీయమైన ఉదాత్త సిద్ధాంతాలు హత్య చేయబడ్డాయి. గత రెండు తరాల వారు నిరంతరం పతనం చెందడం, తమ స్వత్వాన్ని రక్షించడం యెడ పూర్తి అజ్ఞానం కలిగి ఉండడం దీని విష ఫలితాలు.

ఈ విధంగా ఆంగ్లేయులు మన జాతీయతను, ఆత్మగౌరవాన్ని నాశనం చేశారు. ఆత్మగౌరవం నశిస్తే స్పాల్డింగ్ చెప్పిన ఈ స్థితి వస్తుంది. "పాశ్చాత్యమైన ప్రతివారికి అది మంచిదైనా, చెడ్డదైనా, తగినదైనా, కాకపోయినా, పొగడే మనస్తత్వం ఏర్పడుతుంది. విద్యాధికులు తమ సంప్రదాయాలను ఏవగించుకుని పాశ్చాత్యుల భావాలను స్వీకరిస్తాడు. ఇది భారతదేశమంతటా జరిగింది. దేశంలోని సాహిత్యమంతా ఈ రాహువు నోట పడింది.

అట్టి స్థితిలో రామాయణం ఈ నీలినీడ నుండి ఎలా తప్పించుకోగలుగు తుందో! రామాయణాన్ని మొదటిసారిగా పరిశోధించిన పాశ్చాత్య పండితుడు చెజర్. ఈ పండితుని విషయంలో గోల్డ్‌స్టకచ్ అతడు మూలంలో లేని అవ్యయాలను చేర్చి అర్థాన్ని మార్చాడని వ్రాశారు. రామాయణంలోని కథ అంతా విదేశాల సాహిత్యం నుండి తీసుకోబడిందని వ్రాసి ఈ పండితులు రామాయణం యొక్క భారతీయత్వమునే నశింపజేయాలనే దుస్సాహసానికి ఒడిగట్టారు. జస్టిన్ తెజాంగ్ తను గ్రంథంలో చెజన్‌ను పూర్తిగా ఖండించారు.

పాశ్చాత్యుల చరిత్ర పరిశోధన శాస్త్రాన్ని అత్యంత జాగరూకతతో ఉపయోగించడం అవసరం.

**– బాలశాస్త్రి హరదాస్**

***'జాగృతి' 08.06.1964 సంచిక నుంచి***

## ఆధ్యాత్మికం



# జగద్గురు శ్రీ శంకరాచార్య

భారతదేశములోని ఏ సత్సంప్రదాయాన్ని చెండాడకుండా సర్వసత్సంప్ర దాయాలను సమన్వయ శక్తితో కూడగట్టుకొని రాగలగడం శంకరాచార్యుల విశిష్ట లక్షణము.

జీవేశ్వరులయ భేదాన్ని జ్ఞానంతో గ్రహించడమే మోక్షమని తెలిపే అద్వైత సిద్ధాంతానికి వారు ఆచార్య పురుషులై ఉండీ, భక్తి, కర్మ మార్గాలను సమర్థించడం విశేషం. జ్ఞానమునందు ఎల్లరికిని అధికారం ఉండదని, అంతఃకరణ మాలిన్యం తొలగితే కానీ అద్వైతివాసన కలుగదని, మానవాళికి కర్మభక్తి జ్ఞానమార్గాలు మూడూ అనుసరణీయాలని నిర్ణయించి వేదోక్త కర్మాచరణం, ఈశ్వరోపాసనా విధానాలను ప్రచారములోనికి తీసుకువచ్చారు. అద్వైతం తక్కువ వారి చేతులలో పడినప్పుడు సర్వం మిథ్య అవడంతో పాపపుణ్యాలు లేవు కనుక విశృంఖలంగా సంచరించవచ్చనే ప్రమాదభరిత సిద్ధాంతం తలెత్తే అవకాశం ఉంది. "నేనే బ్రహ్మ నైతే ఈశ్వరుడిని ఎందుకు 'సేవించాలి' అనే నాస్తికతకునూ దారితీస్తుంది. ఈ రెండు అనర్థాలు ఏర్పడకుండా ఉండేందుకు, లోకములో

# మహాభారతం ప్రజాపరిస్థితి

8




"ఇందలి దుష్టజనుల పక్షపాత వచనంబులుడుగు నంతకు, నుపాయంబునఁ గొంతిని బాండవులను రదీయ భృత్యామాత్య వర్గంబుతో వారణావతంబునకుఁబుత్తము, మనకు రాజ్యంబు సుప్రతిష్ఠతంబైన మతి వారలిందులకు వత్తురు" (ఆది–6–129)

అని దుర్యోధనుడు తండ్రితో అనెను. ఇందలి దుష్టజనుల పక్షపాతపచనంబు లేవి!

**"ప్రజ్ఞాదక్షు రదక్షుష్ట్వాద్,**
**ధృతరాష్ట్రో జనేశ్వరః**
**రాజ్యం సప్రాప్తవాన్ పూర్వం**
**సకథం నృపతీర్భవేత్"**

పాండవ జ్యేష్ఠుడు తరుణుడు కాని గుణవృద్ధుడు. అతడు యోగ్యుడు. అతనిని ప్రతిష్ఠించుదురమనియే గదా వారు కోరుకోనుచున్నది. తమకు నచ్చినవానిని, తాము మెచ్చినవానిని రాజు చేయుట వారి కోరిక. వారు ఇంతటి సమర్థులు గనుకనే వారికి ఆయాలోచన కలిగినది. దుర్యోధనును కింతటి వెరపు పుట్టినది. వారి వాక్కులను 'పౌరాణాం అశివా గిరః' అని తూలనాడి శివశివా యని దుర్యోధనుడు చెవులు మూసికొన్నాడు. ఎటులైనను యీ యనిష్టమును నివారింపక తప్పదు.

**'నభవాన్ పాణ్డవాన్**
**ఆశు వినాశితు మర్హతి**
**మృదు వైనాభ్యుపాయేన**
**నగరం వారనా వతమ్'** **(ఆది 141–24)**

మెత్తని మాటలతో వారిని తప్పింపవలెను. వారణవతమునకు తరలింపవలెను. అదియును వెంటనే జరుగనున్న కార్యము చేయిజారిపోవచ్చును. కనుక వారణావత వైభవమున వేనోళ్ళ పొగడించి, పాండవులకు మొదట దానిపై సద్భావమును కలిగించిరి. అంతట ధృతరాష్ట్రుడు తడిగుడ్డలతో గొంతులు కోయ మొదలిడినాడు. అతనికి కన్నీరు పిలిచిన పలుకును. ధృతరాష్ట్రుని శీలమును గ్రహించి, నన్నయ్యగారు ఆమూలకములకు గొన్నింటిని ఇచ్చట ప్రవేశపెట్టిరి.

**పాండుకుమారులం బిలువఁబంచి**
**సుహృన్నివహంబునొద్దన**
**ప్పొండుఁ దలంచి నిర్గళిత బాష్ప**
**కరాళకపోల యుగ్ముడై**
**పాండు మహీశుకంటె నతి భకుల**
**మిమొకఁడేను బంచెదం**
**బాండు యశోర్థులార! యిది**
**పథ్యము కాఁగబదలంపుఁడాత్మనన్**
**విదితంబుగఁబుణ్యామర**
**నదీ సమీపమున వారాణావత నగరం**
**బది సర్వసుఖాస్పదమని**
**వదలక వర్ణింతు రెల్లవారును దానిన్**
**(ఆది 6–134)**

అంతటి ప్రయత్నము లేకున్న పాండవులు కదలరు. ప్రజలు కదలనీరు. పాండవుల పరోక్షమున దానాదులచే ప్రజలను తృప్తి వరిచి తమ ప్రక్కకు త్రిప్పుకొనిన తర్వాత వారు హస్తినాపురమునకు తిరిగి వచ్చినను భయములేదు అని దుర్యోధనుడు తండ్రికి చెప్పినాడు. అతడును కుమారుని ఆలోచనమునకు అంగీకరించినాడు. కాని దుర్యోధనుడు మాత్రము పాండవులు వారణావతమునందే శివైక్యమును పొందుటకు లక్కయింటిని కట్టించినాడు.

కౌరవనృపతులు ప్రజలను రంజింపజేయుటకే యత్నించిరి ప్రజలను ఆ నృపతుల యెడ గాఢావరముతోడనే వ్యవహరించిరి. వారి యనురాగము, కౌరవుల యెడ కన్న పాండవులయెడ మిన్నయన్న, పాండవుల గుణగణమే దానికి కారణము. వేరొండుగాదు. పాండవులను వారణావతమునకు పంపుటకు కుతంత్రము పన్నినపుడు ప్రజలు సంతాపించిరి. ధృతరాష్ట్రుడు ఇంతటి యన్యాయ్యమాచరించుచున్నాడే! భీష్మాదులు మిన్నకయుండిరేయని విలపించిరి. కాని అన్యాయ్యము నరికట్టుట ఎట్లో తెలియక వారు కొట్టుమిట్టాడిరి. పాండవులు అందరియొద్దను సెలవుతీసికొని వారణావతమునకుపోవుచుండ వారును ధర్మజుడుండు తావుననే తామును ఉండెదమన్నారు కాని వారిని ధర్మజుడే వారించెను. ప్రజ ఊరకుండక తప్పలేదు. ద్రుపదపురంబున పాండవులు సుఖులైయున్నారని తెలిసి ప్రజలు సంతసించిరి. వారిని చూచుటకు ప్రజలందరును ఉవ్విళ్ళూరుచుండిరి.

**– డా॥ చిలుకూరి సుబ్రహ్మణ్య శాస్త్రి**
**'జాగృతి' 19–07–1965 సంచిక నుంచి**

---

సత్కర్మాచరణ., పరమేశ్వరభక్తి విలసిల్లడానికి శంకరాచార్యులు అద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. సదాచారమును వీడడం అద్వైతసిద్ధికి ప్రతిబంధకమవడమే కాక నరకప్రాప్తికి, హీనజన్మలకును కారణం కాగలదని కర్మభక్తి జ్ఞానముల మూటిని ఉద్ధరించారు.

శంకరులు తమ కాలములో వైష్ణవులను, శైవులను, శాక్తులను, గాణపత్యులను, సౌరులను, పాశుపతులను కూడా అభినందించి విష్ణు, శివ, శక్తి, గణపతి, సూర్య పశుపతి నామాలతో పరాత్పరుని ఉపాసించడములో దోషం లేదని, ఈ ఉపాసనలన్నీ ఉపాసకులను ఉద్ధరిస్తాయని, ఈ మతాలవ వారు అవైదికాచారాలను విసర్జించుకొని తమ మతమును దృఢంగా నిలబెట్టుకోవాలని అనుశాసనం చేసి షణ్మతోద్ధారకులనే బిరుదును అందుకున్నారు.

మేధాశక్తికిని, శమదమాది సంపత్తికిని తోడుగా లోకజ్ఞతను కలిగి ఉండడం మహావేత్తల లక్షణం. శ్రీశంకరుల లోకజ్ఞత వారు నెలకొల్పిన నాలుగు పీఠాలలో వ్యక్తమవుతుంది. వైదికమత ప్రచారము మూలమూలల శాశ్వతంగా జరగాలంటే భారతావని నలుచెరగులు గురు పీఠాలు అవసరమని శంకరులు గుర్తించారు. అలా ఉత్తరాన బదరిలోను, దక్షిణంలో శృంగేరిలోను, తూర్పున పురీ జగన్నాథం, పశ్చిమం ద్వారకలో జగద్గురు పీఠాలను నెలకొల్పి వాటిలో తమ నలుగురు శిష్యులను ఆచార్యులుగా నియమించారు. ఆ పీఠాలు సమర్థులు, బ్రహ్మ జ్ఞాననిష్ఠులు, తపస్సంపన్నుల పర్యవేక్షణలో నేటికీ విజయవంతంగా సాగుతున్నాయి.

**జటావల్లభుల పురుషోత్తం**
**29.4.1955 జాగృతి నుంచి**

---

## వివేకానంద సూక్తిశతి

**All the strength and succour you want is within you therefore make your own future.**

**సర్వశక్తులన్ని సంక్రమించుకొనిన**
**శక్తిగలిగినట్టి సజ్జనుడవు**
**నీవు తెలుసుకొనుము నీలోని శక్తిని**
**వినుడి స్వామి సద్వివేకవాణి !!**





**బండిరాజుల శంకర్**



# నాగరికత

**ఐదు దశాబ్దాల తరువాత రామచంద్రుడు తన జన్మస్థలానికి మళ్లీ వస్తున్నాడు. అందుకే ఇది ప్రపంచంలోనే హిందువులందరికి తనువు పులకరించే మహోత్సవంగా రూపొందుతున్నది. అయోధ్యలో రామమందిర నిర్మాణమనే పరిణామాన్ని రాజకీయ కోణం నుంచి చూడడమే సరికాదు. ఈ చారిత్రక ఘట్టాన్ని నాగరికతకు సంబంధించిన పునరుజ్జీవనోద్యంగా భావించాలి. ఈ విధంగానే ఎక్కువ మంది భావిస్తున్నారు కూడా. అందుకే జనవరి 22 సమీపించే కొద్దీ దేశంలో మున్నెన్నడూ లేని ప్రత్యేక ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడుతున్నది. ఇది ఎన్నికల సంవత్సరం కాబట్టి మూస రాజకీయ పక్షాలు, వాటి రాజకీయ నాయకులు వక్ర భాష్యాలు చేస్తారు. ఇందులో ఆశ్చర్యపోవలసినదేమీ లేదు. అయినా భారతీయులంతా అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠను ఒక పుణ్యకార్యంగానే పరిగణిస్తున్నారు.**

నాలుగు వందల ఏళ్లపాటు హిందువుల గోడు, ఘోష ఎవరికీ పట్టలేదు. అయోధ్యలో మందిరం కూల్చి మసీదు కట్టారని మొత్తుకున్నా ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదు. ముస్లిం పాలకులో, ఆంగ్లేయులో ఇలాంటి ధోరణి ప్రదర్శించారంటే అర్థం చేసుకోవచ్చు. కానీ స్వతంత్ర భారతదేశంలో కూడా హిందువులు అదే పరిస్థితిని ఎదుర్కొనవలసి వచ్చింది. ఆఖరికి భారత అమృతోత్సవాలలో సుదీర్ఘ న్యాయపోరాటం ఫలితంగా రామ జన్మభూమికి విముక్తి లభించింది. ఇన్నాళ్లకి రాముడు తన సొంత ఇంటికి వెళుతున్నాడు. దీనిని ప్రధాని మోదీ, డిసెంబర్ 30న అయోధ్యలో మహర్షి వాల్మీకి విమానాశ్రయాన్ని ప్రారంభిస్తూ ఎంత చక్కగా చెప్పారు! దేశంలో నాలుగు కోట్ల మందికి నివాసాలు లభ్యమయినట్టే, ఇప్పుడు రాములవారికి కూడా ఒక ఇల్లు దొరికింది అన్నారాయన. జనవరి 22న దేశంలో ప్రతి ఇంటిలోను రామజ్యోతిని వెలిగించమని సూచించారు. ప్రజలు మాత్రం దీపావళి జరుపుకోవడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. నిజంగా ఇది హిందువులు తమ గళం వినిపించడానికి ఆధునిక భారత చరిత్రలో దక్కిన మొదటి అవకాశం. ఇళ్లలో దీపాలు వెలిగించి, ఊరిలోని రామాలయంలో భజనలు చేయబోతున్నారు. మోదీ పిలుపు మేరకు ఆలయాలను పరిశుభ్రం చేసే పని కూడా చేపట్టబోతున్నారు. అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠ పుణ్యకార్యం చూస్తే అవకాశం అందరికీ అందదు. భద్రతా సమస్యలు వంటివి ఉంటాయి. హిందూత్వానికే కాదు, భారత్‌కూ వ్యతిరేకులైనవారు రెచ్చిపోవడానికి అవకాశం ఇవ్వకూడదు కదా! అందుకే అక్కడ మహా కార్యానికి ఇక్కడ ఉడతా భక్తిగా భారతీయులంతా స్పందిస్తున్నారు.

భారతదేశంలో చాలా మతాలు ఉన్నాయి. చాలా చిత్రంగా హిందువులు తప్ప మిగిలిన మతాలవారు ఎవరైనా మతం గురించి చెప్పుకోవడానికి గర్వపడతారు. కానీ హిందువులకు ఆ అవకాశం లేదు. తాను హిందువునని చెప్పుకున్నా మతోన్మాదం కిందకి వస్తున్నది. అలా ఉండిపోవ డానికి హిందువు కూడా కారణమే. దేశం నిండా ఇన్ని తీర్థ స్థలాలు, పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. వాటికి హిందువుల రాకపోకలు కూడా తక్కువేమీ కాదు. అయినా దేశానికి, భారతీయతకీ, హిందువులకీ కలిపి అవి ఇస్తున్న ఐక్యతా సందేశాన్ని గాఢంగా స్వీకరించినవారు తక్కువ. ఇన్ని గ్రంథాలు ఉన్నా, వాటి సారాన్ని స్వీకరించే సంసిద్ధత కూడా లేదు. దీనిని అంగీకరించవలసి ఉంటుంది. దీనితో వచ్చిన పెద్ద లోటు, తమదైన ధర్మం గురించి గళం విప్పే ఆత్మ స్థయిర్యం వారిలో నానాటికీ అడుగంటి పోయింది. మరొక పక్క భారత్‌ను సెక్యులర్ దేశంగా ప్రకటించినా, అల్ప సంఖ్యాకులను బుజ్జగించడమే సెక్యులరిజం అంటే అర్థం పాలనలో పాతుకు



## నింగిలో నీలమేఘశ్యాముడి జెండా

నీలాకాశంలో విన్యాసాలు చేసే సాహస క్రీడ స్కైడైవింగ్. ఈ సాహస క్రీడను అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భానికి ఉపయోగించుకున్నది ఒక యువతి. బ్యాంకాక్‌లో ఒక యువతి 13000 అడుగుల ఎత్తుకు వెళ్లి అక్కడ ఒక పతాకాన్ని ఎగురవేసింది. అదే అయోధ్య మందిరం ఉన్న జెండా. ఆమె పేరు అనామికా శర్మ. నిజానికి ఆమె ఉత్తరప్రదేశ్‌లోనే ప్రయాగకు చెందిన యువతి. ఆమె రెండు కారణాలతో ఆ సాహసం చేశారు. ఒకటి అయోధ్య ప్రతిష్ఠకు (జనవరి 22) గుర్తుగా. రెండు ప్రయాగలోనే నివసించాడని నమ్మే భరద్వాజ మహర్షి కోసం. భరద్వాజుడు విమానశాస్త్రం రాశాడని చెబుతారు. ఏ కుర్రాడు కూడా చేయడానికి సాహసం చేయనంత విన్యాసం మా అమ్మాయి చేసింది. అక్కడ నుంచి కిందకి ఉరికిందంటే అదంతా రాములవారి ఆశీస్సులతోనే అన్నారు అనామిక తండ్రి అజయ్‌కుమార్ శర్మ, తల్లి ప్రియాంక. అనామిక చిన్నతనం నుంచే స్కైడైవింగ్ చేస్తున్నది. సైన్యం నుంచి పదవీ విరమణ చేసిన తండ్రే ఆమెకు స్ఫూర్తి. నిజానికి థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్. ఆ దేశంలో హనుమంతుడిని ఆర్తజన రక్షకునిగా ప్రజలు ఆరాధిస్తారు. ఆ ఆంజనేయుడే తనకు ప్రేరణ అని అనామిక చెప్పారు. (ఐఏఎన్ఎస్)



# మేల్కొంటున్న వేళ..

**జాగృతి డెస్క్**

పోయింది. అది కూడా హిందువును మౌన ప్రేక్షకునిగా మిగిల్చింది. ఆ మౌనం వీడిన క్షణం ఇటీవలనే వచ్చింది. దాని ఫలితమే అయోధ్య మందిర నిర్మాణం. మా పుణ్యక్షేత్రాలను మేం పవిత్రంగా చూసుకుంటామని, కాపాడుకుంటామని ఇప్పుడు చెప్పడానికి సిద్ధపడ్డారు. ఇంతకాలం ఏం జరిగింది? హిందూ పుణ్యక్షేత్రాలు ఏ దుస్థితిలో ఉన్నా, ఏ పేరుతో ఉన్నా, ఎవరి అధీనంలో ఉన్నా అందులోనే తమ దేవుళ్లను చూసుకున్నారు. అదే విషయాన్ని అనాటి బ్రిటిష్ అధికారులు విలియం ఫించ్, థామస్ హెర్బర్ట్, జోసెఫ్ టీఫెన్థలర్, రాబర్ట్ మాంట్‌గోమరి మార్టిన్ వంటివారు తమ తమ రచనలలో తెలియచేశారు. అయోధ్య మందిరంగా చెప్పుకునే స్థలాన్ని ముస్లింలు ఆక్రమించి బాబ్రీగా పిలుస్తున్నా కూడా ఓరిమితో దానిని హిందువులు పూజించుకున్నారు. గుడి మసీదుగా మారిపోయినా ఎంత భక్తిప్రపత్తులు కలిగి ఉన్నారో ఆ ఆంగ్లేయ రచయితలు నిజాయితీగా చెప్పారు.

అయోధ్య పోరాటం ముస్లిం ఆధిపత్య ధోరణి ఫలితం మరొకటి కాదు. కుహనా సెక్యులర్ వాదులు, నకిలీ చరిత్రకారులు ముస్లింలకు బ్రెయిన్ వాష్ చేయడం కారణం చెలరేగిన వివాదమని ప్రఖ్యాత పురావస్తు పరిశోధకుడు కెకె మహమ్మద్ ఎలుగెత్తి చాటారు. అయోధ్య మీద న్యాయపోరాటం ఇప్పటిదా! చాలా ఆధారాలను బట్టి 1858 నుంచి అది మొదలయింది. మరాఠాలు, నిహంగ్ సిక్కులు కూడా పోరాడినవారిలో ఉన్నారు. వారందరి కోరికా ఒక్కటే అక్కడ మళ్లీ రామమందిరాన్ని నిర్మించాలి. ఇందుకు చారిత్రక, సాహిత్య ఆధారాలు ఎన్నో! పురావస్తు ఆధారాలకీ లోటు లేదు. దానిని చరిత్రలో మసీద్ ఎ జన్మస్థాన్ అనే అన్నారు. బాబ్రీ అనేది తరువాత వచ్చిన పేరు. ఇన్ని ఆధారాలు ఉన్నా ఏం జరిగింది? స్వతంత్ర భారతంలోను అన్యాయమే. నెహ్రూ విశ్వాసాలకు ఒక సిద్ధాంతం ఉంది. ఆధునిక భారతదేశం అంటే, పాతది ఏదీ మిగలకూడదు. కళ, జ్ఞానం, విద్య ఏదీ కూడా పనికి రాదు. అయితే హిందువుల విశ్వాసాలకు సంబంధించినంత వరకే. హిందువుల ఆలయ సంపద, జ్ఞానం, గ్రంథాల వరకే. హిందూత్వ పునరుజ్జీవనానికి నెహ్రూ, ఆయన అనుయాయులు ఎంత వ్యతిరేకులో గుజరాత్ సోమనాథ్ మందిర జీర్ణోద్ధరణ విషయంలోనే, స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలోనే బట్టబయలయింది. దీని ఫలితం మాత్రం దారుణం. హిందువులకు అత్యంత పవిత్రమైన అయోధ్య, కాశీ, బృందావనం, ప్రయాగ, గయ, మధుర అన్నీ దారుణ నిర్లక్ష్యానికి గురయ్యాయి. అభివృద్ధికి సుదూరంగా ఉండి పోయాయి. తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. కానీ వాటి ఆదాయం మాత్రం ఉపయోగపడింది.

75 ఏళ్ల స్వతంత్రం తరువాత అయినా భారత దేశంలో హిందూ ఆరాధనా స్థలాల దుస్థితి మారలేదు. వాటికి అనుబంధంగా ఉండే విద్యా సంస్థలకు మంచిరోజులు రాలేదు. పది రాష్ట్రాలలో 1,10,000కు పైగా హిందూ ఆలయాలు ప్రభుత్వాల కబంధ హస్తాలలోనే ఉన్నాయి. తమిళనాడులో అయితే 4,78,000 ఎకరాల దైవమాన్యం రాష్ట్ర ప్రభుత్వమే చేజిక్కించుకుంది. అక్కడి 36,425 ఆలయాల మీద, 56 మఠాల మీద కూడా అక్కడి నాస్తిక ప్రభుత్వానిదే అజమాయిషీ. ఇది సెక్యులర్ భారతం నిజరూప దర్శనం. ఇక 1991 ప్రార్థనా స్థలాల చట్టం గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ఆక్రమణలో ఉన్న హిందూ దేవాల యాలను న్యాయపోరాటం ద్వారా సాధించుకునే హక్కును కూడా ఆ చట్టం హరించింది. తమదైన సాంస్కృతిక వారసత్వం మీద న్యాయపోరాటం చేసుకోవడానికి కూడా హక్కు లేకుండా పోయింది, నిన్నటి వరకు.

చిత్రంగా చాలా ముస్లిం దేశాలలో కూడా రోడ్ల నిర్మాణం వంటి అభివృద్ధి పనుల కోసం మసీదులను కూడా తరలిస్తున్నారు. లేదా కూలుస్తున్నారు. కానీ భారతదేశంలో మాత్రం సెక్యులరిజాన్ని రక్షించే బాధ్యత, అభివృద్ధి కోసం దేవాలయాలను త్యాగం చేయవలసిన అవసరం హిందువుల భుజస్కంధాల మీదనే ఉంటున్నది. పేదలకు ఇళ్ల స్థలాలంటే హిందూ దేవాలయాల భూములే గుర్తుకు వస్తాయి. వీటన్నిటికీ బలమైన సమాధానమే అయోధ్య మందిరం.

నోబెల్ సాహిత్య పురస్కార గ్రహీత వీఎస్ నయిపాల్ ఏమన్నారో ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. కొద్దికాలం క్రితమే కన్నుమూసిన ఆ సాహిత్యవేత్త రామ జన్మభూమి ఉద్యమాన్ని సరికొత్త చారిత్రక చైతన్యం అన్నారు. భారతీయులు తమ చరిత్ర పట్ల స్పృహను తెచ్చుకుంటున్నారని చెప్పారు. పురాతన భారతంలో జరిగిన విగ్రహ ధ్వంస రచన గురించి హిందువులు తెలుసుకుంటున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. భారతదేశ సెక్యులరిజం సర్వ మత సమ భావనతో లేనేలేదని చెప్పిన బీజేపీ మాట నిజమని తేలింది. అది అక్షర సత్యం, చారిత్రక సత్యం కాబట్టే హిందూ సమాజంలో ఇంత చైతన్యం వచ్చింది. తమ గళాన్ని వినిపించడానికి హిందువు లకు ధైర్యసాహసాలు ఇచ్చిన ఆర్ఎస్ఎస్, బీజేపీ, వీహెచ్‌పీ వంటి అన్ని హిందూ సంస్థలను ఆధునిక భారతదేశం అభినందించాలి. ఇంత హిందూ పునరుజ్జీవనోద్యమం జరిగినా దేశంలో ఎక్కడా మూకుమ్మడిగా మసీదులు, చర్చల కూల్చివేతలు జరగలేదు. కాబట్టి హిందూత్వానిదే అసలు సెక్యుల రిజమని ఇప్పటికైనా ప్రపంచం నమ్మాలి. ★

# ఈశాన్యంలో శాంతి

**అస్సాంలో శాంతి సుస్థిరతలు నెలకొనడానికి పరిస్థితులు సానుకూలమయ్యాయి. యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అస్సాం (ఉల్ఫా) 'చర్చల అనుకూల వర్గం', కేంద్ర ప్రభుత్వం మధ్య డిసెంబర్ 29న కుదిరిన ఒప్పందం దాదాపు నాలుగున్నర దశాబ్దాలుగా అశాంతితో రగులుతున్న అస్సాంలో హింసాత్మక దాడులకు చరమగీతం పాడి, శాంతివీచికలకు మార్గం సుగమం చేసింది.**

ప్రస్తుత ఒప్పందాన్ని బహుకాలంగా అస్సాంను కృంగదీస్తున్న దీర్ఘకాల సమస్యలకు పరిష్కార సాధనలో ముందడుగుగా పరిగణించాలి. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, అస్సాం ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వ శర్మ సమక్షంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కుదిరిన త్రైపాక్షిక ఒప్పందంపై ఉల్ఫా ఉగ్రవాద సంస్థ 'చర్చల అనుకూల వర్గం' నాయకులు సంతకాలు చేశారు. ఉల్ఫా ఛైర్మన్ అరవింద్ రాజ్‌కోవా నేతృత్వంలోని 16 మంది ప్రతినిధులతో పాటు, 13గురు పౌర సమాజ సంస్థలకు చెందిన ప్రతినిధులు కూడా ఈ చర్చల్లో పాల్గొన్నారు. ఆ విధంగా అస్సాం హింసా కాండ చరిత్రలో డిసెంబర్ 29 ఒక "రెడ్ లెటర్ డే"గా నిలిచిపోయింది. అయితే ఈ ఒప్పందంలో పరేష్ బారువా నేతృత్వంలోని హార్డ్‌లైన్ గ్రూపు భాగస్వామి కాకపోవడంతో, ఇంకా సమస్యకు పూర్తి స్థాయి పరిష్కారం లభించినట్లు కాదు. ఈ ఒప్పందం కుదిరిన నేపథ్యంలో శర్మ, అరవింద్ రాజ్‌కోవాలు, పరేష్ బారువాతో శాంతి చర్చల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లే అవకాశముంది. ప్రస్తుతం బారువా చైనా-మయన్మార్ సరిహద్దుల్లో ఉంటున్నట్టు అనుమానిస్తున్న నేపథ్యంలో అస్సాంలో హింస నిలిచిపోతుందని భావించడానికి వీల్లేదు.

### కీలక పరిణామం

1979నుంచి అస్సాంలో కొనసాగిన హింసా కాండ వల్ల దాదాపు 10వేల మంది అసువులు కోల్పోగా వీరిలో 400–500 మంది భద్రతా సిబ్బంది, మిగిలిన వారు అమాయక అస్సాం ప్రజలు. ఈ ఒప్పందం ప్రకారం ఉల్ఫా నాయకులు తమ సంస్థను రద్దు చేయడంతో పాటు, ప్రజాస్వామ్య స్రవంతిలోకి ప్రవేశిస్తారు. ఇక ఈ సంస్థ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఏవిధమైన హింసాకాండకు, దాడులకు పాల్పడబోదు. అస్సాంలో అత్యంత పురాతన ఉగ్రవాద సంస్థ 'ఉల్ఫా' పెద్ద తలనొప్పిగా, కంటిలో నలుసుగా మారిన నేపథ్యంలో కేంద్రం, ఉల్ఫా ఉగ్రవాద సంస్థకు చెందిన అరవింద్ రాజ్‌కోవా నేతృత్వంలోని 'చర్చల అనుకూల వర్గం' మధ్య గత 12ఏళ్లుగా కొనసాగుతున్న నిరంతర చర్చలు ఎట్టకేలకు శుక్రవారం (డిసెంబర్ 29) ఒక కొలిక్కి రావడం, ఈమేరకు కుదిరిన ఒప్పందంపై సంతకాలు జరగడం, సమస్య పరిష్కార దిశగా కీలక పరిణామం. అస్సాం ఉద్యమానికి ముందు, తర్వాత ఉల్ఫా అత్యంత బలీయంగా మారినప్పటికీ అగ్రనాయ కత్వంలో విభేదాలు నిరంతరం కొనసాగడం చరిత్ర. ఈ నేపథ్యంలో చర్చలకు అనుకూలంగా ఉన్న రాజ్‌కోవా, అనూప్ ఛెటియా గ్రూపు తమ కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో ఒక ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత సెప్టెంబర్ 3, 2011 నుంచి కేంద్రంతో చర్చలు ప్రారంభించింది. అయితే ఇదే సంస్థకు చెందిన పరేష్ బారువా నేతృత్వంలోని హర్డ్‌లైన్ గ్రూపు ప్రభుత్వంతో చర్చలను తీవ్రంగా విభేదించింది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత చర్చలకు బారువా దూరంగా ఉండటమే కాకుండా, ఉల్ఫా (ఇండిపెండెంట్) పేరుతో కొత్త గ్రూపును ఏర్పాటు చేశాడు.

### బలీయమైన ఉగ్రవాద సంస్థ


ప్రస్తుతం ఉల్ఫా ఉగ్రవాద సంస్థకు చెందిన స్థావరాలు బంగ్లాదేశ్, భూటాన్, మయన్మార్‌లలో ఉన్నాయి. కొంతమంది ఉగ్రవాదులకు చైనా, పాకిస్తాన్‌లు శిక్షణ ఇస్తున్నాయి కూడా. ఒక దశలో ఈశాన్య భారత్‌లోని ఉగ్రవాద సంస్థల్లోకెల్లా, ఉల్ఫా అత్యంత ప్రమాదకరమైనదిగా పరిగణించేవారు. అంతేకాదు ఆసియాలో ఎల్.టి.టి.ఇ. తర్వాత అత్యంత బలమైన తీవ్రవాద సంస్థగా గుర్తింపు పొందింది. 1979, ఏప్రిల్ 7వ తేదీన అస్సాంలోని శివసాగర్‌లో ఉల్ఫా ఏర్పాటైంది. రాష్ట్రంలోని స్థానిక ప్రజలకోసం స్వతంత్ర అస్సాం ఏర్పాటు ఈ సంస్థ వ్యవస్థాపక నేతల ప్రధాన లక్ష్యం. 1980నుంచి సాయుధ దాడులకు పాల్పడటం ప్రారంభించిన తర్వాత పరేష్ బారువా, అరవింద్ రాజ్‌కోవా, అనూప్ ఛెటియాలు సంస్థలో అగ్ర నాయకులుగా చలామణి అయ్యారు. తొలినాళ్లలో నిరుపేదలకు అండగా ఉంటూ వచ్చిన ఉల్ఫా క్రమంగా భారత ప్రభుత్వంపై సాయుధ పోరాటం మొదలుపెట్టింది. 1990 ప్రాంతంలో ఉల్ఫా కార్యకలాపాలు




పతాకస్థాయిలో కొనసాగినప్పుడు, సమాంతర ప్రభుత్వాన్ని నడిపిందనే చెప్పాలి. అదే ఏడాది ఉల్ఫా నాయకత్వం ఏకంగా టాటా టీ, మెక్‌లియోడన్ రసెల్, యూనిలివర్, మ్యాక్‌నియర్ మ్యాగర్ వంటి టీ కంపెనీల ఎగ్జిక్యూటివ్‌లను చర్చలపేరుతో దిబ్రూగఢ్‌కు పిలిపించి ఏకంగా కోట్లాది రూపాయలు డిమాండ్ చేసింది. ఈవిధంగా సాయుధపోరాటం పేరుతో వివిధ సంస్థలనుంచి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న నేపథ్యంలో ఎం.ఎన్.సి. వంటి అంతర్జాతీయ సంస్థలు, ఉల్ఫా ఆగడాలకు అడ్డుకట్ట వేయడానికి కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఒత్తిడి తీసుకురావడంతో కేంద్రం రంగంలోకి దిగి1990లో ఈ సంస్థను నిషేధించడమే కాకుండా, 'ఆపరేషన్ బజరంగ్' పేరుతో ఉల్ఫాపై సైనికచర్య జరిపింది.

### మారిన ప్రభుత్వ వైఖరి

నిజానికి ఒప్పందాన్ని పరిశీలిస్తే, ప్రభుత్వం ఇప్పటివరకు అనుసరిస్తున్న విధానంలో మార్పు ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. 2005లో కేంద్ర ప్రభుత్వం



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

మొట్టమొదటిసారి సర్వాధికారంతో పాటు, ఉల్ఫా లేవనెత్తిన పలు అంశాలపై చర్చించడానికి అంగీక రించింది. అస్సాంలోని మోరన్, ముట్టోక్, తాయ్–అ హోమ్, కోచ్–రాజ్‌బోన్గ్షి, సూటీ, టీ–గిరిజన తెగలను ఎస్టీలుగా పరిగణించాలన్నది ఉల్ఫా ప్రధాన డిమాండ్. ప్రభుత్వం ఇందుకు అంగీకరిస్తే, అస్సాం లోని 50శాతం ప్రజలు ఎస్టీ వర్గాలకిందికి రావడమే కాదు, దేశంలోనే అత్యధిక ఎస్టీ జనాభా కలిగిన రాష్ట్రంగా రూపొందుతుంది. దీంతోపాటు భూ రిజర్వేషన్ విధానాలు, అస్సాం స్థానిక ప్రజలకు హక్కుల కల్పన, పరిరక్షణతో పాటు పౌరుల జాబితాను తయారు చేయడం కూడా ఉల్ఫా డిమాండ్‌లో భాగంగా ఉన్నాయి. ఇక పౌరుల జాబితా తయారీవల్ల వలస వచ్చినవారు ఎవరన్నదీ స్పష్టమవుతుంది. ప్రస్తుతం కుదిరిన ఒప్పందం ప్రకారం అస్సాంలో కేంద్రం రూ.లక్షన్నర కోట్లు వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల కోసం ఖర్చు చేస్తుంది.ఆర్థిక ప్యాకేజీ ప్రకటించడంతో ఈ ప్రాంత అభివృద్ధితో పాటు, ఉల్ఫా ఉగ్రవాదుల పునరావాస కల్పనకు వీలు కలుగుతుంది. స్థానిక ప్రజల ప్రయోజనాలు పరిరక్షించే రీతిలో, నియోజక వర్గాల సరిహద్దులను నిర్ధారిస్తారు. ఆవిధంగా స్థానికుల రాజకీయ హక్కులు, రాజ్యాంగపరమైన ప్రయోజనాల పరిరక్షణ జరుగుతుంది. దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచని అస్సాం ప్రజల రాజకీయ, ఆర్థిక, సామాజిక, భూమి, సాంస్కృతిక సమస్యల పరిష్కారాలను కూడా ఈ ఒప్పందంలో చేర్చారు. ఉల్ఫా చేస్తున్న డిమాండ్లను నియమిత కాలావధిలో పరిష్కరించేందుకు కేంద్రం కృషి చేయడమే కాదు, వీటి పర్యవేక్షణకు ఒక కమిటీని కూడా ఏర్పాటు చేయనుంది. 2019తర్వాత కుదిరిన ఒప్పందాలను నిర్దేశిత కాలానికంటే ముందుగానే అమలు పరిచేందుకు కేంద్రం కృషిచేస్తున్నదని ఈ సందర్భంగా హోంమంత్రి అమిత్ షా పేర్కొనడం గమనార్హం. కేవలం ప్రధాని విశాల దృక్పథం వల్లనే ఇది సాధ్యమైందన్న సంగతిని ఆయన గుర్తుచేశారు.

**తొమ్మిది ఒప్పందాలు**

2014లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఐదేళ్లకాలంలో ఈశాన్య భారత్‌కు చెందిన వివిధ చొరబాటు గ్రూపులతో తొమ్మిది ఒప్పందాలను కుదుర్చుకుంది. 2019లో త్రిపురకు చెందిన ఎన్ఎల్ఎఫ్‌టి చొరబాటు గ్రూపుతో, 2020లో బ్రూ, బోడో గ్రూపులతో, 2021లో అస్సాంకు చెందిన కర్బీ గిరిజన గ్రూపులు, 2022లో ఆదివాసి గ్రూపుతో కేంద్రం ఒప్పందాలు కుదుర్చుకుంది. అదేవిధంగా 2023లో అస్సాం–మేఘాలయ, అస్సాం– అరుణాచల్‌ప్రదేశ్‌ల సరిహద్దు ఒప్పందాలతోపాటు మణిపూర్‌కు చెందిన యుఎన్ఎల్ఎఫ్ గ్రూపుతో కూడా ఒప్పందాలు కుదిరాయి. వీటన్నింటి ఫలితంగా అస్సాంలో హింసాత్మక సంఘటనలు 87శాతం, మరణాలు 90శాతం, కిడ్నాప్‌లు 84శాతం తగ్గిపోయాయి. లొంగిపోయిన 9వేలమంది ఉగ్రవాదుల్లో 7500మంది కేవలం అస్సాంకు చెందినవారే కావడం గమనార్హం. తర్వాత సాయుధ దళాల ప్రత్యేకాధికార చట్టం (ఎ.ఎఫ్.ఎస్. పి.ఎ)ను 85శాతం ప్రాంతాలలో ప్రభుత్వం తొలగించింది. వీటన్నింటి ఫలితంగా ఈ ప్రాంతంలో చాలావరకు శాంతి సుస్థిరతలు నెలకొన్నాయి.ఉల్ఫాతో కుదిరిన తాజా ఒప్పందంతో మొత్తం ఈశాన్య భారత్‌లో శాంతికి సంబంధించి సరికొత్త అధ్యాయానికి తెరలేచింది.ఈ ఒప్పందం అమల్లోకి వచ్చాక మరో 726 మంది లొంగుబాట పట్టడంవల్ల సంఖ్య 8200కు చేరుతుందని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ అంచనా వేస్తున్నారు. అయితే ఉల్ఫా హార్డ్‌లైనర్ పరేష్ బారువాను కూడా చర్చలకు రప్పించడంలో హిమంత్ ఎంతమేర కృతకృత్యత సాధిస్తారనేది వేచి చూడాలి. ఇది సాధ్యమైతే, అస్సాం సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్టే! ★




## ఉల్ఫా చరిత్ర

- ఏప్రిల్ 7,1979న అస్సాంలోని రంగ్‌ఘర్‌లో ఉల్ఫా ఏర్పాటైంది.
- 1980లో కాంగ్రెస్ నాయకులు, ఇతర రాష్ట్రాల వ్యాపారులు, తేయాకు తోటలు, ప్రభుత్వరంగ సంస్థలు ముఖ్యంగా చమురు–సహజవాయు సంస్థలే లక్ష్యంగా దాడులు.
- 1985–90: ప్రఫుల్లకుమార్ మహంతా నేతృత్వంలోని అస్సాం గణ సంగ్రామ పరిషత్ ప్రభుత్వం తొలివిడత అధికారంలోకి రాగానే, ఉల్ఫా హింస, కిడ్నాప్‌లు, హత్యలు యథేచ్ఛగా కొనసాగాయి. ఈ బాధితుల్లో రష్యా ఇంజినీరు సర్గోయ్ ఒకరు.
- నవంబర్ 28,1990: కేంద్రం 'ఆపరేషన్ బజరంగ్' పేరుతో సైనిక చర్య.
- నవంబర్ 29,1990: మహంతా ప్రభుత్వం రద్దు. రాష్ట్రపతి పాలన.
- 1990 నవంబర్: అస్సాంను కల్లోలిత ప్రాంతంగా ప్రకటించి, సాయుధ దళాల ప్రత్యేక అధికార చట్టాన్ని కేంద్రం అమల్లోకి తెచ్చి, ఉల్ఫాను వేర్పాటువాద, చట్టవ్యతిరేక సంస్థగా ప్రకటించింది.
- జనవరి 31,1991,: ఆపరేషన్ బజరంగ్ నిలిపివేత.
- 1991, సెప్టెంబర్: ఆపరేషన్ రైనో పేరుతో ఉల్ఫాపై మరొక సైనికచర్య.
- 1992, మార్చి: ఉల్ఫా రెండుగా చీలిపోయింది. ఒకటి సరెండర్డ్ ఉల్ఫా(సుల్ఫా) అంటే లొంగిపోయిన ఉల్ఫాగా ఏర్పడింది.
- 1997–2000: ఉల్ఫా ఉగ్రవాదుల కుటుంబ సభ్యుల హత్యలు అప్రతి హతంగా కొనసాగాయి. 'రహస్య హత్యల' పేరుతో సుల్ఫా ఈ ఘాతు కానికి పాల్పడిందన్న ఆరోపణలు వచ్చాయి.
- 2003, డిసెంబర్: భూటాన్ ఆర్మీ "ఆపరేషన్ ఆల్ క్లియర్' సైనిక చర్య.
- 2004: చర్చలకు ఉల్ఫా అంగీకారం.
- 2008, జూన్: ఉల్ఫా 28వ బెటాలియన్ ఏకపక్ష కాల్పుల విరమణ ప్రకటన.
- 2010, డిసెంబర్: జైల్లోని ఉల్ఫా నేతలచే 'సిటిజన్ ఫోరమ్' ఏర్పాటు. చర్చల కోసం ప్రభుత్వాన్ని అభ్యర్థించడం దీని ప్రధాన లక్ష్యం.
- 2012:12 డిమాండ్లతో కూడిన చార్టర్ ప్రభుత్వానికి సమర్పణ.
- 2015: 18 ఏళ్ల శిక్ష తరువాత ఉల్ఫా ప్రధాన కార్యదర్శి అనూప్ చెటియా బంగ్లా జైలు నుంచి విడుదల.
- 2021 మే: హిమంత బిశ్వ శర్మ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు. పరేష్ బారువా ఉల్ఫా (ఐ) గ్రూపుతో చర్చలకు సుముఖం.
- 2023 ఏప్రిల్: ఉల్ఫా చర్చలకు అనుకూల వర్గానికి కేంద్రం ప్రతిపాదిత ఒప్పందానికి సంబంధించిన ముసాయిదాను పంపింది.
- 2023, డిసెంబర్ 29: కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం, ఉల్ఫా (చర్చల అనుకూల వర్గం) మధ్య త్రైపాక్షిక ఒప్పందం.



# అక్షరార్చనలో

**స్వరాజ్య ఉద్యమానికి సమాంతరంగా సాగిన వాటిలో గ్రంథాలయ ఉద్యమం ప్రధానమైంది. నిరక్షరాస్యత నిర్మూలన, అక్షరజ్ఞానం వితరణకు విద్యావేత్తలు, దేశభక్తులు, సంస్కర్తలు, వదాన్యులు గ్రంథాలయాల స్థాపనకు నడుం కట్టారు. విజ్ఞాన జ్యోతులు వెలిగించారు. అలాంటి వాటిలో ముందు నిలిచే అరుదైన 'పుస్తక గుడి' ఉమ్మడి ప్రకాశం జిల్లా వేటపాలెంలోని 'సారస్వత నికేతనము'. దేశంలోని ప్రఖ్యాత మొదటి పది గ్రంథాలయాలలో దీనితో పాటు రాజమహేంద్రవరంలోని గౌతమీ గ్రంథాలయం మొదటి వరుసలో ఉంటాయి. గౌతమీ గ్రంథాలయం వ్యవస్థాపకుడు నాళం కృష్ణారావు సమీప బంధువు ఊటుకూరి వెంకట సుబ్రాయ శ్రేష్ఠి వేటపాలెం సారస్వత నికేతనముకు జీవం పోశారు. సొంత ధనంతో అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చారు. 105 వసంతాల పుస్తక భాండాగారం గురించి.....**

చిరిగిన చొక్కా తొడుక్కో. మంచి పుస్తకం కొనుక్కో' అని నినాదం. అది గ్రంథాల, వాటి పఠనం విలువను తెలియచేస్తుంది. అలా పుస్తకాలు కొనుగోలు చేయలేని వారికి, బయట అందుబాటులో లేని పుస్తకాలకు విజ్ఞాన కల్పతరువులు గ్రంథాలయాలు. అలాంటి అరుదైన విజ్ఞాన మందిరాలలో ముందు వరుసలో నిలిచేది ఉమ్మడి ప్రకాశం జిల్లా వేటపాలెంలోని 'సారస్వత నికేతనం'. అరుదైన పుస్తకాలకు చిరునామా. పరిశోధకులకు అండ. వారు ఎన్ని ప్రాంతాలు, ప్రదేశాలు పర్యటించినా 'సారస్వత నికేతనం' సందర్శనంతోనే తమ పరిశోధన ప్రయత్నం సఫలమైనట్లు భావిస్తారు. దీనినే బట్టే దాని విశిష్టత అవగతమవుతుంది.

ఒకనాటి (1918) కుగ్రామం వేటపాలెంలో ఔత్సాహిక యువకులు కొందరు అదే సంవత్సరం అక్టోబర్ 15న విజయదశమి నాడు 'హిందూ యువజన సంఘం' పేరిట పఠనాలయం ఏర్పాటు చేశారు. వారి విజ్ఞానాభిలాషను, పఠనాసక్తిని గమనించిన భాషాభిమాని, సాహిత్యాభిలాషి ఊటుకూరి సుబ్రాయ శ్రేష్ఠి దానికి 'సారస్వత నికేతనం'గా నామకరణం చేసి దాని నిర్వహణ బాధ్యతలను భుజానికెత్తుకున్నారు. గ్రామంలోని ఒక పెంకుటింటిని 2023లో కొనుగోలు చేసి బాగు చేయించి మరుసటి ఏడాది, 1924 సెప్టెంబర్ 24న గ్రంథాలయాన్ని అందులోకి మార్చారు. మహాత్మా గాంధీకి అత్యంత సన్నిహితులు, దేశభక్తుడు సేఠ్ జమన్‌లాల్ బజాజ్ భవనాన్ని ప్రారంభించారు. గ్రంథాలయ శాశ్వత భవన (నేటి) నిర్మాణానికి గాంధీజీ ఏప్రిల్ 18, 1929న శంకుస్థాపన చేశారు. భవనాన్ని ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ప్రారంభించారు

ఆ భవనమే అనంతర కాలంలో కొంత మేర హంగులు సమకూర్చుకుంది. అక్షరజ్ఞానంతో సమాజాన్ని చైతన్య పరచాలన్న సంకల్పంతో సుబ్రాయ శ్రేష్ఠి ఈ సాహిత్య నిలయం కోసం ఇతోధికంగా ధన సహాయం చేశారు. 'సారస్వత నికేతనం' ఆధ్వర్యంలో సంచార గ్రంథాలయాలు నిర్వహించారు. పఠనాలయం నిర్వహణకు పది మంది సభ్యులతో బృందాన్ని నియమించారు. గాంధేయవాది గోరంట్ల వెంకన్న ఆరంభంలో భారీ విరాళం ఇచ్చారు. సుబ్రాయ శ్రేష్ఠి తదనంతరం వారి అర్ధాంగి కమలాంబ గ్రంథాలయం అభివృద్ధికి సంపూర్ణ అండదండలు అందించారు. అనంతరం అడుసుమిల్లి శ్రీనివాసరావు పంతులు దీని ప్రగతికి నడుం కట్టారు. ప్రస్తుత అధ్యక్ష కార్యదర్శులు పి.వెంకట్, కె.శ్రీనివాసరావు అదే ఒరవడిని కొనసాగిస్తున్నారు.



సారస్వత నికేతనము వ్యవస్థాపకు దంపతులు సుబ్రాయ శ్రేష్ఠి, కమలాంబ

రెండు దినపత్రికలు, పదుల పుస్తకాలతో ఆరంభమైన ఈ గ్రంథాలయం శత వసంతోత్సవాల నాటికి దాదాపు లక్ష 40 వేల పుస్తకాలకు చేరుకుంది. అలనాటి విశిష్ట దినపత్రిక 'ఆంధ్రపత్రిక' దాని అనుబంధ సాహిత్య మాసపత్రిక 'భారతి' సహా కృష్ణాపత్రిక, 'ఆంధ్రప్రభ',గృహలక్ష్మి, తెలుగు స్వతంత్ర పత్రిక, అనంతర కాలంలో ప్రారంభమైన ప్రముఖ దిన,వార, పక్ష, మాస, త్రైమాసిక పత్రికలు, ఉగాది తదితర ప్రత్యేక సంచికలు, అరుదైన తాళపత్ర గ్రంథాలు, పాఠకులు, పరిశోధకుల అక్షర తృష్ణను తీరుస్తున్నాయి. శ్రీమద్రామాయణ, మహాభారత, భాగవతాలతో పాటు అష్టాదశ పురాణాలు, భగవద్గీత, బైబిల్, ఖురాన్, నవలలు, కథలు, కథా సంపుటాలు, వ్యాస సంకలనాలు, కవితా సంకలనాలు, మార్క్సిజం లాంటి వివిధ భావజాలాలకు సంబంధం చిన తెలుగు,



**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**
సీనియర్ జర్నలిస్ట్




# 'వేట'పురి పఠనాలయం

ఆంగ్లభాషలలో పుస్తకాలు కొలువు దీరాయి.

పాత్రికేయంపై 1950లోనే ఇక్కడ తరగతులు నిర్వహించారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు వావిలాల గోపాలకృష్ణయ్య వాటికి ప్రధానా చార్యులుగా వ్యవహారించారు. ఉన్న వనరులతోనే వయోజన విద్యా కేంద్రం, హిందీ శిక్షణ కేంద్రం, వివిధ రకాల సభలు, సమావేశాలు, గోష్ఠులు నిర్వహిస్తున్న ఏకైక గ్రంథాలయంగా మన్ననలు అందుకుంటోంది.

**ప్రముఖుల సందర్శన**

105 ఏళ్ల చరిత్ర కలిగిన ఇది కేవలం విజ్ఞాన భాండాగారమే కాదు... స్వరాజ్య, అంతర్జాతీయ సహకార ఉద్యమాలకు వేదికైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పుస్తక పఠనం, తరువాతి నుంచి పొద్దుపోయే దాకా జాతీయోద్యమ గీతాలు, భజనలు, ఆధ్యాత్మిక చర్చలతో గ్రంథాలయ ప్రాంగణంలో ఉత్సాహ వాతావరణం ఉండేదని నాటి తరం పెద్దలు గుర్తు చేసుకొంటుంటారు. అలనాటి రాజకీయ, సాహితీ ప్రముఖులలో దీనిని సందర్శించని వారులేరు. స్వతంత్ర భారత తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ (బాబూజీ దీనిని 'జ్ఞాన మందిరం'గా అభివర్ణించారు) సహా చిలకమర్తి లక్ష్మీనరసింహం, కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు, అయ్యంకి వెంకట రమణయ్య, వెలగా వెంకటప్పయ్య, విశ్వనాథ సత్యనారాయణ. కట్టమంచి రామలింగారెడ్డి, ఉన్నవ లక్ష్మీనారాయణ, తుమ్మల సీతా రామమూర్తి, రాయప్రోలు సుబ్బారావు, శ్రీశ్రీ మున్నగు ఎందరో సమరయోధులు, జాతీయ నాయకులు, మహాకవులు, కళాకారులు సందర్శించారు. సందర్శకులు పుస్తకాలలో వారు నమోదు చేసిన అమూల్య అభిప్రాయాలు, సందేశాలు నేటికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. గాంధీజి రెండవసారి (1935లో) దీనిని సందర్శించారు. ఆ సందర్భంగా దెబ్బతిన్న ఆ చేతి కర్రను గ్రంథాలయ పాలకలుఉ సరిచేయించి భద్రపరిచారు. అది నేటికి దర్శనం ఇస్తుంది.

**డిజిటలైజేషన్ ఆవశ్యకత**

ముట్టుకుంటూ చిరిగిపోయే/విరిగిపోయే స్థితిలోని పత్రికల, పుస్తకాలను పరిరక్షించుకునేందుకు వాటిని డిజిటలైజ్ చేయవలసిన అవసరం ఉంది. తిరుమల తిరుపతి దేవస్థానం, రాజిరెడ్డి ఫౌండేషన్, హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆదప్రముఖ వ్యాపారసంస్థ ఐటీసీ, వాణిజ్య ప్రముఖులు బొమ్మిడాల బ్రదర్స్ కృష్ణమూర్తి, ప్రభుత్వ అధికారుల చొరవతో ఆ దిశగా కొంత తోడ్పాటును అందించాయి.

**చేయూత అవసరం**

శతాధిక వసంతాలు పూర్తి చేసుకున్న ఈ (వి)జ్ఞాన మందిరం ఆది నుంచి ట్రస్టీ ఆధ్వర్యంలోనే నడుస్తోంది. ప్రభుత్వ ఆర్థిక సహాయానికి నోచుకో లేదు. ప్రభుత్వ పరంగా అండదండలు అందలేక పోయినా, దాతల సహకారంతో పాలక మండలే ముందుకు నడిపిస్తోంది. రజతోత్సవం (1944), స్వర్ణోత్సవం (1972)వజ్రోత్సవం (1993), శతవార్షి కోత్సవం (1918) నిర్వహించింది. అందుకు ప్రముఖ వ్యాపారసంస్థ ఐటీసీ, వాణిజ్య ప్రముఖులు బొమ్మిడాల బ్రదర్స్ కృష్ణమూర్తి, ప్రభుత్వ అధికారులు, ఉదారులు సహకరించారు.

'తరతరాల ఈ సాహిత్య సంపదను కాపాడుకునేందుకు ప్రభుత్వం ఈ గ్రంథాలయానికి మౌలిక సదుపాయాలు కల్పించాలి. మరింత సమర్థంగా సేవలు అందించేందుకు ఉన్న సిబ్బందికి అదనంగా ఉద్యోగుల సంఖ్యను పెంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద వేతనాలు చెల్లించాలి. ఇందుకు ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి. ప్రముఖ పత్రికల యాజమాన్యాలు ఉచిత ప్రతులతో పాటు ఆర్థిక సహకారం అందించవలసి ఉంది' అని సారస్వత నికేతన్ సందర్శించిన ఈ వ్యాసకర్త వద్ద పాఠకులు,స్థానికులు అభిప్రాయపడ్డారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఎన్నో ఉచిత పథకాలతో పోల్చి చూస్తే, ఇలాంటి పుస్తక నిలయాలకు వెచ్చించే నిధులు అంత భారం కాబోవని కూడా వ్యాఖ్యానించారు.

దేశం నలుమూలల నుంచే కాక, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా తదితర విదేశాల నుండి పరిశోధకులు దీనిని సందర్శిస్తుంటారు. పరిశోధకులకు, పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి, ముఖ్యంగా పేద, మధ్య తరగతి యువతకు ఇది అక్షర కల్పతరువే! ★



### సేవా భావనే ప్రధానం..

రాజమహేంద్రవరంలోని గౌతమి గ్రంథాలయం తరువాత అంతటి విస్తృతి, చరిత్ర కలిగిన ఏకైక పుస్తకభాండాగారం ఇదే. నిత్యం పెద్ద సంఖ్యలో పాఠకులు దీనిని సందర్శిస్తుంటారు. వివిధ అంశాలపై పరిశోధనలు చేస్తున్నవారితో పాటు సివిల్స్ తదితర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారు దీనిని సందర్శిస్తుంటారు. ఇక్కడ లాభాపేక్ష కంటే సేవాభావనే ప్రధానం. అందుకు పాలకవర్గ అందిస్తున్న సహకారం విలువకట్టలేనిది.

**– డి. శ్రీవల్లి, గ్రంథాలయ పాలకులు**

***సంకురాత్రిపండుగదిగదిగో !***
***సంకురాత్రి ముగ్గులివిగివిగో !***
***చలియింక పోతుంది చంకలెత్తి ఆడండి !***

సంక్రాంతిని స్వాగతిస్తూ పల్లెపల్లెలా ఇలాంటి పాటలెన్నో వింటూంటాం. పండుగకు, ముందు ధనుర్మాసంలో పల్లెపట్టుల్లో చైతన్యం పొంగి పొర్లుతూ ఉంటుంది. ఎముకలు కొరికే చలిలో కూడా ఇంటిల్లిపాది మేల్కొని ఇల్లూ వాకిళ్లూడ్చి, కళాపి చల్లి, రంగవల్లులు వేసి, వాటిమీద గొబ్బెమ్మలను పెట్టి–

***గొబ్బీయ్యలో; గొబ్బీయలో!***
***గొబ్బి, గొబ్బి, వేయరమ్మా***
***గొబ్బాని లాలయో గొబ్బీయలో!***
***కుందంత గుమ్మడే గొబ్బీయలో!***
***కోరమీసం నాయుడే గొబ్బీయలో!***

అంటూ ఎరిగిన వాళ్లందర్నీ ఎకసెక్కాలు పట్టిస్తూ ఆనందిస్తూ ఉంటారు.

ధనుర్మాసపు చలిలో బద్ధకం మనుషుల నావహించడానికి అనువైనకాలం. కాని పనంతా అప్పుడేనాయె. ధాన్యాన్నింటికి చేరవేయాలి. లేకపోతే సంవత్సరపు శ్రమా దండుగే. సాతాని జియ్యర్లు, దాసర్లు, జంగమదేవర్లు, చుట్టుప్రక్కల అడవులలో ఉండే చెంచులు, అప్పన్న ఆబోతుల సంభ్రమముల వాళ్లు, బుడబుక్కలవాళ్లు మొదలైనవారు ఆ బద్ధకాన్ని వదలగొడతారు! ఎంత నిద్రలో ఉన్నా "హరిలోరంగ హరి" అంటూ సాతాని జియ్యరు కమ్మని కంఠం భూపాలరాగం ఆలపిస్తుంటే పక్కలో ఉండబుద్ధే కాదు. ఒకవేళ కొంచెం బద్ధకించినా జంగందేవర ప్రభృతులొదలరాయె. అందరినీ తప్పించుకున్నా గుళ్లల్లోని బాలభోగాలు, బాజాలు, చక్రపొంగలి, పులిహోర, దద్ధ్యోజనం వంటి ''ప్రసాదా''లను కాదనడం పాపమంటూ హెచ్చరిస్తూన్నాయాయె!

సంక్రాంతి పుష్యమాసంలో వస్తుంది. దీనిని గొబ్బిళ్ల పండుగని కూడా అంటారు. గొబ్బెమ్మ అంటే గోవునకు తల్లి. గోపు అంటే గోవుల్ని కాచే గోపాల బాలకృష్ణుడు. అందువల్ల ఈ పండుగ ముఖ్యంగా గోపాలకులకు సంబంధించిందిగా గుర్తుచేసేందుకు ''పిల్ల గొబ్బిళ్ల''కు ప్రాధాన్యతనిస్తారు! ఇది బాలబాలికల పండుగ! మూడు గొబ్బిళ్లతో పిల్ల గొబ్బిలి, ఐదు గొబ్బిళ్లతో తల్లి గొబ్బిలిచేసి పెడతారు. సాధారణంగా గొబ్బిళ్లు బేసి సంఖ్యలోనే ఉంటాయి. కొందరు ఈ గొబ్బిళ్లు ప్రతిరోజూ రెట్టింపు చేసుకుంటూ పోతారు. వీటిని ప్రొద్దున్నా సాయంత్రం కూడా పెడతారు. ప్రొద్దున్న పెట్టేవి "తొలి గొబ్బిళ్లు" సాయంత్రం పెట్టేవి 'మలిగొబ్బిళ్లు' లేక 'సంది గొబ్బిళ్లు' గొబ్బిళ్లు పెట్టి పూజచేసి

***"సంది గొబ్బీవే! శుభము లియ్యావే!***
***తామరపువ్వంటి తమ్ముణ్ణివ్వావే!***
***చేమంతిపువ్వంటి చెల్లెల్నివ్వావే!***
***మొగలిపువ్వంటి మొగుణ్ణివ్వావే"!***

అని మనసులోని కోరికను మర్మంగా బయట పెడతారు కన్యలు. ఈ గొబ్బెమ్మలకు పసుపు, కుంకుమ, పిండి, పూవులు అలంకరించి; అటుకులు, బెల్లం, సెనగపప్పు, కొబ్బరికాయలు, పళ్లువంటివి నైవేద్యం పెట్టి; పండంటి పిల్లల్నిమ్మని కోరుతారు పెళ్లయినవారు. పేరంటాళ్లను పిల్చి పాటలు, పద్యాలు, వేడుకలుచేసి పళ్లు, తాంబూలాలు కూడా పంచిపెడతారు. ఈ గొబ్బిళ్లు తీసి భోగి పిడకలు చేస్తారు. వాటిని భోగిరోజున భోగి మంటలుగా వేసి పరమాన్నం వండుతారు. భోగిమంటల్లో చెత్త చెదారం సంవత్సరమంతా పేరుకొన్న మాలిన్యం నాశనం చేస్తారు. మనిషిలోని దుష్టప్రకృతిని, కాలుష్యాన్ని, వాతావరణంలోని కల్మషాన్ని భోగిమంటలు బుగ్గిచేస్తాయని


# సంక్రాంతి... ఒక


గొబ్బెమ్మలు

విశ్వాసం. తలంటి స్నానం చేసి తడిగుడ్డలతోనే 'వారసత్వపు వారసుడు' ఈ భోగిమంటలనంటించాలి. భోగి నాడు 'ఇంద్రపొంగలి'ని పాలు అన్నంతో చేస్తారు. తొలకరి త్వరగా ప్రసాదించమని ఇంద్రుడిని ప్రార్థించడమన్న మాట.

ఈ ధనుర్మాసంలో ఇళ్లు అలికేటీరును చూచే కాబోలు 'అలికినయింట్లో ఒలికినా అందమే' అనే సామెత పుట్టింది. ఆవుపేడతో అలికిన ఇంట్లో, కళ్లాపు చల్లినవాకిట్లో పారాణితో, పసుపుకుంకుమలతో, గుల్ల సున్నపు ముగ్గుతో, రంగవల్లులు, ముగ్గులు రంగురంగులుగా అలంకరించే మగువలకిది ముగ్గుల పండుగ ధనుస్సంక్రాంతి నుండి మకర సంక్రాంతి వరకూ.

ధనుర్మాసం చివర దక్షిణాయనం పూర్తవుతుంది. దక్షిణానికధీశుడు మరణ కారకుడైన యముడు. వర్ష, శరత్, హేమంత రుతువుల వల్ల నీరు, తేమ ఇత్యాది వల్ల వాయువు శీతలంగా ఉంటుంది. చైతన్య కారకమైన ఉష్ణం లోపించడం వల్ల వాతావరణం వ్యాధులకను కూలంగా ఉంటుంది. అందుకే దీనిని 'యమదంష్ట్రకాలం' అంటారు. ఒకరి నుంచి ఒకరికి తేలికగా అంటుకునే వ్యాధులు 'సాంక్రమిక వ్యాధులు' ఉద్భవించేకాలమిది. ఈ కాలంలోని మార్గశీర్ష పూర్ణిమను 'కోరలమ్మ పున్నమి' అంటారు. దానిని దాటితే మరణాన్ని దాటినట్లేననే భావం వల్లనే 'కోరలమ్మ పున్నమికి కోటి కలలు కావాలి' అనే



# సమ్యక్ క్రాంతి

సామెతేర్పడింది. సాంక్రమిక వ్యాధులనరికట్టడానికి, వాటికి మూలమైన క్రిములను నాశనం చేయడానికి కస్తూరి వంటిదని ఆయుర్వేదంలో చెప్పే అప్పుడే చేసిన ఆవుపేడ, గుల్లసున్నం, పసుపు ఉపకరిస్తాయి; పంచగవ్య విధానంలో

*గోమూత్రం గోమయం, సర్పిం*
*క్షీగంధధిచరోచనా*
*షడంగమే తత్పరమ్*
*మాంగల్య సర్వదా గవాం*

(గోమూత్రం, గోమయం, గోఘృతం, గోక్షీరం, గోదధి గోభోజనం)

ఈ ఆరు చాలా మంగళప్రదాలు. 'ఆవు పేడ క్రిమిసంహారి' మాత్రమేగాక వాయుదోషాలను మసూచి కాది వ్యాధుల్ని రానీదు. దోమల బాధను పోగొట్టి ఆరోగ్యాన్ని కాపాడే అపూర్వ చింతామణి. పశువును 'క్రిమఘ్ని' అన్నారు.

ధనుర్మాసం మగువలకు ముగ్గుల పండుగన్నాం. సరళరేఖలు గాని వృత్తాలు గాని ఏ పరికరాలు లేకుండానే అంత చక్కగా ఎలా గీయగలుగుతున్నారా! అని మనం ఆశ్చర్యపోక తప్పదు. ఈ ముగ్గులతో ముడి వేసుకున్న శాస్త్రాలనేకం ఉన్నాయి. ఖగోళశాస్త్రాన్ని ముగ్గుల్లో వేసేవారంటే అతిశయోక్తి కాదు. అణు ప్రదర్శనశాలను చూచిన వాళ్లెవరైనా ఉంటే అక్కడి వివరణ చిత్రాలన్నిటినీ మన సాధారణ ముగ్గుల్లో చూడగల్గుతారు!

సంక్రాంతి ముగ్గుల ప్రత్యేకత యోగశాస్త్రానికి సంబంధించినది. పుష్పగుచ్ఛబంధం, కుండలి, నాగబంధం వంటి పూవులకు, పాములకు సంబంధించిన ముగ్గులు వీటిలో కనపడతాయి. ఈ సంక్రాంతి కాలంలోనే బాలబాలికలు అభినయం చేస్తూ చప్పట్లు కొడుతూ కుమ్మి పాటలు, కోలాటప్పాటలు, పాడుతూ ఆనందిస్తూ ఉంటారు. ఈ పాటల్లో సాధారణంగా 'గోవు' కీర్తనలే ఎక్కువ.

***'నిలయమైన నిగమములను / నలువడికి మానరూప/ మీ-న-రూ-ప!/ జయజయ పరమాత్మ'*** అంటూ కుమ్మిపాటల్లో దశావతార వర్ణనలు చేస్తుంటారు.

'గొల్లవారి వాడలకు కృష్ణమూర్తి/ నీవు ఏమి పనులకు వచ్చినావు? కృష్ణమూర్తీ!'

అంటూ ఒక జట్టు కోలాటం వేస్తూ అడుగు తుంటే, 'పాలు వలసి వచ్చినావే గొల్లభామా/ మంచి పాలు యిచ్చి నన్ను పంపు గొల్లభామా' అంటూ మరొక కోలాటపు జట్టు జవాబిస్తూ శ్రీకృష్ణలీలలను వర్ణిస్తుంటే ఇంటిపనులు కూడా మరచిపోయి ఆగిపోవడం కద్దు.

భజనలు కూడా సంక్రాంతి పండుగ ముచ్చట్లలో ప్రధానమైనవే. 'రామ భజన' ఎన్నో విధాలు. పొన్నచెట్టుకాని దీపపు సెమ్మెకాని మధ్యన పెడతారు. నుపయోగిస్తారు. వీటిలో తాళం భజన, చిరుతల భజన, హరిభజన, కోపులు (కోలాటం) పండరీ భజన, తప్పిడికుండల భజన అనేది సాధారణంగా వాడేవిధాలు.

రైతుల ఇళ్ల అరుగుల మీద జొన్న కంకులు వేలాడదీసి ఉండడం, పగటి వేషగాళ్లు, గంగిరెడ్డుల వారు మొదలు సాతాని జియ్యర్ల వరకు గల కళాజీవులైన యాచకాళికి, గ్రామంలోని కళాకారులకు పంటలో భాగాలీయడం గూడా ఇప్పుడే జరుగుతుంది. గాదెల నిండా సంవత్సరపు శ్రమకు ఫలితమైన ధాన్యాలుండి సస్య, ఐశ్వర్య లక్ష్ములు ఇంట్లో తాండవిస్తుంటే రైతులు ఆనంద పారవశ్యంలో మునిగి, దానిలో నుండి ఉద్భవించిన కళను ఆరాధించడం పోషించడం సహజమే. ఆనందో బ్రహ్మ! అందుకే 'దేహి' అన్నవారికి 'నాస్తి' అన్నమాట లేకుండా దానధర్మాలు సాగుతాయి. మానవులనే గాకుండా ప్రతి జీవినీ సంతృప్తి పరచాలనే తలపునకు ప్రతిప్రాణిలోనుగల పరమాత్మను గుర్తించడం అనేదానికి చిహ్నంగా ఇళ్ల చూరులకు కంకులు వేలాడతీస్తారు.

సంక్రాంతి పండుగలో భోగి, పెద్ద పండుగ, కనుమ, అనే మూడు భాగాలున్నాయి. ఈ మూడు పబ్బాలు గడచాక ముక్కనుమ అనే పబ్బం కూడా ఉంది.

పెద్ద పండుగరోజు "సూర్య పొంగలి"ని చేస్తారు. కర్కటకమునకు వరుణుడు, మకరమునకు సూర్యుడు సంక్రమణాధిపతులు. వీరిద్దరికీ మకరముపై అధికారముంది. వీరిరువురి మూర్తియే సంక్రాంతి. పురుషుడు, కులపురుషుడు, యుగపురుషుడు, సంవత్సరాధిపతియైన సంకురుమయ్య. ఈ సంకురుమయ్య ప్రతి సంవత్సరం ప్రత్యేక లక్షణాలు కలిగి ఉంటాడు. ఆయన వేషం, అలంకరణ, వాహనము మొదలగు దానినిబట్టి దేశంలో శుభాశు భాలు వస్తాయ్యని జ్యోతిషం చెబుతారు. ఈ ఫలితా లెప్పుడూ అక్షరాల నిజమౌతాయి. అందువల్ల సంకురుమయ్యకు

**'ఎలుక ముట్టాలేదు/ చిలుక ముట్టాలేదు/ నీకె పెట్టితినయ్య కాలభైరవుడా'** అంటూ భక్తితో నైవేద్యం పెడతారు. సంక్రమణము అంటే సూర్యుడు రాశి మారడం. సంవత్సరానికి సూర్యుడు పన్నెండుసార్లు రాశులు మారినా మకర సంక్రాంతికే ప్రాధాన్యత నిచ్చారు. సూర్యుడు కర్కాటకము నుండి ఇంచుక ఉత్తరాభిముఖముగా సంచరించడం చేత ప్రకృతిలో 'యమదంష్ట్ర కాలము' పోయి నవ వసంతాగమ నానికి నాందీగీతం వినపడుతుంది. ప్రకృతి స్వరూపంగూడా సూర్యుని గతితోపాటు మారుతుంది.



గంగిరెద్దు

శరీరమాద్యం ఖలు ధర్మసాధనం. ధర్మ సాధన కవసరమైన ఆరోగ్యకారకుడైన సూర్యుని ప్రార్థిస్తారు ఈరోజున. ఈ సంక్రాంతి పండుగల్లో చేసే దానాల్లో నువ్వులు, చిమ్మిలి ఉండలు ప్రధాన స్థానాన్నలంకరి స్తాయి. నెయ్యి, గొంగళ్లు మొదలైన వాటిని గూడా దానమిస్తారు.!

అన్ని ప్రాంతాల్లోనూ నువ్వులనే వాడడానికి కారణం అవి కొవ్వును తగ్గించి ఆరోగ్యాన్నిచ్చేది కావడంవల్లనే గాక సూర్యునకు యమునకుగూడ అవి ప్రీతికారకాలేనని విశ్వాసం. మనం చేసే ప్రతిపనికి కర్మసాక్షి సూర్యుడు. చేతనాచేతనము లాయన శక్తివల్లనే జీవిస్తున్నాయి. ఆయన ప్రత్యక్షదైవం. యమునివద్ద వీరి దానధర్మాలను గూర్చి రేపు సాక్ష్యమీయాల్సిందీయనయే. అంతేకాదు. ఇది ఉత్తరాయణ పుణ్యకాలం. దీనికోసమే అంపశయ్యపై భీష్ముడు నిరీక్షిస్తున్నాడట. 'సంక్రాంతికి సంకెళ్లలో ఉన్న వారికి కూడా విముక్తి ఉంది' అని ఆర్యోక్తి. 'ఉత్తరాయణ పుణ్యకాలంలో ఉరిపెట్టుకు చచ్చినా స్వర్గమే'ననీ అంటారు!

పెద్ద పండుగరోజు విభక్త కుటుంబాలవారు ఉమ్మడిగా వంట వండుకుని ఏక పంక్తి భోజనాలు చేయాలి. ధూపదీపాలతో నైవేద్యం అయ్యాక కాలభైరవుడి పాటపాడతారు. రాత్రిభజనలు అవీ మామూలే. విడిపోయిన కుటుంబాల్లో ఆత్మీయత పోకుండా చూడడం దీని ప్రధాన లక్ష్యం.

కనుమ పండుగ రోజున 'మాట్టుపొంగలి' చేస్తారు. ఇది గోపూజాదినం. పొంగలిని ఆవుకు పెట్టి, కొంత మెడలో కడతారు. ఈ రోజున దేశ సౌభాగ్యా నికి శాంతికి మూలకారకులైన 18 జాతులవారు తమ తమ పనిముట్లకు పూజచేస్తారు. ముక్కనుమతో అనారోగ్య ప్రకృతిని రథం మీదపెట్టి ముగ్గురతో రథాన్ని బయటకు లాగుతారు.

కనుమ, ముక్కనుమల్లో చెడుగుడు, ఉప్పు (చర్రపట్టీ) మొదలగు జాతీయ ఆటల పోటీలు గ్రామకంఠంలో జరుగుతాయి. నడివీధుల్లో భజనలు,



హరిదాస్

కోలాటాలు, తందాన తానపదాలు, అవతార అకపదములు జరుగుతాయి. అమ్మవార్లకు పోతురాజులకు 'తీర్థములు' జరిగి మొక్కుబడులు పూర్తవుతాయి. ముక్కనుమనాడు ఆబోతును 'తోటపెద్ద'గా ఊరేగిస్తూ 'ఆకదము'లనే పాటలు పాడుతూ నెమలి పురికుంచెతో దీవించి ఫలహారాల్నిస్తారు.

*"హరి హరీ నారాయణాది నారాయణా*
*కరుణించి మమ్మేలు కమల లోచనుడా"*

*"శ్రీరామ రామ రామోరామ రామయ్య*
*హరి రామ రామ రామయోధ్య రామా"*
*"శ్రీ రామ రఘురామ సీతాపతే రామ*
*శత్రు భీకర రామ సంగ్రామ భీమా"*
*"శ్రీ రామ గుణధామ శ్రితజబావన రామ"*

అనే మకుటాలతో రామాయణ భారత భాగవతాది గాథలు పాడుతారు. ఈ విధంగా వ్యవసాయ దేశమునకు వెన్నెముకైన గోసంతతిలోని మేలు జాతికి కారణమైన అబోతులను పూజించడం, మన జాతీయ ఇతిహాసాలను పామరులకు గూడా అందీయడం జరుగుతుంది. ఇలా యెంతో విజ్ఞానాన్ని పొందుతారుగనుకనే మన పల్లీయులు 'అక్షరాస్యులు' గాక పోయినా 'బహుశ్రుతులు' కావడంవల్ల నేటి అక్షరాస్యులకన్న అనేక విధాల మేరుగుగా ఉండేవారు!

ఇంత చెప్పినా పుట్టింటికి వచ్చే ఆడబిడ్డల అజమాయిషీని గూర్చిగాని, తలంటుకి పిలుస్తుంటే క్రొత్తగా వచ్చిన అల్లుళ్లు గోముగా చేసే మారాము విషయంగాని (సంక్రాంతిని 'అల్లుళ్ల పండుగ' అని కూడా అంటారు), మరదళ్ల ముచ్చట్లు, బొమ్మల కొలువులు, పేరంటాండ్ర బాలబాలిక బృందాల హడావిడులు ఆటపాటలు ఊరి పొలిమేరల్లో గోవుల పిల్లనగ్రోవి మోతలు, గ్రామ మధ్యంలో బాజా భజంత్రీలు మొదలగు వాటిని గూర్చి ప్రస్తావించ కుండా ఉంటే సంక్రాంతి వర్ణనం పూర్తి కాదు! ఇవన్నీ సమాజంలోని వివిధ వర్గాలను దగ్గరకు తెస్తాయి. గొప్పా, బీదా, లేదా మరే విధమైన తేడాలకు తావిచ్చే అహంకారాన్ని పోగొట్టి చక్కని సామాజిక భావనకు పునాదులు వేస్తాయి. ఈ పండుగల్లో గ్రామమంతా ఒకటే కుటుంబం. మన పండుగలు జాతీయ చైత న్యాన్ని రెక్కొల్పే జాతీయ పర్వదినాలుగా రూపొంద డాని కారణం వాటిల్లోగల సామాజిక, ధార్మిక భావన లతోబాటు నిత్యజీవితంతో ఉన్న సన్నిహిత సంబంధమే. ఆ సన్నిహితత్వం సంక్రాంతిలో కొట్టొచ్చి నట్లు కనబడుతుంది.

ఈ రకంగా, జ్యోతిష, ఆరోగ్య, ఆధ్యాత్మిక, యోగాది వివిధ శాస్త్రాలకు సంబంధించిన సంక్రాంతి విషయంలో మరచిపోయిన మరొక దృక్పథం ఉంది. సంక్రాంతి ఒక వ్రతం కాని పూజగాని కాదు. సంక్రాంతి అంటే సమ్యక్ క్రాంతి. క్రాంతి అంటే విప్లవం-మార్పు. ఈ మార్పు సరైనదైతేనే-అది నిజమైన సంక్రాంతి. ఈ దేశంలో సమ్యగ్ విషయ మేదైనాసరే ఏ రంగంలోనైనా సరే ధర్మాన్ని ఆధారంగా చేసుకున్నది మాత్రమే. జీవితంలో, వర్తమాన గమనంలో ధర్మరాజ్య ప్రతిష్ఠాపన కద్దుతగిలేదేదీ సమ్యగ్ క్రాంతి సంక్రాంతి కాలేదు.

**(శ్రీ నేదునూరి గంగాధరంగారు సేకరించిన పండుగల పాటలు, ఫణితలు ఇత్యాది యిందుపయో గించబడ్డాయి.)**

**– 'జాగృతి' 11-01-1957 సంచిక నుండి**



భోగి మంటలు




# స్వంత దేశంలోనే పరాయివారు

"మాకు విద్యుత్తు వద్దు, గ్యాస్ వద్దు, మీరు తవ్వుకుపోయిన బంగారమూ వద్దు... మా తండ్రులు/ సోదరులను ఒక్కసారి చూపించండి లేదా వారిని మీరు చంపేసి ఉంటే ఆ విషయమైనా మాకు చెప్పండి," అని బెలూచిస్తాన్‌కు చెందిన యువతులు, మహిళలు, పిల్లలు పాకిస్తాన్ ప్రభుత్వాన్ని కన్నీళ్లతో డిమాండ్ చేస్తున్నారు. రెండు నెలల కింద బెలూచిస్తాన్‌కు చెందిన ఒక యువకుడు పోలీసు కస్టడీలో మరణించడంతో నిరసన ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. పోలీసులే అతడిని కస్టడీలో కాల్చి చంపారంటూ బంధువులు ఆరోపించడంతో ఆందోళన తీవ్రమైంది. కొన్ని వందల మైళ్ల దూరంలో ఉన్న బెలూచిస్తాన్ ప్రావిన్సు నుంచి వేల సంఖ్యలో మహిళలు పిల్లలతో కూడిన ప్రదర్శనకారులు పాకిస్తాన్ భద్రతాదళాల దురాగతాలను నిరసిస్తూ, బెలూచీలకు న్యాయాన్ని డిమాండ్ చేస్తున్నారు.

---

ఈ క్రమంలోనే కాలినడకన, బస్సులలో, కార్లలో బయలుదేరి శాంతియుతంగా ప్రదర్శన చేస్తూ డిసెంబర్ 20వ తేదీ అర్ధరాత్రి సమయానికి ఇస్లామాబాద్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పాకిస్తానీ పోలీసులు మహిళలు, పిల్లలు అని కూడా చూడకుండా ప్రదర్శనకారులపై లాఠీ ఛార్జీ చేయడమే కాదు గడ్డకట్టే చలిలో వారిపై వాటర్‌కాన్లను వదిలారు. ఆ నిరసన ప్రదర్శనకు నాయకత్వం వహిస్తున్న డా॥ మెహరంగ్ బెలూచ్ సహా దాదాపు 200మంది ఆందోళన కారులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ప్రదర్శనను అడ్డుకోవద్దంటూ పోలీసులను డిసెంబర్ 21వ తేదీన ఇస్లామాబాద్ హైకోర్టు ఆదేశించినా, లెక్కచేయకుండా బలవంతంగా వారిని తిరిగి బెలూచిస్తాన్‌కు పంపే ప్రయత్నం పోలీసులు చేశారు. అయితే, బెలూచీ మహిళలు మాత్రం ఈసారి తాడో పేడో తేల్చుకుంటామంటూ అక్కడే కూలబడ్డారు.

పాకిస్తాన్‌లోని అతి పెద్ద ప్రావిన్సు అయిన బెలూచిస్తాన్‌లో వ్యక్తులను, ఉద్యమకారులను పాక్ భద్రతాదళాలు బలవంతంగా అదృశ్యం చేయడం అన్నది ఒక నిత్యకృత్యంగా మారింది. ఐఎస్ఐకు, సైన్యానికి చెందిన అధికారులు తమ హక్కులను డిమాండ్ చేసే కార్యకర్తలను ఎత్తుకువెళ్లి, బాధితులు కోర్టులలో న్యాయం కోరడానికి కానీ, ప్రభుత్వం దానిని గుర్తించడానికి కానీ లేకుండా వారి అరెస్టులను చూపడం లేదు. ఇలా అదృశ్యమైనవారిలో రాజకీయ కార్యకర్తలు, జర్నలిస్టులు, మానవ హక్కుల కార్యకర్తలు, విద్యార్థులు కూడా ఉన్నారు.

అత్యంత వెనుకబడిన ప్రాంతంగా కనిపించే బెలూచిస్తాన్ సహజవనరులలో అత్యంత సుసంపన్నమైనది. తమ దేశంలోని వనరులను దోచుకుంటూ, తమకు ఏ రకమైన సౌకర్యాలు కల్పించకుండా ఇతర ప్రాంతాలను అభివృద్ధి చేస్తుండడంతో ఆగ్రహించిన బెలుచీయులు ఆందోళన పథం పట్టారు. అక్కడి గ్వాదర్ పోర్టు వ్యవహారం, చైనాతో సిపెక్ ఒప్పందంలో ఎక్కడా బెలూచీల ఆమోదం కానీ, వారి ఉపాధి అవకాశాల విషయం కానీ కనిపించవు. పాకిస్తాన్ వివక్షాపూరిత పాలన కారణంగానే 2000 బెలూచిస్తాన్ నేషనలిస్ట్ మూవ్ మెంట్ (బిఎన్ఎం) ఏర్పడింది. అయితే, అక్కడి సమస్యలు ప్రపంచం దృష్టిలోకి పడకుండా ఉండేం దుకు పాక్‌లోని అన్ని వర్గాలు కృషి చేస్తుంటాయి.

తమ డిమాండ్లతో గడ్డకట్టించే చలిలో ఇస్లామాబాద్‌కు వచ్చిన బాధిత బెలూచ్ మహిళలను, వారి కుటుంబాలను అక్కడి మీడియా దోషులుగా నిలబెట్టే ప్రయత్నం చేయడం ఎంత ఏహ్యమైన విషయం? బెలూచిస్తాన్‌లో హింసను ఖండించమని కోరుతున్నారు. చిత్రం! ఇదే మీడియా కశ్మీర్‌లో తిరుగుబాటుదారులను స్వాతంత్ర్య సమర యోధులుగా అభివర్ణిస్తుంటుంది.

**నిరసనకు తక్షణ కారణం**

తాజాగా అక్టోబర్, నవంబర్ నెలల్లో జరిగిన ఘటనలు బెలూచీలలో ఆగ్రహాన్ని పెల్లుబికేలా చేశాయి. పాకిస్తాన్ తీవ్రవాద వ్యతిరేక పోలీసులు అక్టోబర్ 29వ తేదీన 24 ఏళ్ల బెలాచ్ మోలా బక్ష్ అనే యువకుడిని అక్రమంగా అరెస్టుచేసి నెలరోజులు కస్టడీలో ఉంచుకున్న తర్వాత, అతడు పేలుడు పదార్థాలతో పట్టుబడ్డాడంటూ మొదట ప్రకటించారు. ఈ క్రమంలోనే బెయిల్ కోసం అతడి కేసు కోర్టు ఎదుటకి వచ్చే ముందు రోజైన నవంబర్ 23వ తేదీన బక్ష్ సహా నిషేధిత గ్రూపునకు సంబంధిం చిన నలుగురు తీవ్రవాదులు బెలూచిస్తాన్‌లోని తుర్బత్ నగర పోలీసులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో

మరణించారంటూ ప్రకటించడంతో ప్రజలు తిరగబడ్డారు. అతడు పోలీసు కస్టడీలోనే మరణించాడని, తమకు న్యాయం జరగాలంటూ అతడి కుటుంబం ఆందోళనకు దిగింది.

ఇలాంటి ప్రదర్శనలు బెలూచీలకు కొత్తకాదు, పాకిస్తాన్ ప్రభుత్వాల, మానవ హక్కుల కార్యకర్తల, మీడియా మౌనమూ కొత్తకాదు. సరిగ్గా ఒక దశాబ్దం కింద , 2013లో వాయిస్ ఫర్ బెలూచ్ మిస్సింగ్ పర్సన్స్ (విబిఎంపి- అదృశ్యమైన బెలూచీల కోసం గొంతెత్తిన) మామా ఖదీర్ బెలోచ్ ఇటువంటి ప్రదర్శననే క్వెట్టా నుంచి కరాచీ ద్వారా ఇస్లామాబాద్‌కు నిర్వహించారు. ఆరేళ్ల కాలంలో మాయమైన వెయ్యిమందికి పైగా రాజకీయ కార్యకర్తలు, వేర్పాటువాదుల మృతదేహాలు బెలూచిస్తాన్‌లో బయిటపడడంతో అక్కడ వాతావరణం మరింత వేడెక్కింది. ఈ హత్యలకు సమాధానం చెప్పకపోగా, పాక్ ప్రభుత్వం ఈ మృతదేహాలన్నీ తీవ్రవాద గ్రూపుల మధ్య జరుగుతున్న తగాదాల ఫలితంగా బయటకు వచ్చినవే అంటూ వారి నెత్తినే వేసేసింది.

కాగా గత ఏడాది డిసెంబర్ 6న ప్రారంభించిన ప్రదర్శన గతంలోకన్నా భిన్నమైంది. ఎందుకంటే, ఈసారి ప్రదర్శనకు ఏ సంస్థలూ, సంఘాలు కాకుండా బాధితుల కుటుంబాలు, సాధారణ బెలూచీలూ నాయకత్వం వహిస్తున్నారు. మోలా బక్ష్ బెలూచ్ మరణించిన తర్వాత అక్కడ సైనిక కార్యకలాపాల వల్ల బాధితులు అయిన వారు కూడా ఈ ఉద్యమంలో చేరారు. పదేళ్ల కింద జరిగిన ప్రదర్శనలో పాల్గొన్న తొమ్మిదేళ్ల బాలుడు, ఇప్పుడు 19 ఏళ్ల యువకుడిగా ఈ ప్రదర్శనలో పాల్గొన్నాడు. తమ సన్నిహితులను కోల్పోవడమనే గాయాల మచ్చలకు వారు ఈసారి వాక్ స్వరూపం ఇస్తున్నారు.

"ఇస్లామాబాద్ బెలూచీలకు న్యాయం చేయదని నాకు తెలుసు," అంటూ తుర్బత్ నుంచి ఇస్లామాబాద్ వరకు జరిగిన ప్రదర్శనకు నాయకత్వం వహించిన డాక్టర్ మెహరంగ్ బెలూచ్ అన్న మాటల్లో ఎంతమాత్రం అసత్యం లేదు. మెహరంగ్ కూడా బాధితురాలే, ఆమె తండ్రి, బెలూచ్ జాతీయవాది అయిన అబ్దుల్ గఫార్ లాంగోను 2006, 2009 మధ్యలో రెండుసార్లు ఎత్తుకు పోయారు, అంతిమంగా 2011లో అతడి శరీరాన్ని ముక్కలు చేసి పడేశారు.

ఇప్పుడు బాధితులు నిరసన ప్రదర్శనలు చేసుకునేందుకు అంటూ ఒక ప్రాంతాన్ని ఇచ్చి, వారు దానిని దాటి బయటకు రాకుండా ఉండేందుకు కాపలాగా పోలీసులను పాక్ ప్రభుత్వం పెట్టింది. వారు ఏరకంగానూ, ఇస్లామాబాద్‌లోని సామాన్యుల దృష్టిని ఆకర్షించకుండా ఉండేందుకు వారు తెచ్చుకున్న మైకులను, తదితర పరికరాలను అర్ధరాత్రి పోలీసులే ఎత్తుకుపోవడం ఎంత సిగ్గు చేటు? ప్రదర్శనకారులలో మహిళలు, పిల్లలు ఉన్నారని ప్రభుత్వంలో ఏ మాత్రం చలనం లేకపోగా, వారిని బెలూచీ నేషనలిస్ట్ మూవ్‌మెంట్ కార్యకర్తలుగా ముద్రవేసి, వారేదో దేశ విచ్ఛిన్న కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు చిత్రించే ప్రయత్నం చేస్తోంది.



## బెలూచిస్తాన్ సమస్య ఏమిటి?

పాకిస్తాన్‌లో గల నాలుగు ప్రావిన్సుల్లో భౌగోళికంగా అతిపెద్ద భూభాగం కలిగి, తక్కువ జనాభా గల రాష్ట్రం బెలూచిస్తాన్. వాస్తవానికి పాకిస్తాన్, ఇరాన్, అఫ్ఘానిస్తాన్‌లలోని కొన్ని భూభాగాలు కలిగి ఉండేది ఈ ప్రాంతం. బెలూచ్ జాతీయవాదం అనేది 19వ శతాబ్దంలో వలసవాద వ్యతిరేక పోరాట సమయంలోనే ఉద్భవించిందని చరిత్రకారులు చెప్తారు. నాడు ఖలాత్ సంస్థానంలో నేడు పాక్‌లో గల ఆధునిక బెలూచిస్తాన్ ఒక భాగంగా ఉండేది. బ్రిటిష్, రష్యాల మధ్య శతృత్వం కారణంగా బెలూచీ ప్రాంతం నలిగిపోయింది. బ్రిటిష్ వారు అఫ్ఘాన్ పై దాడి చేసినప్పుడు, కాబూల్‌కు సరఫరాలు లేకుండా మూసివేసేందుకు తమ దళాలను బెలూచిస్తాన్‌లో నిలిపారు. కాగా, బ్రిటిష్‌వారు అక్కడి వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా అఫ్ఘాన్ సరిహద్దులో ఖైబర్ పఖ్తూన్వాను మాత్రం తమ ఆధీనంలోకి తీసుకున్నారు. తర్వాత, సోవియట్ విప్లవం, భారత స్వాతంత్రోద్యమంతో స్ఫూర్తి పొందిన బెలూచ్ జాతీయ నాయకులు స్వతంత్ర బెలూచిస్తాన్ కోసం ఉద్యమించారు. పాకిస్తాన్ ఏర్పడిన మరురోజే, అంటే ఆగస్టు 15, 1947లో ఖలాత్ రాజు తమ ప్రాంతాన్ని స్వతంత్ర ప్రాంతంగా ప్రకటించుకున్నాడు. కాగా, విదేశీ వ్యవహారాలు, రక్షణ వ్యవహారాలలో పాకిస్తాన్‌తో ప్రత్యేక సంబంధాన్ని కలిగి ఉంటామని ప్రతిపాదిస్తూ చర్చలకు ఆహ్వానించాడు. కానీ పాకిస్తాన్ నాయకత్వం ఈ స్వతంత్ర ప్రకటనను తిరస్కరించడమే కాదు, తొమ్మిది నెలల్లో బలవంతంగా ఖలాత్ ప్రాంతాన్ని కలుపుకుంది. ఆ తర్వాత 1948, 1958, 1962ల్లో పాకిస్తాన్ ప్రభుత్వానికి, బెలూచ్ జాతీయవాదులకు మధ్య అనేక సంఘర్షణలు, ఉద్రిక్తతలు ఏర్పడ్డాయి.

తమ ప్రజలను, వారి ప్రయోజనాలను కాపాడుకోవాలన్న లక్ష్యం చుట్టూ అల్లుకున్న బెలూచ్ ప్రతిఘటనోద్యమం 1962లో జరిగిన కొన్ని ఎన్‌కౌంటర్ల తర్వాత మార్క్సిస్టు- లెనినిస్టు విముక్తి ఉద్యమాల స్ఫూర్తితో ప్రారంభమైంది. సైద్ధాంతిక ప్రేరణ కలిగిన కొన్ని వందలమంది కార్యకర్తలు, షేర్ మహమ్మద్ మర్రి, తీవ్రవాద బెలూచ్ పీపుల్స్ లిబరేషన్ ఫ్రంట్ బ్యానర్ కింద సమావేశమై, 1973 తిరుగుబాటుకు బీజాలు వేశారని చెప్పాలి. కాగా, 1973-1977 సంఘర్షణలో బెలూచ్ యువత తీవ్రవాదానికి దగ్గరకావడం, క్రమంగా పరాయీకరణకు లోను కావడం ఫలితంగా స్వాతంత్రం కోసం డిమాండ్ పుట్టుకువచ్చిందే తప్ప బెలూచ్ పీపుల్స్ లిబరేషన్ ఫ్రంట్ కారణంగా కాదు. నాటి అధ్యక్షుడు, తర్వాత ప్రధాని అయిన జుల్ఫికర్ ఆలీ భుట్టో 1973లో ప్రతిపక్ష నేషనల్ అవామీ పార్టీ (ఎన్‌ఎపి) నాయకులు దేశ పునాదులను ధ్వంసం చేయడానికి యత్నిస్తున్నారంటూ వారు ఏర్పాటుచేసిన ప్రావిన్షియల్ ప్రభుత్వాన్ని రద్దు చేశారు. ఈ క్రమంలోనే ఇంకా శైశవంలో ఉన్న బెలూచ్ నేషనల్ మూవ్‌మెంట్‌లోని తీవ్రవాద శక్తులు మర్రీలు, మెంగాల్‌లు శ్రీకారం చుట్టిన గొరిల్లా పోరాటంలో చేరాయి. దాదాపు 80వేల పాకిస్తానీ సైనిక దళాలు కూడా అక్కడ తీవ్రవాదాన్ని నిర్మూలించలేకపోయాయి.

జనరల్ జియా ఉల్‌హక్ సైనిక తిరుగుబాటు చేసిన తర్వాతే చర్చలు ప్రారంభమైన ఫలితంగా, క్రమంగా ప్రావిన్సు నుంచి సైన్యం ఉపసంహరణ, వేలాదిమంది కార్యకర్తల, బెలూచ్ నాయకులను వదిలిపెట్టడం జరిగాయి. దీనితో ప్రావిన్సు 2005వరకు శాంతియుతంగానే ఉంది. అయితే, తదనంతర కాలంలో చోటు చేసుకున్న పరిణామాల కారణంగా బెలూచిస్తాన్ సామాజిక, వ్యవస్థాగత నిర్మాణం క్రమబద్ధమైన విధ్వంసాన్ని ఎదుర్కొంటున్నది. 2013లో ఎన్నికైన ముఖ్యమంత్రి నవాబ్ అస్లం రైసనీని తప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం 90మంది

డి. అరుణ

షియాలను చంపించి, బెలూచిస్తాన్‌ను గవర్నర్ పాలనలో ఉంచింది, అంటే వాస్తవంగా సైనిక నియంత్రణలో ఉంచింది.

**వ్యూహంలో మార్పు చేసిన పాక్ ప్రభుత్వం**

ప్రస్తుతం బెలూచిస్తాన్ మరొక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. పాక్ ప్రభుత్వం బెలూచిస్తాన్‌కు వ్యతిరేకంగా ఉపయోగిస్తున్న అణచివేత చర్యల స్వరూప, స్వభావాలను మార్చివేసింది. సైనిక కార్యకలాపాలు నిలిచిపోయాయి. కానీ, ఆ ప్రాంత వ్యాప్తంగా వ్యక్తులు అపహరణకు, హత్యలకు గురికావడం, వారి మృత దేహాలను అనాథల్లా వదిలివేయడం చేయనారంభించింది. ఈ ఆపరేషన్‌కే కిల్ అండ్ డంప్ (చంపి, పారేయడం) అని పేరుపెట్టారన్నమాట. ఈ ప్రాంతాన్ని నియంత్రణలో ఉంచి, ప్రభుత్వ అధికారాన్ని పటిష్టం చేయడం ఈ ఆపరేషన్ లక్ష్యం. మానవ హక్కుల సంస్థల ప్రకారం ఇలా అదృశ్యమవుతున్న వారిలో అత్యధికులను పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ, ఫ్రాంటియర్ కార్ప్సులు స్థానిక పోలీసుల సహకారంతో మాయం చేస్తున్నాయి. నమోదు చేసిన కేసులలో అత్యధికం పట్ట పగలు, రద్దీగా ఉండే బహిరంగ ప్రాంతాల నుంచి అందరూ చూస్తుండగానే పట్టించుకోకుండా ఎత్తుకుపోయిన వారివే. నిర్బంధంలోకి తీసుకున్నవారిని కలుసుకునేందుకు వారి బంధువులను అనుమతించకపోవడం, వారిని చిత్ర హింసలు పెట్టడం, చట్ట విరుద్ధంగా (ఎక్స్‌ట్రా జ్యుడిషియల్ కిల్లింగ్స్) హత్యలు తరచు జరగడం ప్రారంభించాయి.

**బెలూచిస్తాన్ ఇస్లామీకరణ**

పాకిస్తాన్‌లోని సైనిక పాలకులు బెలూచిస్తాన్ భౌగోళిక స్వరూప, స్వభావాలలో మార్పులు చేయడం ద్వారా జాతిపరమైన గుర్తింపులను కాలరాస్తూ ఇస్లామీకరణకు పాల్పడడం లేదా జాతిపరమైన గుర్తింపుకి ప్రత్యామ్నాయంగా వారికి సార్వజనీన ముస్లిం గుర్తింపును అమలు చేయడం ప్రారంభించారు.

బెలూచిస్తాన్‌లో ఇది కొత్తేం కాదు. తొలుత 1971లో బెలూచిస్తాన్‌తో పష్తూన్ ప్రాంతాలను కలపడం ద్వారా బెలూచీలకు వారి ప్రాంతంలో ప్రాధాన్యత తగ్గించేందుకు పాకిస్తాన్ ప్రయత్నించింది. జియా ఉల్‌హక్ సైనిక తిరుగుబాటు అనంతరం అతడి ఇస్లామీకరణ వ్యూహంలో నేటి ఖైబర్–పఖ్తూన్వా, బెలూచిస్తాన్ రెండు కేంద్ర బిందువులుగా ఉన్నాయి. తీవ్రవాదానికి వ్యతిరేకంగా ఇస్లామీకరణను ఒక ఆయుధంగా జియా ఉపయోగించాడు. ప్రధానంగా ఈ కాలంలో ఇస్లామీకరణ అనేది బాంగ్లాదేశ్ సిండ్రోమ్‌కు ప్రతిస్పందన అని విశ్లేషకులు అంటారు. ఆ సమస్య నేటి పాలకులను ఇంకా వెంటాడుతూనే ఉందన్నది తెలిసిన విషయమే.

బెలూచ్ జాతీయవాదులు ఇస్లామీకరణ విధానాలను తిరస్కరించడానికి ప్రధాన కారణం దాని సైద్ధాంతిక అంశాలు కాదు, అది వ్యక్తులను ఒంటరులను చేసి ఇస్లామాబాద్ విధానాలకు తలొగ్గేలా చేయాలన్న భారీ పథకంలో భాగమేనని వారు విశ్వసించడం. అయినప్పటికీ, ఒకనాడు అతి తక్కువ జనాభా కలిగిన బెలూచిస్తాన్ నేడు ప్రభుత్వం స్వయంగా పంపిన ముల్లాలు, సంస్థలతో కిటకిటలాడుతోంది. ఈ క్రమంలోనే ఇక్కడ జాతిపరమైన హత్యలు పెరగడం కూడా కనిపిస్తుంది. హజారాలు, పష్తూన్‌లు సహా పలు జాతులకు, తెగలకు చెందిన ప్రజలు హత్యలకు గురవుతూనే ఉన్నారు. ఇస్లామిక్ సంస్థలు పెరిగిన తర్వాత అవి పెట్టిన చిచ్చు కారణంగా తెగల మధ్య ఘర్షణలు, హింస పెరిగిపోయాయి.




బంగ్లాదేశ్ విడిపోయిన తర్వాత కూడా పాకిస్తాన్ ఎటువంటి పాఠాలు నేర్చుకోలేదు. ఒకే ప్రాంతానికి చెందినవారు, కొన్ని కుటుంబాలకు చెందినవారే అధికారాన్ని చెలాయించడం లేదా సైనిక తిరుగుబాట్ల ద్వారా సైనిక నియంతలు పాలించడం వల్ల అక్కడ పలు ప్రాంతాలలో అసంతృప్తులు రగులుతున్నారు. తమ ఆధిపత్య భావనతో బాంగ్లాదేశ్ ప్రాంతీయులను ఎలా అవమానించారో, ఇప్పుడు బెలూచీలను కూడా అలాగే అవమానిస్తూ, అత్యాచారాలకు పాల్పడుతున్నారు.

**పాఠం నేర్చుకోని పాకిస్తాన్**

బంగ్లాదేశ్ విడిపోయిన తర్వాత కూడా పాకిస్తాన్ ఎటువంటి పాఠాలు నేర్చుకోలేదు. ఒకే ప్రాంతానికి చెందినవారు, కొన్ని కుటుంబాలకు చెందినవారే అధికారాన్ని చెలాయించడం లేదా సైనిక తిరుగుబాట్ల ద్వారా సైనిక నియంతలు పాలించడం వల్ల అక్కడ పలు ప్రాంతాలలో అసంతృప్తులు రగులుతున్నారు. తమ ఆధిపత్య భావనతో బాంగ్లాదేశ్ ప్రాంతీయులను ఎలా అవమానించారో, ఇప్పుడు బెలూచీలను కూడా అలాగే అవమానిస్తూ, అత్యాచారాలకు పాల్పడుతున్నారు. పాక్‌లోని అధికారవర్గాల వివక్ష కారణంగానే పష్తూన్లు కూడా బెలూచీల డిమాండ్లకు మద్దతు పలుకుతూ, తమకు స్వేచ్ఛ కావాలని డిమాండ్ చేస్తున్నారు.

వీరితో పాటుగా పాక్ ఆక్రమిత్ కశ్మీర్, గిల్గిట్ బల్టిస్తాన్‌లో ప్రజల విషయం అయితే అసలు చెప్పనే అవసరం లేదు. వారు భారత్‌తో కలిసిపోయేందుకు సిద్ధంగా ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. మరొక పక్క సింధు ప్రాంతం కూడా సింధుస్తాన్‌గా విడిపోతామంటూ ఉద్యమిస్తోంది. అక్కడ బెలూచిస్తాన్‌లో జరుగుతున్నంత అత్యాచారాలు, ఘోరాలు జరక్కపోవడానికి ప్రధాన కారణంగా దోపిడీ చేయడానికి సహజవనరులు లేకపోవడమే అయి ఉండవచ్చు.

కశ్మీర్‌లో మానవ హక్కులు ఉల్లంఘనకు గురవుతున్నాయంటూ ప్రపంచ మీడియా, మానవ హక్కుల సంఘాలు సహా మన దేశంలోని ఉదారవాదులు గగ్గోలు పెట్టినట్టు బెలూచిస్తాన్ గురించి పాకిస్తాన్‌లో గగ్గోలు పెట్టేవారు పెద్దగా లేకపోవడం వల్లనే వారి సమస్యలు ప్రధాన స్రవంతిలోకి రాకుండా ఉంటున్నాయి. ఇప్పటికైనా బాధితులైన బెలూచీ కుటుంబాలకు సాంత్వన కలిగించేందుకు, తమ విధానాలలో మార్పులు చేసుకొని, వారు ప్రధాన స్రవంతిలో భాగమనే భావన బెలూచీలలో కల్పించడం పాక్ బాధ్యత. ★

# వికసిత సంకల్ప భారత్‌:

'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారత్)–ఇది ప్రధాని కావడానికి ముందే 'అంత్యోదయ' స్ఫూర్తితో నరేంద్ర మోదీ కన్న కల. విదేశాంగ విధానంలో రాజీ పడకుండా, దేశ ఆర్థిక,సామాజిక, రాజకీయరంగాలలో నిర్మాణాత్మక సంస్కరణలు తీసుకురావడం దీని వెనుక సంకల్పం. దశలవారీగా అమలు చేసే ఈ కార్యక్రమంలో దేశ, ప్రజల ప్రాధాన్యతలను క్రమపద్ధతిలో వర్గీకరించారు. తద్వారా ప్రజల అత్యుత్తమ జీవన ప్రమాణాలను సాధించడానికి 'సమ్మిళిత అభివృద్ధి' కోసం పాలనా నిర్ణయాలను అమలు చేస్తున్నారని అర్థమవుతుంది. ప్రధానిగా తొమ్మిదిన్నరేళ్ల సేవను పరిశీలిస్తే, మోదీ భారత్‌ను 'విశ్వ గురువు'గా తీర్చిదిద్దేందుకు ఒక దార్శనికతతో రాబోయే 25 ఏళ్లను 'అమృత కాలం'గా భావిస్తున్నారని కూడా అర్థమవుతుంది. ఇందుకు అవసరమైన రోడ్‌మ్యాప్‌ను అందించి 2047లో నూరవ స్వాతంత్ర్యదినోత్సవం నాటికి దేశాన్ని వికసిత భారత్‌గా తీర్చిదిద్దాలన్నదే ఆయన సంకల్పం.

గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జయంతి (జనజాతి గౌరవ దివస్) సందర్భంగా ప్రధాని మోదీ నవంబర్ 15, 2023న 'వికాస్ సంకల్ప్ భారత్‌యాత్ర' ప్రారంభించారు. జార్ఖండ్‌లోని కుంతీ నుండి ఆరంభమైన ఈ యాత్ర ఉద్దేశం 100% లబ్ధిదారులందరికీ అంత్యోదయ భావన స్ఫూర్తితో సహాయాన్ని అందించడమే. అర్హులందరికీ, కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు, లబ్ధిదారుల అనుభవాలను పంచుకోవడానికి, అర్హత ఉన్నా అందని లబ్ధిదారులకు వాటిని అందించడానికీ, పథకంలో నమోదు చేసుకోవడానికీ గ్యారంటీ వాహనాలు 'వికసిత సంకల్ప భారత్‌యాత్ర'లో భాగంగా గ్రామాలకు చేరుకున్నాయి. దేశంలో 2.60 లక్షల పంచాయతీలు, 4 వేలకు పైగా పట్టణ, స్థానిక సంస్థల పరిధిలోని ప్రస్తుత లబ్ధిదారులు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేసే రాష్ట్ర ప్రభుత్వం నోడల్ ఏజెన్సీగా వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని సమాచారం. విజయవాడ, ఒంగోలు, బాపట్ల పార్లమెంట్ నియోజక వర్గాల్లో జరిగిన యాత్రలో నాలుగు రోజుల పాటు ఈ వ్యాసకర్త కూడా హాజరయ్యాడు. ఒంగోలు పార్లమెంట్ సెగ్మెంట్, కొండెపి అసెంబ్లీలోని (టంగుటూరు మండలం) జయవరం, కాకుటూరివారిపాలెం పంచాయతీలు, దర్శి రూరల్ మండలం రాజంపల్లి పంచాయతీ, బాపట్ల పార్లమెంట్ సెగ్మెంట్, సంతనూతలపాడు అసెంబ్లీ పరిధిలోని (నాగులుప్పలపాడు మండలం) కండ్లగుంట పంచాయితీలలో జరిగిన వికసిత భారత్ సంకల్ప యాత్ర సమావేశాలు చక్కని అనుభూతిని కలిగించాయి. ఈ తొమిదిన్నర సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వ పథకాల ఫలాలు అందుకున్న వారి అనుభవాలను పంచుకోవడం కోసం లబ్ధిదారులతో సంభాషించడం వల్ల వారి కుటుంబాలు, జీవితాలు ఎలా పురోగమన దిశలో సాగుతున్నాయో తెలిసింది.

రైతుల విషయం చూద్దాం. చిన్న, సన్నకారు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్నది మోదీ ఆకాంక్ష. ఇందుకోసం ప్రవేశపెట్టిన 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' క్రింద ఆంధ్రప్రదేశ్‌లో లబ్ధి పొందుతున్న దాదాపు 50 లక్షలమంది రైతులు, వారి కుటుంబాలు సానుకూల భావాలను వ్యక్తం చేశారు. 2019 నుండి పంట పెట్టుబడి సహాయం క్రింద మూడు సమాన వాయిదాలలో సంవత్సరానికి రూ. 6,000/- వారికి అందించారు. దేశంలో 11 కోట్ల కుటుంబాలకు 2.60 లక్షల కోట్ల రూపాయిలు ఈ పథకం క్రింద అందుతున్నది. ఆ లబ్ధిదారులలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 50 లక్షల కుటుంబాల వారు కూడా ఉన్నారు. ఎరువుల సబ్సిడీ క్రింద కేంద్ర ప్రభుత్వం ప్రతి బస్తా పైన రూ. 2,000/- చెల్లిస్తుంది. ఇందులో కేంద్ర ప్రభుత్వం నుండి ఆంధ్రప్రదేశ్‌కు అందే సహాయం దాదాపు రూ. 15,000 కోట్లు. అనిశ్చిత పరిస్థితులవల్ల వచ్చే పంట నష్టం భర్తీ కోసం కేంద్ర ప్రభుత్వం 'ఫసల్ బీమా యోజన'తో మద్దతు నిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 7 మిలియన్ల కిసాన్ క్రెడిట్ కార్డులు జారీ చేయడం వల్ల బ్యాంకు రుణాలు పొందడం సులభమైంది. వ్యవసాయ రుణాలపై 2% వడ్డీ రాయితీ, సకాలంలో రుణాలు తిరిగి చెల్లిస్తే 3% వడ్డీ ప్రోత్సాహకం అనంతరం కేవలం 4% వద్ద నికర వడ్డీకి కిసాన్ క్రెడిట్ కార్డులతో రైతులకు రుణాలు అందుతున్నాయి.

ద్రవ యూరియా (ఎరువులు) కోసం కొత్త 'నానో టెక్నాలజీ'ని అందుబాటులోకి తేవడం వల్ల యూరియా వృథా వినియోగం తగ్గింది. అంతేకాదు, వ్యవసాయ భూముల ఆరోగ్యం దెబ్బ తినడం కూడా తగ్గింది. పెట్టుబడి గణనీయంగా తగ్గి పంట ఉత్పాదకత పెరిగింది. యూరియా మిశ్రమాన్ని భూములలో చల్లడం కోసం చిన్న సన్నకారు రైతులకు పంచాయతీ లోని స్వయం సహాయక బృందాల ద్వారా 50% సబ్సిడీతో డ్రోన్స్‌కు కేంద్ర ప్రభుత్వం సహాయమంది స్తున్నది. ఇది కూడా పెట్టుబడి భారాన్ని తగ్గించేదే. వ్యవసాయ పనులలో సౌకర్యాల కోసం, ప్రధాన లేదా చిన్న నీటిపారుదల వ్యవస్థలతో నీటి నిర్వహణను ప్రోత్సహించడానికి కేంద్రం 'కృషి సంచాయ్ యోజన' ద్వారా 25% నుండి 60% సబ్సిడీని అందిస్తోంది.

అంత్యోదయ స్ఫూర్తితో ప్రభుత్వ పథకాలకు



'వికసిత సంకల్ప భారత్‌యాత్ర' వాహనాలు

# విహంగ వీక్షణం





దేశంలో అర్హత కలిగిన 11 కోట్ల కుటుంబాలకు చెందిన దాదాపు 50 కోట్ల మంది ఆయుష్మాన్ భారత్ కింద రూ. 5 లక్షల రూపాయిల ఆరోగ్య బీమా పొందుతున్నారు. నేడు 2,322 నెట్వర్క్ హాస్పిటల్స్ ఆంధ్రప్రదేశ్‌లో ఈ పథకం క్రింద ఉన్నాయి. ప్రజలు గమనించదగ్గ ముఖ్య విషయం ఏమిటంటే, అర్హులై ఉండి కేంద్ర ప్రభుత్వ పథకాలు అందని పేదలకు గృహాలను మంజూరు చేయడానికీ, ఆయుష్మాన్ భారత్ కార్డులు, ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్ వికసిత్ సంకల్ప భారత్‌యాత్రలో అక్కడికక్కడే జారీ చేయడానికీ ప్రధాని మోదీ హామీ ఇచ్చారు.

నోచుకోని అర్హులైన బీపీఎల్ (దారిద్ర్య రేఖకు దిగువ) కుటుంబాలకు లబ్ధి చేకూర్చడమే వికాస్ భారత్ సంకల్ప యాత్ర ఉద్దేశమని ముందే చెప్పుకున్నాం. నేడు చాలా రాజకీయపక్షాలు వాటి పథకాలను గ్యారంటీలుగా పేర్కొంటున్నాయి. అయితే 'మోదీ గ్యారంటీ' వాహనాలు దేశ మారు మూల గ్రామాలలో నివసించే నిజమైన, న్యాయంగా పథకాలు అందవలసిన ప్రజలను 100% సంతృప్తిపరిచే ఆశయంతో వస్తున్నాయి. నిర్లక్ష్యానికి గురైన గ్రామాలు, ఎస్టీ తండాలకు వికసిత భారత్ సంకల్ప యాత్రలో ప్రాధాన్యం ఇచ్చారు. దేశంలో ఏప్రిల్ 2020లో కరోనా మొదటిసారి లాక్‌డౌన్ ప్రారంభమయినప్పటి నుండి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (GKAY) కింద బీపీఎల్ కుటుంబాలకు (ఆంధ్రప్రదేశ్‌లోని 2.67 కోట్ల మందితో సహా) 80 కోట్ల మందికి 5 కిలోల ఉచిత బియ్యం పంపిణీకి కేంద్ర ప్రభుత్వం సహాయం చేస్తున్నది. అంతేకాదు, ఈ పథకాన్ని మరో 5 సంవత్సరాలు పొడిగించింది. ఈ పథకంతో పాటు జాతీయ ఆహార భద్రతా చట్టం (NFSA) ప్రకారం పీడీఎస్ ద్వారా ఇప్పటికే అమలులో ఉన్న సబ్సిడీ రేషన్‌ను కూడా కొనసాగిస్తున్నారు. జాతీయ ఆహార భద్రతా చట్టం క్రింద, గరీబ్ కల్యాణ్ అన్న యోజన కింద కేంద్రం నుండి ఆంధ్రప్రదేశ్‌కు సగటున సంవత్సరానికి అందుతున్న సబ్సిడీ రూ. 16,000 కోట్లు.

స్వచ్ఛ భారత్ ద్వారా దాదాపు 98% ఓడీఎఫ్ సాధించిన అనంతరం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద దేశంలోని పేదల కోసం 3 కోట్లకు పైగా గృహాలు మంజూరయ్యాయి. అందులో ఆంధ్రప్రదేశ్‌కు అత్యధికంగా 25 లక్షల గృహాలు మంజూరు కాగా, రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. గ్రామీణ భారతదేశంలోని ప్రతి ఇంటికి సురక్షితమైన కుళాయి తాగునీటి కోసం జల్ జీవన్ మిషన్ (JJM)ను ప్రధాని మోదీ ఆగస్టు 15, 2019న ప్రకటించారు. దీని కోసం రూ. 3.75 లక్షల కోట్లు అవసరం. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50%-50% వాటా నిధులు సమకూర్చవలసి ఉంటుంది. ఈ పథకంలో ఆంధ్రప్రదేశ్ వాటాగా రూ. 9000 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్లు సక్రమంగా విడుదల చేయకపోవడం వల్ల సకాలంలో ఫలాలు అందడం లేదు.

దేశంలో అర్హత కలిగిన 11 కోట్ల కుటుంబాలకు చెందిన దాదాపు 50 కోట్ల మంది ఆయుష్మాన్ భారత్ కింద రూ. 5 లక్షల రూపాయిల ఆరోగ్య బీమా పొందుతున్నారు. నేడు 2,322 నెట్వర్క్ హాస్పిటల్స్ ఆంధ్రప్రదేశ్‌లో ఈ పథకం క్రింద ఉన్నాయి. ప్రజలు గమనించదగ్గ ముఖ్య విషయం ఏమిటంటే, అర్హులై ఉండి కేంద్ర ప్రభుత్వ పథకాలు అందని పేదలకు గృహాలను మంజూరు చేయడానికీ, ఆయుష్మాన్ భారత్ కార్డులు, ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్ వికసిత్ సంకల్ప భారత్‌యాత్రలో అక్కడికక్కడే జారీ చేయడానికీ ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు ఇప్పటివరకు అందనివారి కోసం గ్యారెంటీ వాహనం పంపి కేంద్ర పథకాలను గ్రామగ్రామాన వారి గడప దగ్గరకే మోదీ చేర్చారు. మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత తొమ్మిదిన్నర సంవత్సరాలుగా 50 కోట్ల జనధన్ ఖాతాలకు రూ. 35 లక్షల కోట్లు నేరుగా బదిలీ చేసింది. ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే రూ. 3 లక్షల కోట్లకు పైగా కేంద్ర ప్రభుత్వ నిధులు లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా బదిలీ అయినాయి.



లంకా దినకర్
**B.com.,F.CA.**
ఏపీ బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి


ఇప్పుడు, అర్హులైన లబ్ధిదారుల కోసం కొత్త జనధన్ ఖాతాలు వికాస్ సంకల్ప భారత్ యాత్రలో తెరుస్తున్నారు.

కొవిడ్ 19 లాక్‌డౌన్ అనిశ్చితి వల్ల చిన్న, వీధి వ్యాపారుల రోజువారీ ఆర్థిక అవసరాల సర్దుబాటు కష్టతరమయింది. పీఎం స్వనిధి పథకంతో బ్యాంకులు ద్వారా వారి కోసం వడ్డీ రాయితీతో 10 వేల రూపాయిల రుణం కేంద్రం అందించింది. మొదటి సారి తీసుకొన్న రుణం సకాలంలో చెల్లించినట్లయితే, మరో దఫా తక్కువ వడ్డీ రేట్లతో వారి వ్యాపార అవసరాల కోసం రుణం మొత్తం రూ. 25 వేలకు పెంచి ఇస్తారు. చిరువ్యాపారులు, హాకర్లు అసంఘటిత రంగాలపై ఆధారపడి ఎక్కువ వడ్డీ రేట్లతో రుణాల తీసుకునే బాధ నుండి బయట పడడానికి మోదీ ప్రభుత్వం ఈ రీతిలో సాయపడుతున్నది విశ్వకర్మ యోజన.

**మరొక పథకం**

18 కేటగిరీల హస్తకళా నిపుణులకు శిక్షణతో పాటు, ఉచితంగా రూ. 15 వేల విలువైన పరికరాలు, ఆర్థికసహాయాన్ని అందించడానికి ఈ పథకాన్ని తీసుకువచ్చారు. విశ్వకర్మ యోజన కింద రూ. 13 వేల కోట్ల బడ్జెట్‌తో హస్తకళాకారులను ప్రోత్సహిస్తున్నారు. వికసిత సంకల్ప భారత్ యాత్ర స్ఫూర్తి– సబ్‌కా సాథ్ (ప్రజలందరితో), సబ్‌కా వికాస్ (ప్రజలందరి అభివృద్ధి కోసం), సబ్‌కా విశ్వాస్ (ప్రజలందరి విశ్వాసంతో), సబ్‌కా ప్రయాస్ (ప్రజలందరి ప్రమేయంతో) అనే అంత్యోదయ విధానమే. దీని లక్ష్యం 2047కు భారత్‌ను సర్వోన్నత శక్తిగా నిలపడమే. ★

# ఆ బంధం దృఢ



అరబ్ దేశాలలో ఒకటయిన ఒమన్‌తో భారత్ ఎందుకు అంత సన్నిహితంగా వ్యవహరిస్తోంది? అనేది ఆసక్తికరం. దీనివల్ల అంతర్జాతీయంగా భారత్‌కు ఎలాంటి ప్రయోజనం కలుగుతోంది? సుల్తాన్ హైతం బిన్ తారిక్ భారత్‌కు రావటం వల్ల ఈ రెండు దేశాల దౌత్య సంబంధాలపైన ఎలాంటి ప్రభావం పడింది అనేది ఈ వ్యాసంలో చూద్దాం.

ఇండియా, ఒమన్‌ల మధ్య బలీయమైన బంధం ఉంది. శాంతికి ఒయాసిస్సుగా పిలుచుకునే ఒమన్ ఈ ప్రాంతంలో మనకు వ్యూహాత్మక భాగస్వామి. అంతే కాదు. అరబ్ గల్ఫ్ ప్రాంతంలో సన్నిహితంగా ఉండే పొరుగుదేశం. మధ్యప్రాచ్యానికి అది గేట్ వే. మొదటి నుంచి భారత్‌కు, ఒమన్‌కు మధ్య స్నేహసంబంధాలు కొనసాగుతున్నాయి. సుల్తాన్ క్వాబూస్ బిన్ సైద్ హయాంలో అవి కొత్త పుంతలు తొక్కాయి. భారత్‌తో ఆయనకు ప్రత్యేక హార్థికమైన బంధం ఉండేది. పుణెలో భారత మాజీ రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ దగ్గర విద్యాభ్యాసం చేయటం అందుకు కారణం.

సంఘర్షణలమయంగా ఉండే మధ్యప్రాచ్యంలో ఒమన్ ఆచరణాత్మకమైన విదేశాంగ విధానం, సంయమనం, మధ్యవర్తిత్వ విధానాలను అనుసరించటం ద్వారా భారత్‌కు ఆశాకిరణంగా నిలిచింది. డిసెంబరు15న ఒమన్ సుల్తాన్ హైదమ్ బిన్ తారిక్ అధికారిక బృందంతో మూడు రోజుల పర్యటనకు న్యూఢిల్లీకి విచ్చేశారు. రక్షణశాఖ ఉపప్రధానితోపాటు, ఏడుగురు కేబినెట్ మంత్రులు, ముగ్గురు సహాయ మంత్రులు ఆయన వెంట వచ్చారు. 1997లో సుల్తాన్ క్వాబూ వచ్చి వెళ్లిన తర్వాత ఈ స్థాయిలో పర్యటన సాగటం ఇదే మొదటిసారి. ప్రధాని మోదీ 1997లో ఒమన్ సందర్శించినప్పుడు ఉన్నతాధికారుల స్థాయిలో సమావేశాలు ఏర్పాటయ్యాయి. చారిత్రకమైన ఈ పర్యటనద్వారా డకమ్ పోర్టు ద్వారా రాకపోకలకు మార్గం ఏర్పడింది. వ్యూహాత్మకమైన ఈ పరిణామం.. భారతదేశం చుట్టుపక్కల హిందూ మహాసముద్రంపైన ఆధిపత్యం సాధించాలన్న చైనా ‘స్ట్రింగ్ ఆఫ్ పెరల్స్’ ఎత్తుగడలను దెబ్బతీసింది.

దరిమిలా 2019లో రెండు దేశాలు సముద్ర రవాణా ఒప్పందం చేసుకున్నాయి. గల్ఫ్ దేశాలతో కుదుర్చుకున్న తొలి ఒప్పందం అది. ఈ ఒప్పందం ద్వారా తూర్పు ఆఫ్రికా, హిందూమహా సముద్ర పరిధిలో సముద్రయాన లక్ష్యాల సాధనకు మార్గం ఏర్పడింది. ఈ సందర్భంగా అష్గాబత్ ఒప్పందంలో సభ్యులయిన ఇండియా, ఒమన్, ఇరాన్‌ల త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. పర్షియన్ గల్ఫ్, మధ్య ఆసియాను అనుసంధానం చేయటం అనేది ఈ ఒప్పందంలో ప్రధానమైన అంశం.

ఇండియా, ఒమన్ దౌత్యసంబంధాలు ఎప్పుడో 1955లోనే ప్రారంభమయ్యాయి. 2008 నాటికి అవి వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సంపాదించుకునే స్థాయికి చేరాయి. 2008 నుంచి ఒమన్ భారతీయ నావికాదళం యాంటీ పైరసీ విధానాలకు మద్దతు ఇస్తూ వస్తోంది. 2019లో ఇండియన్ నేవీ చేపట్టిన సంకల్ప్‌లో భాగంగా పర్షియన్ గల్ఫ్ మీదుగా సాగే భారతీయ నౌకల భద్రతకు ఒమన్ సహకరిస్తోంది. రెండు దేశాల దౌత్యసంబంధాలకు 60ఏళ్లు నిండిన సందర్భంగా, ఐఎన్ఎస్ తరంగిణి, ఒమన్ షబాబ్‌కి చెందిన రాయల్ నేవీలు కలిసి పురాతన వ్యాపార మార్గంలో సముద్రయానం చేశాయి. ఈ సందర్భంగా రెండేళ్లకోమారు చేపట్టే ద్వైపాక్షిక విన్యాసాలను చేపట్టారు.

చారిత్రక, భౌగోళిక, సాంస్కృతిక, వ్యాపార సంబంధాలను పునరుద్ధరించు కోవాలని ఇండియా, ఒమన్‌లు భావించాయి. ఇందుకోసం 2025–26 నాటికి భారతీయ విజ్ఞానంతో నౌకను రూపొందించి గుజరాత్‌లోని మాండవి నుంచి మస్కట్ వెళ్లేలా ప్రణాళికను రూపొందించారు. దానితో పాటు ఇండియా, ఒమన్ జాతీయ నృత్యాలను పోలిన స్టాంపులను విడుదల చేశాయి. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ కల్చరల్ రిలేషన్స్ (ఐసీసీఆర్) ఆధ్వర్యంలో హిందీ భాషలో ఇండియన్ స్టడీస్ ఛైర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

మారిటైం (సముద్రతీరం, జలాలు) భద్రత, సహకారం, రక్షణ సహకారం అనేవి వ్యూహాత్మక భాగస్వామ్యంలో కీలకంగా మారాయి. ఇందులో భాగంగా రెండు దేశాలకు చెందిన రక్షణశాఖ అధికారులు రాకపోకలు కొనసాగించటం, నిపుణులతో శిక్షణ కార్యకలాపాలు చేపట్టటం వంటివి కొనసాగాలని నిర్దేశించారు. మరోవైపు భారత్ ఒమన్ నుంచి క్రూడ్ ఆయిల్ దిగుమతి చేసుకునే దేశాలలో భారత్ రెండోది. చైనా తర్వాత స్థానంలో అది ఉంది.

ఈ రెండు దేశాల మధ్య 2020–21లో 5.4 బిలియన్ డాలర్లు గా ఉన్న వ్యాపార సామర్థ్యం 2022–23 నాటికి 12.388 బిలియన్ డాలర్లకు చేరటంతో సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (కాంప్రెహెన్సివ్ ఎకనమిక్ పార్టనర్ షిప్ అగ్రిమెంటు – (సీఈపీఏ)ని పూర్తిచేయాలని సంకల్పించాయి. గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) నివేదిక ప్రకారం, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్టీఏ)ని అమలు చేయటం వల్ల ఒమన్ ద్వారా రవాణా అయ్యే 3.7 బిలియన్ డాలర్ల విలువైన సరుకుకి కస్టమ్స్ మినహాయింపు లభిస్తుంది. దీని వల్ల ద్వైపాక్షిక వ్యాపారానికి తర్వాత దశకు చేరేందుకు తాజాప్రేరణ దక్కుతుంది. అలాగే ద్వైపాక్షిక పెట్టుబడులు కూడా వేగవంతంగా వృద్ధి చెందుతున్నాయి. 7.5 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఒమన్‌లో ఆరు వేలకు పైగా భారతీయ, ఒమన్ ఉమ్మడి వ్యాపార సంస్థలు పనిచేస్తున్నాయి. వ్యాపారం, పెట్టుబడులను పెంచే క్రమంలో దేశాలు మూడో విడత 300 మిలియన్ డాలర్ల పెట్టుబడితో, స్టేట్ బ్యాంకు ఆఫ్

ఇండియా, ఒమన్ ఇన్వెస్ట్ మెంటు అథారిటీల సంయుక్త ఆధ్వర్యంలో ఒమన్–ఇండియన్ జాయింట్ ఇన్వెస్ట్మెంటు ఫండ్ (ఓఐజెఐఎఫ్)ను సిద్ధంచేశారు. అక్టోబరు 2022లో ఒమన్ రూపే డెబిట్ కార్డులను ప్రారంభించింది.

పెరుగుతున్న సారూప్యతను దృష్టిలో పెట్టుకుని ఇండియా–ఒమన్‌లు తమ లక్ష్యాలకు పదును పెట్టాయి. 'భవిష్యత్ భాగస్వామ్యం' పేరుతో, ఒమన్ విజన్ 2040, ప్రధాని అమృత్ కాల్ విజన్‌కు దగ్గరగా భారతదేశ అభివృద్ధి ప్రణాళికల అమలుకు



# మైనది

ఉమ్మడిగా దృష్టి పెట్టాయి. విజన్ డాక్యుమెంటులో 10 అంశాలు కీలకంగా మారాయి. మారిటైం సహకారం, ఇంధన భద్రత, హరిత ఇంధనం, అంతరిక్షం, టెక్నాలజీ, డిజిటల్ పేమెంట్స్, ఆర్థిక/ద్రవ్య సహకారం, వాణిజ్యం, పెట్టుబడులు, ఆరోగ్యం, పర్యాటకం, ఆతిథ్యం, ఐటీ, ఆవిష్కరణలు, వ్యవసాయం, ఆహార భద్రత వంటి అంశాలు ఇందులో ఉన్నాయి.

దీనిలో భాగంగా సంస్కృతి, నాగరికత, సమాచార సాంకేతికత, టెర్రర్ ఫైనాన్సింగ్ పైన సమాచారాన్ని పంచుకోవటం, ఉపాధి, హిందీ చెయిర్ ఏర్పాటు, ఒమన్ ఇండియా జాయింట్ ఇన్వెస్ట్మెంటు ఫండ్ (ఓఐజెఐఎఫ్) లకు సంబంధించి ఆరు ఎంఓయులపై సంతకం చేశాయి.

ప్రాంతీయ, అంతర్జాతీయ వ్యవహారాలకు సంబంధించి రెండు దేశాల నేతలు చర్చలు జరిపారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం కొనసాగుతున్న కీలక తరుణంలో రెండు దేశాలకు ఎదురవుతున్న సవాళ్ల గురించి, బహుముఖాలుగా సాగే సంఘర్షణ, మానవతా సంక్షోభం గురించి, తీవ్రవాద ప్రభావం గురించి చర్చలు జరి పారు. ఈ విషయంలో రెండు దేశాలకు ఆమోదయోగ్యమైన మార్గంలో ముందుకు వెళ్లాలని నిర్ణయించారు.

ఇజ్రాయెల్–హమాస్ సంక్షోభం నేపథ్యంలో ఓ వైపు గాజాకు మానవతా సాయం అందిస్తూనే, హమస్ తీవ్రవాదదాడులను భారత్ ఖండించటాన్ని ప్రపంచ దేశాలు తప్పుపట్టసాగాయి. దీర్ఘకాలంగా పాలస్తీనాకు మద్దతు ఇచ్చే వైఖరిని అనుసరిస్తూ కాల్పుల విరమణకు అనుకూలంగా యుఎన్జీఏకు భారత్ ఓటు వేసింది. ఒమన్ సుల్తాన్ పర్యటనలో రెండు దేశాలకు ఆమోదయోగ్యంగా ఉండే పరిష్కారాన్ని సూచించి భారత్ తనకు వ్యతిరేకంగా సాగుతున్న ప్రచారానికి తెరదించింది. దీర్ఘకాలిక భాగస్వామ్యానికి కార్యాచరణ చేపట్టటం ద్వారా మధ్యప్రాచ్యానికి చేరువయ్యారు.

ఒమన్ లో దాదాపు 7లక్షల మంది భారతీయులు ఉన్నారు. వ్యక్తుల నుంచి వ్యక్తుల మధ్య రెండు దేశాల మధ్య దీర్ఘకాల భాగస్వామ్యం బలీయంగా ఉంది. ఈ ప్రాంతంలో ఉండే మిగిలిన దేశాలతో పోలిస్తే బహుళ సంస్కృతిని కలిగిన సమాజం ఉన్న ఒమన్ త్వరగా భారతీయ సాంప్రదాయాన్ని విజ్ఞానాన్ని స్వీకరించింది. యోగాను ప్రచారం చేయటంలో కూడా ఒమన్ అగ్రగామిగా ఉంది.

2023 యోగా డే సందర్భంగా ఒమన్ పర్యాటక మంత్రిత్వ శాఖ 'సోల్ ఫుల్ యోగా.. సెరెన్ ఒమన్' పేరుతో సృజనాత్మక వీడియోను విడుదల చేసింది. దేశంలో ఆరోగ్య సంరక్షణ పట్ల ప్రాధాన్యత పెరుగుతున్న క్రమంలో సుల్తాన్ పర్యటన సందర్భంగా ఒమన్‌ను ఆయుర్వేద హబ్‌గా మార్చటానికి ఉన్న అవకాశాలపై రెండు దేశాల నేతలు చర్చించారు.

ఇండియాకు ఒమన్ తో ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఇది జీ20 సమావేశం సందర్భంగా ఆ దేశాన్ని ప్రత్యేక అతిథిగా ఆహ్వానించటం ద్వారా వ్యక్తమైంది. ఈ సెంటిమెంట్స్‌ను బలపరిచేలా ప్రధాని తన ప్రారంభోపన్యాసం సాగింది. ఆ సందర్భంగా, "మా మధ్య సాన్నిహిత్యం భౌగోళికమైనది. అదే వేలాది సంవత్సరాలుగా వ్యాపారం, సంస్కృతులతో ముడిపడి ఉంది. అన్నింటిలోనూ మేం వాళ్లకు ఇస్తున్న తొలి ప్రాధాన్యతలోనూ ఇది వ్యక్తం అవుతోంది" అని మోదీ అన్నారు.

ఒమన్ కూడా భారత్ జీ20 అధ్యక్ష బాధ్యతలను



డా. రామహరిత

స్వాగతించింది. అంతర్జాతీయ సహకారాన్ని పొందేందుకు, ప్రపంచాన్ని వేధిస్తున్న కీలకమైన అంశాలను చర్చించేందుకు భారత్ ఒక వేదికను కల్పించటం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేసింది. ఈ ప్రాంతంలో ఉండే సమస్యలతో ఎలాంటి సంబంధం లేకుండా ప్రత్యేక విదేశాంగ విధానాన్ని అనుసరిస్తూ, తటస్థంగా వ్యవహరించే ఒమన్ మనం ఆధారపడదగిన దేశంగా నిలిచింది.

ఇరాన్ అణుచర్చలు నిర్వహించిన సందర్భంగా ఒమన్ కీలకమైన భూమిక పోషించింది. రెడ్ సీలో హౌతీ దాడుల నేపథ్యంలో, అంతర్జాతీయ వ్యాపారం దెబ్బతినే పరిస్థితులు ఏర్పడతాయని అనుమానాలు వ్యక్తం అయిన క్రమంలో సుల్తాన్ భారతదేశంలో పర్యటించారు. ఇరాన్ దన్నుతో వ్యవహరిస్తున్న తిరుగుబాటు దారులకు ఇతర దేశాల వారికి మధ్య చర్చలకు ఒమన్ మధ్యవర్తిత్వం వహించింది. స్వయం ప్రతిపత్తితో వ్యవహరిస్తున్న భారత్, పవర్ గేమ్ నిర్వహణలో చాకచక్యం చూపే ఒమన్‌లు సంక్షుభితమైన ఈ ప్రాంతంలో శాంతి దూతలుగా నిలిచాయి. ఈ రెండు దేశాల నడుమ భాగస్వామ్యం వాటికి మాత్రమే ప్రయోజనం కలగించటం లేదు. సముద్రప్రాంతం మొత్తంలో బెదిరింపులను ఎదుర్కోవటానికి ఇరు దేశాల మధ్య సహకారం, మైత్రి దోహదం చేస్తున్నాయి.

పశ్చిమాసియాకు ఒమన్ భారతదేశం గేట్ వేగా నిలుస్తోంది. భౌగోళికంగా అది ఉండే ప్రదేశం, భారత్..మధ్యప్రాచ్యం.. యూరప్ కనెక్టివిటీ కారిడార్ (ఐఎమ్ఈసీ)లో ప్రముఖ పాత్ర పోషిస్తోంది. పశ్చిమాసియా అంతటా యూరప్ తో భారత దేశాన్ని అనుసంధానించటానికి, ఒమన్ సముద్ర గర్భ కనెక్టివిటీలో కీలకమైన పాత్ర పోషిస్తోంది.

భారత్ కి సంబంధించి మధ్యప్రాచ్య విధానాల్లో కీలకభూమిక పోషిస్తోంది. ఇజ్రాయెల్– హమాస్ వివాదం, ఈ రెండుదేశాల వ్యూహాత్మక భాగస్వామ్యానికి పరీక్షగా నిలుస్తున్న తరుణంలో, సుల్తాన్ భారత్‌కు రావటం అనేది ద్వైపాక్షిక సహకారాన్ని ద్విగుణీకృతం చేసింది. భవిష్యత్తు భాగస్వామ్యం పట్ల దృఢమైన నమ్మకాన్ని పెంచిందనటంలో ఎలాంటి సందేహం లేదు.

అను: డాక్టర్ పార్థసారథి చిరువోలు



భారతీయ ఆధ్యాత్మిక సంపదకు రక్షకుడిగా, హిందూ మత ఔన్నత్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన మహోన్నతుడిగా,జాతికి స్ఫూర్తిగా నిలిచారు నరేంద్ర అనే పూర్వ నామధేయులు వివేకానంద. 'పార్లమెంట్ ఆఫ్ రెలిజియన్స్ ' సమావేశానికి హాజరయ్యేందుకు వెళ్లాలనుకున్నప్పుడు ఖేత్రి మహారాజు నారింజ రంగు సిల్క్ శాలువా, కాషాయ రంగు తలపాగా, స్టీమర్‌లో మొదటి తరగతి టికెట్ బహూకరించారు. ఆ సమయంలో అభిమానులు 'వివేకానంద' పేరును సూచించారు. అదే ఆయనకు సార్థకమైంది.

# ధర్మద్రష్ట దివ్యానుభూతి

స్వామి వివేకానంద 1892 ఆఖరిభాగంలో దక్షిణ భారత పర్యటనను ముగించుకొని మాతృదేవి చరణ పీఠి కన్యాకుమారి అగ్రం వెళ్లారు. దేశభక్త శేఖరుడైన ఆయన ఆ భావనతో ఉప్పొంగిపోయారు. మాతృదేవికి ప్రత్యక్షమూర్తి అనదగు కన్యాకుమారి

# పులకించిన భాగ్య

ఫిబ్రవరి 10, 1893వ సంవత్సరం. హైదరాబాద్ రైల్వేస్టేషన్‌లో కోలాహలం. 500 మంది నగర ప్రముఖులు అక్కడ చేరారు. న్యాయవాదులు, న్యాయాధిపతులు, న్యాయవాదులు, వణిజులు, పండితులు... ఒకరేమిటి? రాజా శ్రీనివాసరావు బహద్దూర్, మహారాజా రామ్‌భావ్ బహద్దూర్, పండిత్ రతన్‌లాల్, కెప్టెన్ రఘునాథ్, షాయ్‌మల్ ఉలేమా సైయ్యద్ ఆలీబిల్ గ్రమీ, నవాబ్ ఇమాద్‌జంగ్ బహద్దూర్ , నవాబ్ దులాఖాన్ బహద్దూర్, నవాబ్ సికందర్ జంగ్ బహద్దూర్, హెచ్. దొరబ్‌జీ, ఎఫ్.యస్.మండన్, డా॥ రాయ్ హుకుంచంద్ సేఠ్ చతుర్భుజ్, డా॥రాయ్ హుకుంచంద్ సేఠ్ చతుర్భుజ్, సేఠ్ మోతీలాల్, బాబూ కాళీచరణ్ ఛటర్జీ ..ఇలా అన్ని వర్గాలకు చెందిన 500 మంది నగర ప్రముఖులు అక్కడ చేరారు. ఒక ప్రత్యక్ష సాక్షి రాసిన దాని ప్రకారం ' హైద్రాబాద్ అంతకుపూర్వం కనీ వినీ ఎరుగని స్వాగత సమావేశమది. మద్రాసు నుండి విచ్చేస్తున్న స్వామి వివేకానందుల స్వాగతానికి పూలమాలలతో నిరీక్షణ. వివేకానందుని కదల్చి వేసిన దృశ్యమది'.

అప్పటికే వివేకానందుని పేరు దేశమంతా మార్మోగిపోతోంది. ఆయన మద్రాసు పర్యటనలో ఉండగా, 'కనీసం ఒక్కసారి మీ దర్శనం ఇప్పించండి' అని హైదరాబాద్ నుంచి మద్రాసుకు తంతులు వెళ్ళాయి. అనుకోకుండా వచ్చిన ఈ ఆహ్వానం వివేకానందునికి ఆశ్చర్యం కల్గించింది. దానిని భగవత్సంకల్పంగా స్వీకరించారు. అంతేకాదు స్వామి ఫలాని తేదీన వస్తున్నారని నవాబు సూపరింటెండెంటింగ్ ఇంజనీరు బాబూ మధుసూదన్ చటర్జీకి తంతి అందింది. ఆయన పర్యటనకు అవసరమైన ఏర్పాట్ల గురించి చర్చించేందుకు జంట నగరాలకు చెందిన ప్రముఖులు సమావేశమై నిర్వహణ సమితిని ఏర్పాటు చేశారు. మహబూబ్ కళాశాలను ప్రసంగ వేదికగా ఖరారు చేశారు.

పర్యటనలో భాగంగా వివేకానంద గోల్కొండ కోటను సందర్శించి వచ్చే సరికి, 'ఒక్కసారి రాజ భవనానికి విచ్చేయవలసింద' ని వాకిట్లోకి ఆహ్వానం వచ్చింది. స్వామి అంగీకరించడంతో, నైజాము తన ప్రతినిధి ద్వారా ఆయనను భవనంలోకి స్వాగతించారు. నవాబ్ బావమరది సర్ కుర్షీద్ ఝాకు మత విశ్వాసాలు మెండు. ఆ సేతు హిమాలయ పర్యంతం గల హైందవ పుణ్యక్షేత్రముల నన్నిటిని ఆయన అప్పటికే దర్శించి ఉన్నారు. స్వామిని ప్రత్యేకంగా ఆహ్వానించి, రెండు గంటలకు పైగా చర్చలు జరిపారు. అందులో నవాబ్‌కు ఒక్క విషయం నచ్చలేదు. విగ్రహారాధన తనకు నచ్చదన్నాడు. స్వామిలో దైవావేశం విజృంభించింది. భగవద్భావనా వికాసాన్ని, భగవంతుని మూర్తి రూపంలో ఆరాధించటం అవసరాన్ని వివరించారు. సమస్త మతాల ప్రాతిపదికలకు, నిత్య సత్యరూపాన్ని వివరించారు.

ఒక్క ముక్కలో – హైందవ ధర్మ స్వరూపాన్ని ఆయన కళ్ల ముందుంచారు. నవాబ్ ఆనందాశ్రువులు తుడుచుకుని, ఒక్కసారిగా "స్వామీ! మీ కృషికి తోడుపడాలని ఉంది. అందుకు ఒక వేయి రూప్యముల కానుక నీయదలచాను" అన్నాడు. అయితే స్వామి స్వీకరించలేదు. అవసరమైనప్పుడు అడుగుతానన్నారు.

13వ తేదీన హైదరాబాద్ ప్రధాని అఫ్జల్ ఝా, వేష్కర్ రాజా నరేంద్ర కృష్ణ బహదూర్, మున్నగువారు స్వామిని కలిశారు. అమెరికా మున్నగు దేశాలలో ధర్మవ్యాప్తి చేయాలనే ఆయన సంకల్పాన్ని వారంతా ఏకగ్రీవంగా సమర్థించారు. ఆ రోజు మధ్యాహ్నం మహబూబ్ కళాశాలలో ప్రసంగం. అధ్యక్షపీఠంలో పండిత్ రతన్ లాల్ కూర్చొన్నారు. "పశ్చిమ రాజ్యాలకు నా పర్యటనా సంకల్పం" అనే విషయంపై వివేకానందులు ప్రసంగించారు. వేయిమంది ప్రేక్షకులకుపైగా ఆసీనులై వున్నారు. ప్రేక్షకులలో ఎందరో ఐరోపీయులు కూడా ఉన్నారు. ఆయన వ్యక్తం చేసిన ఉన్నత భావాలు, తనది కాని ఆంగ్ల భాషపై కూడా ఆయనకున్న అద్భుత ప్రజ్ఞ, ఆయన పాండిత్యం, మేధస్సు అందరిని చకితులను

దేవికి పూజాదికాలు నిర్వహించారు.

అక్కడి రెండు చిన్న శైలములను ఎక్కారు. మూడుసాగరాలు సంగమ దివ్యస్థానం. చుట్టూ గంభీరమైన సముద్రం. విశాలమైన ఆకాశం క్రింద, అనంత సముద్ర ఘోష మధ్యన చిన్న శైలముపై మాతృదేవిపై దృష్టిని లగ్నం చేసిన ఆ యోగి హృదయంలో ఆ క్షణాన ఎన్నెన్ని భావాలు ఉప్పెనగా వచ్చాయో! ఎంతెంత చరిత్ర వారి మనోచక్షువుల ముందు తారాడిందో! యోగి ధ్యాన నిమగ్నుడైనారు. దేశభూత భవిష్యత్తుల గురించి యోచించారు. కోట్లాది ప్రజానీక విచారకర దృశ్యాన్ని చూచిన ఆయన హృదయం క్షోభించింది. అందుకు కారణాలపై యోచించారు.

'ఈ స్థితి.. ముఖ్యంగా పేదరికం, అమాయకత చూచిన నాకు నిద్రలేకుండా పోయింది. కన్యాకుమారిలో – దూరాన ఆ శైలం మీద కూర్చున్నప్పుడు నాకొకటి స్ఫురించింది. భవిష్యదాలోచనలకు మూర్తి రూపం వచ్చింది. ఒకటి కాదు అనేక పథకాలు స్ఫురించాయి. అవన్నీ రాయజాలను' అని ఆయన ఒక లేఖలో పేర్కొన్నారు. జాతి దయనీయ స్థితిపై ఆలోచనా వేదనల మధ్య మనస్సు, హృదయం క్షోభించాయి. ఆ సంఘర్షణలో కొత్త ఆలోచనలు రాసాగాయి. ఈ మహాజాతి వైభవాన్ని స్మరించుకున్నారు. ఆ ధర్మము, ఆ సంస్కృతి మనస్సులోకి రాగానే ఉత్తేజితులయ్యారు. మహాసంఘ సంస్కర్తలా విజృంభించారు.

ఈ జాతిని ఉద్ధరించ బద్ధకంకణులైన దేశోద్ధారకుల వలె భాసించారు. దీనజనులను ఆదరించి, ఆధ్యాత్మిక ప్రాతిపదికలపై యావద్రాష్ట్రమును వైభవోన్నత స్థితిలోనికి తీసుకు వెళ్లాలని సంకల్పించారు. మహోన్నత సింహాసనముపై మున్నెన్నడూ ఎరుగని వైభవంలో దేశ ధర్మ సమన్వయ స్వరూపమైన రాష్ట్రమాత ఆశీనురాలైన దృశ్యం ఆ ఆయన కళ్లముందు తారాడింది. కనుకనే "దేశభక్తుడు, ధర్మద్రష్టల సమన్వయ మూర్తియే కన్యాకుమారిలోని వివేకానందులు" అని వ్రాశారు ఆయన నెరిగినవారు. ధ్యానానంతరం ఆయన పశ్చిమ దేశాలను పర్యటించాలనే నిశ్చయానికి వచ్చారు. హైందవ తేజం ముందు పాశ్చాత్యులను మోకరిల్లజేయాలని నిశ్చయించారు.

తన ద్వారా జరిగే ఈ మేలుకొలుపు గీతం యావజ్జాతిని ఉద్ధరించడమేగాక యావత్ విశ్వానికి జాగృతి కల్గించాలని ఆశించారు. దేశ మానవళి ఉద్ధరణ కోసం నిర్వకల్పానందాన్ని కూడా త్రోసివేయాలని నిశ్చయించారు. భారత రాష్ట్ర ఉద్ధరణే ఆత్మోద్ధరణగా భావించారు. ఒకసారి పాశ్చాత్య శిష్యులతో తనను గురించి 'నేను సంక్షిప్త హిందూ రాష్ట్రమును' అన్నారట వివేకానంద. స్వామి దివ్యోతేజమును పొందిన ఈ శైలం 22 అడుగుల కాంస్య విగ్రహ ప్రతిష్ఠతో 'వివేకానంద శైలము'గా అలకరారుతోంది.


★

# నగరి

చేశాయి.ఆ మరునాడు బేగంబజారుకు చెందిన ప్రఖ్యాత బ్యాంకర్లు ఆయనను దర్శించి, వారి అమెరికా పర్యటనకు తమ కానుకలను సమకూర్చ గలమని వాగ్దానం చేశారు. ఫిబ్రవరి 16న స్వామి, హిందూ మందిర శిథిలాలనేకం చూచి వచ్చారు. చాచా సరపుద్దీన్ సమాధి, సాలార్ జంగ్ భవనం కూడా చూచి వచ్చారు.

ఈ హైద్రాబాద్ పర్యటన సందర్భంలోనే అద్భుత శక్తులు గల ఒక బ్రాహ్మణుని వారు కలిశారు. అనేక చర్చలు జరిపారు. ఆ సంఘటనకు సంబంధించి లాస్ ఏంజిల్స్‌లో 'పవర్స్ ఆఫ్ మైండ్' అనే ప్రసంగంలో (జనవరి8, 1900) వారిలా చెప్పారు. "హైద్రాబాద్‌లో ఉండగా నాకొక విషయము చెప్పారు. నగరంలో ఒక బ్రాహ్మణుడున్నాడని, అతడు అనేక వస్తువులు మంత్ర శక్తితో తెప్పిస్తాడని చెప్పారు. ఆయన ఒక గౌరవనీయుడు, ఏవో వ్యాపారంతో పొట్టపోసుకుంటున్నాడు. మీ చమత్కారం చూపవలసిందని నేనాయన్ను అడిగాను. ఈయన కప్పుడు జ్వరంగా వుంది. మహనీయు లెవరైనా తాకితే జ్వరాలు మొదలైనవి నయమైపోతాయని భారతదేశంలో ఒక విశ్వాసం వున్నది. ఆ ప్రకారం ఈయన "స్వామీ, మీ చేతిని నా శిరముపై ఉంచండి. నా జ్వరము నయమయ్యేలా చేయండి" అన్నాడు. నేను "సరే, కాని నీ చమత్కారాలు చూప" మన్నాను.

హైందవ ధర్మోద్ధరణే ధ్యేయంగా...
వివేకానందుడి ప్రసంగంతో సికింద్రాబాద్‌లోని మహబూబ్ కళాశాల ప్రాంగణం పులకించి పోయింది. 'మాతృభూమిని మళ్లీ విభవసీమగా మార్చడం నా ఉద్యమ లక్ష్యం. సనాతన సంస్కృతి సౌరభాలను పంచిపెట్టడం కోసం, హైందవ ధర్మ శోభలను విందు చేయడం కోసం పాశ్చాత్యదేశాలలో పర్యటించ దలచుకున్నా... పశ్చిమం వైపుగా నా ఉద్యమం' అన్నారు. మిసిమి సొగసుల పదునైన ఉపన్యాస పటిమకు శ్రోతలు మైమరచిపోయారు. మరో ఆదిశంకరుల సాక్షాత్కారమనే భావనలో లీనమయ్యారు.



అతడూ సరేనన్నాడు. నేను అతని శిరముపై చేయి నుంచాను. ఆ తర్వాత అతడుపక్రమించాడు. అతడికి నడుము కొక గుడ్డ మాత్రముంది. మిగిలినవేవీ దగ్గరలేకుండా చేశాము. చలిగా ఉన్నందున, నా దుప్పటి మాత్రం కప్పుకోడానికిచ్చి ఒక ప్రక్కగా కూర్చోపెట్టాము. 25 జతల కండ్లు అతన్ని జాగ్రతతో చూస్తున్నాయి. "మీకు కావలసిన దేదైనా వ్రాయండి" అన్నాడతడు. మేమంతా ఆ ప్రాంతంలో దొరకని పండు మొదలైన పేర్లు వ్రాసి ఇచ్చాం. ఇక ఆ దుప్పటి క్రింది నుండి గుత్తులు గుత్తులుగా ద్రాక్ష, నారింజ ఒకటేమిటి – మేము కోరిన పండ్లన్ని రానారంభించాయి. అవన్నీ కలిపితే ఆ మనిషికి రెట్టింపు బరువుండవచ్చు. వాటిని తినమన్నాడు. కొందరు సందేహించారు. అతడే తిన నారంభించాడు. ఆ తర్వాత అందరం తిన్నాము. బాగానే ఉన్నాయి. ఆఖరున నవ నవలాడుతూ, నలగను కూడా నలగకుండా మంచు బిందువులోతన సహా, గుత్తులు గుత్తులుగా గులాబీలు వచ్చాయి. ఇవన్నీ ఎలా వచ్చాయని అడిగితే "హస్తలాఘవమ"ని జవాబిచ్చాడు. అవేమైనా కేవలం హస్తలాఘవం అనిపించ లేదు. ఎందువల్లనంటే అసలన్ని ఫలపుష్పాదలెక్కడ నుండి వచ్చినట్లు?' ఫిబ్రవరి 17న వేయిమంది ప్రజల వీడ్కోలు మధ్య స్వామి మద్రాసు రైలునెక్కారు. "వారి పవిత్ర నిరాడంబరత్వము, ఆత్మ నిగ్రహము, గాఢ తపస్సు హైద్రాబాద్ వారి హృదయాలపై చెరప సాధ్యంగాని ముద్రను వేశాయి"... అని బాబు కాళీచరణ్ అన్నారు.

**(వివేకానంద జీవితము తదితర గ్రంథాల నుండి సేకరించిన సమాచారం ఆధారంగా.. 14.1.1963 జాగృతి)**

కథ

# నేను పతిచిన

పిల్లల్ని గురించి మాట్లాడితే, "పురాణాలు చదవకండి, వేదాలు వల్లించకండి. వాస్తవంలో బ్రతకండి" అని ప్రతిదానికి అడ్డుదిడ్డంగా జ్ఞానోపదేశం చేస్తుంది నా సహాయనిరాకరణ ధర్మపత్ని.

వాస్తవం ఏమిటి? వాళ్లను ఒక్కటిగా చూసి, కూర్చుని, మాట్లాడి, చాలా సంవత్సరాలు... నెలలు..!! కనిపించినా ఒక క్షణం పలకరిస్తే, వెళుతూ చేతులు ఊపుతూ అదోరకమైన చూపు !!

పిల్లలు భార్య కుదవ వ్యాపారులే! క్రెడిట్ కార్డులు ఉన్నాయి. నా అవసరం లేదు.

"ఎలాగున్నారు?"

"వాళ్లకేం.. అమ్మాయి, బాయ్‌ఫ్రెండ్‌తో క్లబ్బుకు పోయింది... అబ్బాయి టైంపాస్‌కు ఎవర్నో తీసుకుని ఊటీ వెళ్లాడు" చాలా తేలిగ్గా చెప్పింది.

"అదెట్లా చదువు, భవిష్యత్తు, ఆరోగ్యం?" "నయం, తిథి నక్షత్రం అనలేదు. నోరుమూసుకోండి. అనుభవించడానికి, ఆనందించడానికి, ఆస్వాదించే మనసుగావాలి గాని. సమయాసందర్భాలు ఎందుకు?

"చదువుకోవాల్సిన వయసులో ఇదేమిటి? "మంచి చదువుకోసం సంస్కృతి సంస్కారం నేర్పే విద్యాలయాల్లో చేర్పించాను. పదిరోజులు నిలవలేదు. విధిలేక డబ్బుకట్టి ప్రఖ్యాత పాఠశాలల్లో చేర్పించి, చదివించాలని ఎంతో ప్రయత్నించాను. చదువుకాదు మందు మగువలను పరిశోధన చేసి వచ్చారు.

"చదువెందుకు డబ్బు సంపాదించడానికి! ఎన్నెన్నో తేలికయిన మార్గాలున్నాయి...!?" తెలివి తక్కువ దద్దమ్మా అన్నట్లున్నాయి ఆమె చూపులు.

"బికారులయినప్పుడు ?"

"ఈ అనుభవం పనికొస్తుంది."

"అడుక్కుతింటారు అనబోయి", 'అదెట్లా ఈ వయసులో అడ్డదారులు తొక్కితే వ్యక్తిత్వం..?'

"అదే వాళ్లు పెంచుకుంటున్నది. మీరు చస్తే మాకొచ్చే కోట్లు చాలు. కూడపెట్టడం కాషాయి



వాకాటి పాండురంగరావు స్మారక దీపావళి కథల పోటీలో విశిష్ట బహుమతి పొందిన రచన

# శిల్పాలు

డా.కనపూరు శ్రీనివాసులు రెడ్డి

వస్త్రాలు వేసుకోవడానికి కాదు, రాచరికంగా జీవించాలి. సమాజంలో పై అంతస్తుకు చేరాలంటే ఈ రోజుల్లో దగుల్బాజితనాల వంటి తర్ఫీదు తప్పదు!!" అంది నింపాదిగా!

అందరూ అంత దిగజారి పోలేదు అని గట్టిగా అరవాలనిపించి తగ్గి, "అయినా ఇప్పుడు అన్నిటికీ క్యాస్టు చూస్తున్నారు కదా?" నసిగినట్టు వెనకాడుతూ అన్నాను.

"ఏమిటి పిచ్చా మీకు. ఇలాంటివాటికి కూడా ఉండవు!! సహజవనరులు. జాతీయం చేసేసారు !!"

"చూడకపోతే పరువు ప్రతిష్ఠ మంటగలిసినట్టు అని కుల మహానాడులో చీప్ లిక్కర్లుతాగి శపథాలు చేసారు కదా!!"

నవ్వింది. ఎందుకో? "కోరికలకు కుల మతా లుండవు. వర్గాలుండవు. పగ్గాలుండవు. ఆనందానికి హద్దులు ఉండవు" అంది, అన్నీ కనిపించేటట్లు వేసుకున్న రవికను చీరను సరిచేసుకుంటూ! ఎబ్బెట్టుగా ఆసహ్యంగా అనిపించింది. ఈ ఆడవాళ్లకు తమ అందం మీద వాళ్లకే నమ్మకం ఉండదు. వయసును బట్టి కట్టుబొట్టు ఉండాలి. స్త్రీ ఎప్పుడు బజారు వస్తువు కాకూడదు. కానీ అధునాతన యుగంలో వొంపు సొంపులన్నిటినీ అడ్డదిడ్డంగా చూపించి రెచ్చగొట్టి మరీ పిలిచి వ్యక్తిత్వాన్ని వ్యభిచారానికి పంపుతున్న సంగతి అహంలో మరచి పోతున్నారు. పొంగులన్నీ పదిమందికి చూపితే అదొక ప్రతిష్ఠగా, పుట్టుకకు గుర్తింపుగా ఆనంద పడుతున్నారు. వ్యసనాలకు బానిసలై, రోగాలతో కుల్లి పోయిన రోజున గుర్తొస్తుంది ఇలా బ్రతికుండకూడదు అని. అదీ కొందరు మాత్రమే!! వ్యసనానికి ఉన్న శక్తిని అధిగమించడం ఎవ్వరి తరమూ కాదు. ఆ నరకాశ్రమంలోనే వ్యభిచరిస్తూ పురుగులు పట్టి చస్తారు. నిరూపణలు చూపించినా వాళ్లు వేరు మేము వేరు అంటారు. తప్పేం చేస్తున్నాం అని నిలదీస్తారు. మారాలని ఉండదు.

ముందు దీన్ని గొంతు ...అని రెచ్చిపోయి, స్త్రీ హత్య మహా పాతకం...పాపం అని..? సంసార ద్రోహి...సంఘ విద్రోహి అనే మాట బయటకు రాలేక గుండెల్లో గిలగిలలాడింది.

"ఏవిటి మళ్లీ ఆకాశంలో విహరిస్తున్నట్లుంది. కళ్లు వొళ్లు దగ్గర పెట్టుకుని ఈ లోకంలోకి రండి. నేను వెళ్లాల. కాసుకోనుంటారు చాలామంది ఆటకు"

ఈ అధునిక యుగంలో మొగుళ్ల శ్రమించో, అరాచికంగానో దిగజారి సంపాదించిన డబ్బుతో నేల కనిపించని కొవ్వుపెరిగి పనిపాటలను అసహ్యించు కునే స్త్రీలు, భర్తను, ఇంటిని, పిల్లలను దొంగలకు తోలి తీరని కోరికలు తీర్చుకునేందుకు పదిమంది కలిసి ఒకరింట్లో కూర్చుని మందు మాకు పేకాటలలో ఆ ఇంటి ఈ ఇంటి పుకార్లను పురాణాలుగా చిత్ర విచిత్రంగా సృష్టించి ఆనందిస్తుంటారట?

ఇల్లాలు ఇలవేల్పు, ఆదిదేవత అనే మాటలు సిగ్గుపడి తలవంచుకునేలా నేటి స్త్రీ తయారవు తుందేమోనని భయం వేస్తుంది? మరి సంస్కృతి, దేశ భవిష్యత్తు? ముందు నీ ఇంటి సంగతి... వాళ్ల బ్రతుకు చూడు అని మనసు మందలించింది.ఎప్పుడో ఒకసారి రక్తపుమడుగులో నీ రక్తం కోసం ముందు పడుతారు. పోనీ నేనే మారిపోతే..?

"మీరా? దేవుడు దిగిరావాలి! మీరు మంచి వారండి. వ్యక్తిత్వాన్ని దైవంగా భావించే వారండి. భారతీయ సంస్కృతి మీ రక్తంలో జీర్ణించుకు పోయివుంది భగవద్గీత మీకు ప్రాణం. ఏం బాగుపడతారు? సంతోషంగా ఎలా ఉండగలరు? మాలాగా అనుభవించడం నేర్చుకోండి . అధునాతన యుగంలో మీరు అనే అసభ్యత, కుసంస్కారం, వ్యసనం, పురోగతికి పవిత్రతకు మారు పేర్లండి"

నవ్వింది. ఎందుకో? "కోరికలకు కులమతా లుండవు. వర్గాలుండవు. పగ్గాలుండవు. ఆనందానికి హద్దులు ఉండవు" అంది, అన్నీ కనిపించేటట్లు వేసుకున్న రవికను చీరను సరిచేసుకుంటూ! ఎబ్బెట్టుగా ఆసహ్యంగా అనిపించింది. ఈ ఆడవాళ్లకు తమ అందం మీద వాళ్లకే నమ్మకం ఉండదు. వయసును బట్టి కట్టుబొట్టు ఉండాలి. స్త్రీ ఎప్పుడు బజారు వస్తువు కాకూడదు.

ఇదేవిటి నా ఇంటిలోనే ఇంత బూతు ఖజానా ఉంది. వక్రపుటాలోచనలన్నీ స్వతంత్ర భావాలు, వ్యక్తిత్వం, ఇష్టాఇష్టాలు, మానవ హక్కులు అని తల బాది తాళాలు పెరుక్కున్నారు. నేను ఇవ్వలేదు. ఎంత ప్రేమ ఉన్నా సభ్యత, సంస్కారం, క్రమశిక్షణ విషయాలలో నియంతగానే ఉండాలి. అప్పుడే సమాజం, సంసారాలు బాగుపడుతాయి.కానీ చెయ్యలేక పోయాను.

అసలు నా ధ్యాసంతా వాళ్లే!! వయసుకొచ్చారు కదా! పిల్లలు. పెండ్లి చేద్దామనుకున్నాను. ఒక గట్టి భవిష్యత్తు నిర్మిద్దామని?! మరి ఇలా ఉంటే ఎవరు...? "పెండ్లా !" కోకొల్లలు, క్యూలో ఉంటారు. ఇవన్నీ ఉండాల్సిన, మెచ్చుకునే అర్హతలు. మీలాంటి ఛాందసులు కాదు వాళ్లు.

పెద్దగానవ్వి,"అలసిపోయినప్పుడు కదా అది. రజినీష్ సిద్ధాంతం నేడు అందరిది. పొరపాటున నేను చేసుకుని తప్పు చేసాను" కళ్లు తుడుచుకుంది మా ఆవిడ.

అందుకేనా అసంతృప్తితోనేనా ఇలా? నేను ఇచ్చిన స్వతంత్రం, చూపిన ప్రేమాభిమానాలు ...?

అదోలా నా వైపు చూసింది.

కళ్లు దించుకున్నాను. ఏవిటి నా ఇంట్లో నేను?!

ఎందుకు ఎంతసేపు నా పరువు, ప్రతిష్ఠ అంటూ వీపు గోక్కుంటావు.

వాళ్లు మాస్పెస్...అంటే !? మా ఇష్టాఇష్టాలకు స్వతంత్రం ఇవ్వాలి అన్నారు. గౌరవించాలి కదా ! అరిషడ్వర్గాలను అణుచుకోవడం బానిస బ్రతుకు అని నేటి సమాజపు తీర్పు అన్నారు. అదెలా? నీకు తెలియదు నోరు మూసుకోమన్నారు.

మరి ఎలా మారుస్తావు?

వేచి చూస్తాను.వాళు తెలుసుకుంటారు మంచిని మెచ్చుకుంటారు. నా సభ్యత సంస్కారాలు జీన్సులో ఉన్నాయి. బయటపడక తప్పవు.

ఎప్పుడు? నిన్ను వీధిలోకి తోసిన తరువాతనా లేక ఇంట్లో క్లబ్బులు, బార్లు, అమ్మాయిలూ, పేకాటలు, నిత్య పూజలయినప్పుడా?

మా జీవితం! మా ఇష్టం!! మన జీవితం కాదా? తలుచుకుంటే గుండె బరువెక్కి, తట్టుకోలేనంత బాధ వేస్తుంది. విరక్తి గుండెల్ని పిండేస్తుంది. ఈ సంపాదన ఎందుకు? ఈ బిడ్డలు ఎందుకు? అనుబంధం, ఆప్యాయతలెందుకు ? అన్నిటికి డబ్బు ఉంటే చాలు అంటున్నారు. మనిషి పుట్టింది అనుభవించి ఆంక్షలు లేని ఆనందాతిరేకంలో విహరించడానికి అని నొక్కి వక్కాణిస్తున్నారు!! తప్పు చేసాను సరిద్దుద్దుకోలేని తప్పు అని కుంచించుకు పోయాను.

మమకారం, వ్యక్తిగత అభిప్రాయం,స్వాతంత్రం అనే సానుభూతి ఈ విషయంలో ఉండకూడదు. నిజమే !! దారికి తీసుకువస్తాను... చేస్తాను!!

అంతా విధి కాలం తీర్పు!! కొన్నిటిలో ... అన్నిటిలో అంటే సమర్థించలేను.


ఎవరికీ చెపుతున్నాను ? ఎవరు వినరుకాబట్టి... నాకు నేనే !

అమ్మా, కూతురు, కొడుకు, ఒక నెల రోజుల్నుంచి ఈ లోకంలో లేరు. మందు లేకనో లేక కళ్లు దిమ్మ తిరిగే దెబ్బయినా తగిలుండాలి. వ్యసనపరులకు, మూర్ఖపు అహంకారంతో కూడిన స్వాభిమానం చాలా ఎక్కువ. మాట పడరు. ఆ కుంపటిలోనే మండుతూ ఉంటారు. అతి సున్నితులు. కాదు.. వ్యసనాల చేతిలో ఇరుక్కుపోయిన కొరివి దెయ్యాలు. చావడానికి, చంపడానికి వెనుకాడరు.

"అమ్మాయికి బుగ్గమీద, చేతులు మీద, ఆ గాట్లు ఏమిటి? అబ్బాయి కాలుకి కట్టు ఏమిటి? నీ ముఖం అలా పీల్చుకు పోయిందేమిటి ?"అడిగాను. అదోలా నవ్వి, ''నరసాలు ఎలా ఉంటాయో మీకు తెలియదు?" అంది. అంత హింసాత్మకంగా ఉధృతం గానా? అంటే ఈవిడ...? అవమానంతో నా భర్తాధికారం గిలిగిలలాడింది.

"వ్యక్తిత్వపు తాకట్టు."

పట్టువదలని విక్రమార్కునిలాగా నేనూ వదలలేదు. యోగ, మెడిటేషన్ చెయ్యండి అంటే ఇప్పుడు చేస్తున్నది ఏమిటి అని కొప్పరించారు. డాక్టరు దగ్గరకు వెళదామంటే 'మాకేం బాగున్నాము. కావాల్సింది నీకు అని పిచ్చివాడ్ని చూసినట్టు చూసారు. ఏమని జవాబు చెప్పాలో తెలియలేదు. ఎన్నో రకాలుగా ప్రయత్నించాను. మరీ అడ్డు చెపితే నన్ను హత్యచేసి, డబ్బు సర్వం నాశనం చేసి వీధుల్లో అడుక్కు తింటారేమోననిపించింది.



ఆ మాటకు పిచ్చిగా నా వైపు చూసి," అందులోనే ఆనందముంది" అంది.

ఆ మాటకు నాకు అర్థం అంతుపట్టలేదు.

క్రమశిక్షణ దేవుడురా! భవిష్యత్తు ముఖ్యంరా అంటే చీరలు ఎగగట్టారు. చేతులు మడిచారు.

నేనూ చదువుకునేటప్పుడు ఆకతాయి పనులు చేసే వాడినే! కానీ దేనికి అంటుకుపోలేదు. పదనాలుగు.. ఇరవైలోపలే చదువు, సహవాసం వ్యక్తిత్వాన్ని ఏర్పరుస్తుంది.నీ నిర్ణయాలు భవిష్యత్తును నిర్ణయిస్థాయి. దారి తప్పితే అదే అగమ్య జీవన గమనం అవుతుంది.

విశృంఖల విచ్చలవిడి ఆనందాతిరేక కోసం పరుగులు తీయడానికి కారణం రెచ్చగొట్టే వక్రపు సినిమాలు, వార్తా మాధ్యమాలు. సెల్ఫోన్లు నిండా ప్రభుత్వం అదుపు చేయని లైంగిక బొమ్మలు కథలు. ఎక్కడో అట్టడుగునున్న క్షుద్ర ప్రలోభాలను, గొంతెమ్మకోర్కెలను తట్టి లేపుతున్నాయి. బూతుల మయమైన సంఘాన్ని తయారు చేస్తున్నాయి. సామూహిక తాగుడును, వ్యభిచారాన్ని, ప్రతి వ్యసనాన్ని జాతీయం చేసి చూపిస్తున్నాయి. సినిమా ముద్ర చెరపలేనిది. తప్పుడుతనాన్ని, తప్పులేదని ఒప్పుగా చూపిస్తే నేటి యువత దానినే తు.చ. తప్పకుండా అనుసరిస్తుంది. మనం ఎంత పద్ధతిగా పెంచాలనుకున్నా బయట ఆకర్షణలకు తేలిగ్గా పడిపోతారు!! కానీ విధ్వంసుకలను, వ్యసనాలను, సమాజం అసహ్యించుకోగలిగితే, వెలివేయ్యగలిగితే, గట్టిగా అడ్డ చెప్పగలిగితే, ప్రతి ఇల్లు ఒక దేవాలయం అవుతుంది.

ఆనందం అడ్డదారుల్లోనే ఉందని తప్పుడు ఆలోచన. వాళ్లునేగాక తోటి వాళ్లను సమాజాన్ని తగలపెడతారు. తమాషాగా ఒక్కసారే ఒక్కసారే అని మొదలయి గింజుకున్నా విశ్వ ప్రయత్నం చేసినా బయటపడలేని ఊబిలో కూరుకు పోతారు.


అసలు యుద్ధాలు చెయ్యాల్సింది పాకిస్తాన్, చైనా టెర్రరిష్టులతో కానేకాదు. సంస్కృతిని సంస్కారాన్ని తగలబెట్టే యువతతో, రెచ్చగొట్టే సినిమాలు వార్తా మాధ్యమాల ప్రోత్సాహకులతో. దేశ ఆర్థిక వనరులను, సంసారాలను సర్వనాశనం చేసే ఈ వ్యసనాలు, మాదక ద్రవ్యాల మీద కఠిన ఆంక్షలు విధించాలి. చేసే వాళ్లను అమ్మేవాళ్లను ఉరి తీయాలి. శిలువెయ్యాలి. ఇది ఉగ్రవాదం కాదు. దేశాన్ని, యువతను కాపాడుకొనేందుకు ఉన్న ఒకే దారి!!

ఏవేవో ఆలోచనలు ముసురుకున్నాయి. ఎక్కడ కష్ట పెడుతున్నాను అని అడిగితే..!

మరీ మొహమాటం లేకుండా ముఖం పగిలకొట్టేటట్లు మాట్లాడుతున్నారు.

పట్టువదలని విక్రమార్కునిలాగా నేనూ వదలలేదు. యోగ, మెడిటేషన్ చెయ్యండి అంటే ఇప్పుడు చేస్తున్నది ఏమిటి అని కొప్పరించారు. డాక్టరు దగ్గరకు వెళదామంటే 'మాకేం బాగున్నాము. కావాల్సింది నీకు అని పిచ్చివాడ్ని చూసినట్టు చూసారు. ఏమని జవాబు చెప్పాలో తెలియలేదు. ఎన్నో రకాలుగా ప్రయత్నించాను. మరీ అడ్డు చెపితే నన్ను హత్యచేసి, డబ్బు సర్వం నాశనం చేసి వీధుల్లో అడుక్కు తింటారేమోననిపించింది.

ప్రేమించిన వాళ్ల అభిప్రాయాలను, అభి రుచులను గౌరవించాలి. వాళ్లకు, వాళ్ల బతుకు ఉండాలి. అంటే...? నిజమే ! ఎందులో? దానికి హద్దు ఉండదా? నేను మలిచిన శిల్పాలు, పాషాణ శిలలుగా తయారయి నన్నే వెక్కిరిస్తుంటే ఎం చెయ్యాలి?



ఆలోచించమంటే కూతురు, చంద్రముఖి... బొమ్మాలిలా చిందులు వేసింది. కొడుకు కొడతాడేమో అని దూసుకురావడం చూసి భయం వేసింది. చివరకు నా భార్య జాగర్త అని వేలు చూపింది. సీత గీత దాటితే... హద్దులు చూసుకోమని. మా స్పేస్ అంటే వాళ్లు ఎక్కడ తిరిగినా, ఎప్పుడు ఎలా వచ్చినా అడగకూడదు. మరి నేనెందుకు ఈ ఇంట్లో?

వ్యక్తిత్వం వస్తువుకాదు. నీలో ఉన్న నిగూఢశక్తి!! అదే దైవత్వం అంటారేమో? అందుకే దేవుడవు అని భగవద్గీత చెపుతుంది. నీ రాత రాయగలిగేవాడివి నువ్వే! గొయ్యి తవ్వుకునేవాడివీ నువ్వే!

గుండెల్లో పొడిచినట్లు ఎవరో ప్రశ్నించారు. అన్నీ శ్రద్ధలు తీసుకో! ప్రేమగా చూడు. అతి ముదిగారం చేయకూడదు. డబ్బు అవసరానికి మించి ఇవ్వకూడదు. ఒకరు ప్రయత్నిస్తే చాలదు. పిల్లల విషయంలో భార్యాభర్తలు ఒక్క మాట మీద నడవాలి. అడ్డుచెపితే నా మీద తిరగబడేది. ఏవీ లేనివాడిని కష్టాన్ని నమ్ముకుని కోట్లు సంపాదిచగలిగాను. అవి ఇలా తగలబడతాయని అనుకోలేదు.

ఏదో ఒకటి చెయ్యాలి !! వాళ్లను మరిచిపోవాలి లేకుంటే మార్పు తీసుకు రావాలి? పుట్టించాను. అంతేనా నా బాధ్యత? పెంచుకున్న ప్రేమ మమకారాలు వాత్సల్యాలకు విలువలేదా?

బాగా పొద్దుపోయింది. ముగ్గురి జాడలేదు. ఉన్న సహాయకులు ఎదురుగా నిలుచోలేక. నిదురను ఆపుకోలేకపోతున్నారు. అప్పటికే వందసార్లు అటు ఇటు తిరిగుంటాను. ఎన్నో ఎన్నెన్నో ఆలోచనలు పరిష్కారాలు ఉపద్రవాలు పదే పదే కనిపించి, అనిపించి, తిక్కబుట్టించేసాయి. విసుగు విరక్తి భరించలేక గుండె నిలిచిపోతుందేమోనని అనిపించింది చివరకు.

బ్యాంకులకు, ఫోన్లు వాళ్లకు చెప్పాల్సింది చెప్పి, నా ఫోను డేడ్ చేసి రాత్రంతా జాగారం ఉన్నాను. ఎక్కడుంటారో, ఎలా ఉంటారో కూడా ఊహించ గలను!!

తెల్లారిపోయింది. ముఖం కడుక్కుని టీ తాగుతూ కూర్చున్నాను.

ఇంతలో పోలీసు ఇనస్పెక్టర్ వచ్చాడని లోపలికి తీసుకువచ్చారు.

"సారీ! రాత్రి డిస్కో క్లబ్‌ల మీద దాడి చేస్తే మీ అబ్బాయి, భార్య మత్తు మందులు... వ్యభిచారం చేస్తూ మీ అమ్మాయి ...? అరెస్టు చేసాము. ఉదయం, ఏడుస్తూ, గొడవ చేస్తూ వదలకపోతే నన్ను చంద్ర మండలానికి పంపుతామని, మంత్రులు గుప్పెట్లో ఉన్నారని ...?!"

పాపం! అని వాత్సల్యం అడ్డురాబోయింది. "ఉండనీ !!" అన్నాను నిర్మొహమాటంగా.

"మీకు ప్రమాదం ఉందని అనిపిస్తుంది. ఇవి చాలా పెద్ద తప్పులే! జామీను..? వదిలి పెట్టమంటే?"

"వద్దు! రాకుండా నేను చూస్తాను !"

ఆశ్చర్యంగా చూసాడు నా వైపు." ఎందుకయినా మంచిది సెక్యూరిటి ఉంచుతాను. మీ శ్రీమతి అక్కడే లాయర్లతో..! కనీసం వాళ్ల వస్తువులు, ఆమె బంగారు, డైమండ్స్ వెళ్లి తెచ్చుకుంటానని.. !"

"ఇక్కడ అలాంటివి ఏమీలేవు. నేను సంపాదించి నా డబ్బుతో అనుభవించినవి. వాళ్లకు ఎలాంటి హక్కులేదు."

"ఫోన్లు, క్రెడిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నాము. ప్రాథమిక హక్కులను అడ్డుకొనేందుకు మీరెవ్వరు అని తిరగబడుతున్నారు"

"విచ్చలవిడితనం, విశృంఖలత, నైతిక విలువలను తార్చడం, ప్రాథమిక హక్కు కానే కాదు." ఆ మాటవిని వెళ్లిపోయాడు ఇన్‌స్పెక్టర్ .

అతను వెళుతుంటే గట్టిగా నిట్టూర్పు వదిలి, ఇంతకాలం నేను సంపాదించిన డబ్బు పరువు ప్రతిష్ఠ అన్నీ ఇప్పుడు జైల్లో ఉన్నాయి.నా భార్యాబిడ్డల చేతిలో నాకు ప్రాణహాని.? దానికి సెక్యూరిటి? ఇదా నేటి అనుబంధాలకు అర్థం? నవ్వలేకపోయాను. ఇలాంటి నిర్ణయం ఎందుకు తీసుకోవాల్సి వచ్చింది? నా ప్రాణం కోసమా? కాదు!!

కొందరికైనా కనువిప్పు కలగాలని, వ్యక్తిత్వంతో కూడిన యువత దేశాన్ని స్వర్గభూమిగా చెయ్యాలని!! సభ్యత సంస్కారాలతో తల్లిదండ్రుల కన్నీరు తుడవాలని! మేరా భారత్ మహాన్ హై అని దిగంతాలు మారు మ్రోగేటట్లు సారే జహాసె అచ్చా అని మధుర స్వరాలతో వీనులు విందైన వసుధైవ కుటుంబకం... దివినంతా సంగీతమయం చెయ్యాలని!!

**జనవరి 22 సంచికలో**
**మాచిరాజు కామేశ్వరరావు కథ**
**'తక్షణ కర్తవ్యం'**

## 3వ బహుమతి కథా రచయిత పరిచయం




01-07 జనవరి జాగృతిలో వెలువడిన మూడో బహుమతి కథ **'ఛాయా చిత్ర కథనం'** రచయిత విజయార్కె పరిచయం.

రచయితగా జర్నలిస్ట్‌గా నలభయ్యేళ్లుగా అక్షర ప్రయాణం కొనసాగుతూనే ఉంది. జర్నలిస్ట్‌గా నన్ను ప్రపంచానికి పరిచయం చేసిన వరంగల్ వాణి, జనధర్మ పత్రికల సంపాదకులు యం.యస్. ఆచార్య గారు చిరస్మరణీయులు.

ఎనిమిది వందలకుపైగా కథలు, వందకుపైగా నవలలు, వ్యక్తిత్వ వికాస రచనలు, వివిధ పత్రికల్లో పరిశోధనాత్మక కథనాలు ప్రచురితమయ్యాయి. సైన్స్ ఫిక్షన్ క్యూ,మేన్ రోబో, ఫాంటసీ, కుబేరాయ నమః, మాయాశిల్పం మంత్రఖడ్గం జానపద నవల.."నరేంద్ర మోదీ.. ప్రైడ్ ఆఫ్ ఇండియా, కేసీఆర్ ది లీడర్,స్వర్ణాంధ్ర విజేత,అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్,.." తదితర రచనలు!

ఈ అమృతోత్సవాల వేళ.. ప్రపంచాన్ని పట్టి కుదిపేసే యుద్ధోన్మాదం నేపథ్యంలో రాసిన ఛాయాచిత్ర కథనం జాగృతిలో బహుమతికి ఎంపిక కావడం ఆనందంగా వుంది.

జాతిని జాగృతపరిచే అక్షర జాగృతి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ★



క్రాంతి దేవ్ మిత్ర

# ‘సమాజ హితం కోసమే కులగణన’

దేశ వ్యాప్తంగా పలు రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కులగణనకు తాము వ్యతిరేకం కాదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్పష్టం చేసింది.

“కులగణన చేపట్టిన తరువాత ఆ డేటాను సమాజ హితానికి వినియోగించాలి. దీనిపై ఎలాంటి రాజకీయాలు ఉండకూడదు. కొందరు రాజకీయ లబ్ధి కోసం వినియోగించుకునే ప్రమాదం ఉంది. ఎలాంటి వివక్ష, అసమానతలు లేని హిందూ సమాజంకోసం ఆర్ఎస్ఎస్ నిరంతరం కృషి చేస్తుంది. సమాజాభివృద్ధి కాంక్షించేలా కులగణన చేపట్టాలి. అన్ని పార్టీలు సామరస్యపూర్వక వాతావరణంలో గణన చేపట్టాలి. ఈ ప్రక్రియ జరుగుతున్నప్పుడు ఐక్యత విచ్ఛిన్నం కాకూడదు. వివిధ కారణాల వల్ల సమాజంలోని అనేక వర్గాల ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా, విద్యలో వెనకబడ్డారు. ప్రభుత్వాలు వారిని ఆదుకోవడానికి చేపడుతున్న పనులకు ఆర్ఎస్ఎస్ సంపూర్ణ మద్దతునిస్తుంది” ఆర్ఎస్ఎస్ అఖిల భారతీయ ప్రచార్ ప్రముఖ్ శ్రీ సునీల్ అంబేకర్ జారీ చేసిన పత్రికా ప్రకటన ఇది.

అంతకుముందు ఆర్ఎస్ఎస్ సీనియర్ నేతల్లో ఒకరైన శ్రీధర్ గాడ్గే స్పందిస్తూ.. కులగణన కొంత మందికి రాజకీయ ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉందని కారణంగా దానికి తన వ్యతిరేకత ప్రకటించానని, దానివల్ల ఆచరణాత్మక ఉపయోగం లేదని అన్నారు. మహారాష్ట్రలోని ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని శివసేన-భాజపా కూటమి ప్రభుత్వానికి చెందిన మంత్రులు, శాసనసభ్యులు మంగళవారం రేషీమ్‌భాగ్‌లోని ఆరెస్సెస్ వ్యవస్థాపకులు కె.బి.హెడ్గేవార్, ఆ సంస్థ రెండవ సర్ సంఘ్‌చాలక్ ఎం.ఎస్.గోల్వాల్కర్ స్మారక కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీధర్ గాడ్గే విలేకరులతో మాట్లాడారు. రిజర్వేషన్లు, కుల వ్యవస్థ వేర్వేరు అంశాలని తెలిపారు. పుట్టుక రీత్యా కులం వస్తుందని, రిజర్వేషన్లు వర్తింపజేసే సమయంలో కులం పేరును వెల్లడించాల్సి ఉంటుందని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలూ సంపూర్ణ సామాజిక పురోగతి సాధించే వరకూ రిజర్వేషన్లు కొనసాగాలని అభిప్రాయపడ్డారు.

మరోవైపు భారతదేశానికి కావలసింది అణగారిన వర్గాల అభివృద్ధితో వారిని జాతీయ స్రవంతిలో చేర్చే కార్యక్రమాలే తప్ప సమాజంలో చీలికలను పటిష్టం చేసే కుల గణన కాదని మాజీ ఐఏఎస్ అధికారి ఆర్ సుబ్రహ్మణ్యం అన్నారు. కుల గణన భారతదేశాన్ని కులాల యూనియన్‌గా మారుస్తుందని అభిప్రాయపడ్డారు

**కుల గణన చరిత్ర**

మన దేశంలో కులగణనకు పెద్ద చరిత్రే ఉంది. బ్రిటిష్ ప్రభుత్వం 1871లో కులాల వారీగా భారతదేశాన్ని విభజించి చూసే ప్రణాళిక అల్లింది. 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం అందుకు కారణంగా చెప్పుకోవచ్చు. భారతీయుల్లో జాతీయాభిమానం పెరిగి, భారతదేశంలో తమ పెత్తనం చేజారిపోతుందని ఊహించిన బ్రిటిష్ పాలకులు భారతీయ సమాజాన్ని కులాల వారీగా,



మతాల వారీగా విభజించడానికే ఈ కులాల వారీ గణనను ప్రారంభించారనేది వాస్తవం. కులాలు, మతాల లెక్కలు తెలిస్తే విభజించు పాలించు అనే బ్రిటిష్ వారి పని మరింత తేలిక అవుతుంది. బెంగాల్ విభజన తర్వాత దేశ ప్రజల్లో జాతీయ భావం మరింత పెరగడం బ్రిటిష్‌వారిని మరింత కలవర పెట్టింది. 1947లో జరిగిన దేశ విభజనకు మత పరమైన జనాభా లెక్కలు కూడా ఒక కారణం

భారతదేశంలో జనాభా గణన సేకరణ 1872లో ప్రారంభమైంది. 1931 వరకు జనాభా లెక్కలు సేకరించేటప్పుడు కులాలకు సంబంధించిన సమాచారాన్ని కూడా సేకరించేవారు. ఆ తర్వాత కులాల ఆధారంగా జనాభాను లెక్కిడం నిలిపేశారు

స్వతంత్ర భారతదేశంలో తొలిసారి 1951లో జనాభా లెక్కలు చేపట్టారు. అప్పుడు షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల సమాచారం మాత్రమే సేకరించారు. అప్పటినుంచి కులగణనను భారత ప్రభుత్వం వ్యతిరేకిస్తూ వచ్చింది. ప్రజల కులాల ఆధారంగా విభజన తేవడం దేశ సమగ్రతకు ముప్పు అని భావించం ఒక కారణమని చెబుతారు.

అయితే, 1980లలో పరిస్థితులు మారాయి. కులాల ఆధారంగా పుట్టుకొచ్చిన కొన్ని ప్రాంతీయ పార్టీలు కొన్ని రాష్ట్రాల్లో చక్రాలు తిప్పడం మొదలు పెట్టాయి. మరోవైపు రాజకీయాల్లో అగ్రవర్ణాల ఆధిపత్యానికి వ్యతిరేకత కూడా ఎదురుకావడం మొదలైంది. దిగువ కులాలకు విద్యా సంస్థలు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఇవ్వాలని ఉద్యమాలు కూడా మొదలయ్యాయి.

1979లో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు ఇచ్చే అంశాలను పరిశీలించేందుకు భారత ప్రభుత్వం మండల్ కమిషన్‌ను ఏర్పాటుచేసింది. ఇతర వెనుకబడిన తరగతులు(ఓబీసీ)లకు కూడా రిజర్వేషన్లు ఇవ్వాలని మండల్ కమిషన్ సిఫార్సు చేసింది. 1990లో ఈ సిఫార్సులను కేంద్రం అమలుచేయాలని భావించింది.

కుల గణనకు రిజర్వేషన్లతో సంబంధం ఉండటంతో రాజకీయ పార్టీలు తరచూ దీని కోసం డిమాండ్లు చేస్తుంటాయి. 2010లో కూడా కుల గణన చేపట్టాలనే డిమాండ్ వచ్చింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బీజేపీ కూడా ఈ డిమాండ్ చేసింది.

దీంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం దీనికి అంగీకరించింది. 2011 జనగణన సందర్భంగా సేకరించిన కులాల సమాచారాన్ని ప్రభుత్వం బయటపెట్టలేదు. ఇందులో సమగ్రత లేకపోవడం ఒక కారణం అంటారు. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టుకు 2021లో కేంద్రం తెలిపింది. ‘2011లో చేపట్టిన ఆ సామాజిక-ఆర్థిక కుల గణనలో చాలా లోపాలు ఉన్నాయి. తప్పులు దొర్లడంతోపాటు ఆ సమాచారం దేనికీ ఉపయోగ పడదు’ అని కేంద్రం చెప్పింది.

‘1931 జనాభా లెక్కల్లో కులాల సంఖ్య 4,147గా ఉండేది. కానీ, 2011 జనాభా లెక్కల్లో ఈ సంఖ్య 46 లక్షలకుపైనే ఉన్నట్లు కనిపిస్తు న్నాయి” అని కేంద్రం తెలిపింది.

2021 చేపట్టాల్సిన జనాభా గణన కులాల వారీగా జరగాలని నిర్ణయించారు. ఇందుకు ఏడాది ముందే కసరత్తు జరగాల్సి ఉంది. కానీ కోవిడ్ విపత్తు కారణంగా ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. ★



భారత మహిళా క్రికెట్‌లో నవచైతన్యం వెల్లివిరుస్తోంది. ఉత్తుంగ తరంగంలా ఎగసిపడుతోంది.అంతర్జాతీయ క్రికెట్‌లో కొన్ని దశాబ్దాల కాలంలో ఎన్నడూ లేని లేనంతగా వరుస విజయాలతో వెలిగిపోతోంది. విజయశోభను గొప్పగా చాటుకుంటోంది.

# ఉత్తుంగ తరంగం భారత మహిళా క్రికెట్!

ప్రపంచ క్రికెట్ కేంద్రస్థానం భారత్ అంటే పురుషుల క్రికెట్ మాత్రమే అనుకొనే కాలం గతించి, మహిళా క్రికెట్ సైతం అనుకొనే రోజులు వచ్చాయి. భారత మహిళా క్రికెట్ జట్లు జూనియర్, సీనియర్ అనే తేడా లేకుండా గతేడాది కాలంలో కళ్లు చెదిరే విజయాలు నమోదు చేశాయి.

**పురుషులతో సమానంగా..**

తగిన ఆదరణ, ప్రోత్సాహం, ప్రచారం ఉంటే పురుషులతో సమానంగా రాణించగలరనడానికి గత ఏడాదిలో భారత మహిళాజట్లు సాధించిన విజయాలే నిదర్శనం. భారత క్రికెట్ బోర్డు పురుషులతో సమానంగా మహిళలకూ శిక్షణ సదుపాయాలు, మ్యాచ్ ఫీజులు, ఇతర ప్రోత్సాహకాలు అందిస్తూ రావడం అనూహ్యఫలితాలనే ఇచ్చింది.

**జూనియర్ మహిళా ప్రపంచకప్ తో...**

దక్షిణాఫ్రికా వేదికగా జరిగిన 2023 జూనియర్ (అండర్ -19) మహిళా ప్రపంచకప్ పోటీలలో షెఫాలీవర్మ నాయకత్వంలోని భారతజట్టు తొలిసారిగా ప్రపంచకప్ కైవసం చేసుకొంది. వికెట్ కీపర్ బ్యాటర్ రిచా ఘోష్, కెప్టెన్ షెఫాలీ వర్మతో పాటు జట్టులోని పలువురు యువ ప్లేయర్లు స్థాయికి తగ్గట్టుగా రాణించడంతో టైటిల్ సమరంలో ఇంగ్లండ్‌ను భారత్ కంగు తినిపించి విశ్వ విజేతగా నిలువగలిగింది.

**హర్మన్ ప్రీత్ నాయకత్వంలో సీనియర్ల జోరు...**

సీనియర్ స్థాయిలోనూ భారతజట్టు నిలకడగా రాణిస్తూ వస్తోంది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇంగ్లండ్ లాంటి ప్రపంచ మేటిజట్లకు గట్టి ప్రత్యర్థిగా నిలువగలిగింది. భారత్‌ను తక్కువగా అంచనావేస్తే ముప్పుతప్పదన్న సంకేతాలను పంపింది. ఆస్ట్రేలియాతో జరిగిన ఐదుమ్యాచ్‌ల టీ-20 సిరీస్‌లో విజేతగా నిలువలేకపోయినా గట్టిపోటీ ఇవ్వడం ద్వారా అభిమానులను ఆకట్టుకోగలిగింది. ముంబైలోని డీవై పాటిల్ స్టేడియం, క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియా, వాంఖడే స్టేడియాలు వేదికగా భారతజట్టు ఆడే మ్యాచ్‌లకు అభిమానులు భారీ సంఖ్యలో తరలిరావడం సరికొత్త ఉత్సాహాన్ని నింపింది.

హర్మన్ ప్రీత్ కౌర్ నాయకత్వంలోని భారతజట్టు స్మృతిమందన, దీప్తిశర్మ, రాజేశ్వరీగయక్వాడ్, రేణుకాసింగ్, పూజావస్త్రకర్ లాంటి సీనియర్లు, జెమీమా రోడ్రిగేజ్, షెఫాలీ వర్మ, రిచా ఘోష్, హర్లీన్ డియోల్, సైకా ఇషాక్, శ్రేయాంకా పాటిల్, తాన్యా భాటియా, శుభ సతీశ్ లాంటి నవతరం క్రికెటర్ల మేళవింపుతో గతంలో ఎన్నడూలేనంత పటిష్టంగా తయారయ్యింది.

**ఆసియా క్రీడల బంగారు పతకంతో...**

చైనాలోని హాంగ్జు వేదికగా జరిగిన 2022 ఆసియా క్రీడల మహిళా క్రికెట్లో భారతజట్టు అలవోకగా బంగారు పతకం గెలుచుకొంది. సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసిన స్వర్ణపతం పోరులో శ్రీలంకను 22 పరుగుల తేడాతో చిత్తు చేసింది. ఆసియాక్రీడల క్రికెట్ చరిత్రలో భారత్‌కు ఇదే తొలి బంగారు పతకం కావడం విశేషం.



**తొలిసారిగా మహిళా ఐపీఎల్...**

2008 నుంచి పురుషులకు మాత్రమే నిర్వహిస్తున్న ఐపీఎల్‌ను మహిళలకు సైతం 2023 సీజన్ నుంచి నిర్వహించడం మొదలుపెట్టారు. మొత్తం ఐదు జట్లతో ..ముంబైలోని మూడు వేదికల్లో 22 మ్యాచ్‌లుగా నిర్వహించిన ఈ టోర్నీ విజయ వంతమయ్యింది. ఫైనల్లో ఢిల్లీ క్యాపిటల్స్‌ను హర్మన్ ప్రీత్‌కౌర్ నాయకత్వంలోని ముంబై ఇండియన్స్ 7 వికెట్లతో ఓడించడం ద్వారా విజేతగా నిలిచింది. తొలి విజేతగా ముంబై 6 కోట్లు, రన్నరప్ ఢిల్లీ 3 కోట్ల రూపాయలు ప్రైజ్ మనీ అందుకొన్నాయి.

మహిళా ఐపీఎల్ తొలిసీజన్ వేలంలో ఓపెనర్ స్మృతి మందనను బెంగళూరు ఫ్రాంచైజీ రూ. 3.40 కోట్లు సొంతం చేసుకొంది. ఐపీఎల్ ద్వారా మహిళలు సైతం రూ. కోట్లు సంపాదించగలరని స్మృతి మందన చాటి చెప్పింది.

**10 రోజుల్లో రెండు టెస్టు విజయాలు!**

సంప్రదాయ మహిళా టెస్టు క్రికెట్ చరిత్రలో.. కేవలం 10 రోజుల వ్యవధిలో రెండు ప్రపంచ మేటిజట్లను కంగుతినిపించిన అరుదైన రికార్డును భారతజట్టు సొంతం చేసుకొంది. 2023 డిసెంబర్‌లో నవీ ముంబై డాక్టర్ డీవై పాటిల్ స్టేడియంలో ముగిసిన నాలుగు రోజుల టెస్టు మ్యాచ్‌లలో భారత్ 347 పరుగుల భారీ ఆధిక్యంతో ఇంగ్లండ్‌పై అతిపెద్ద విజయం సాధించింది. ఒక్కరోజు ఆటలో 400కు పైగా పరుగులు సాధించిన రెండోజట్టుగా రికార్డుల్లో చోటు సంపాదించింది.

**ఆస్ట్రేలియాపై అపురూప విజయం...**

మహిళా క్రికెట్ ఫార్మాట్ ఏదైనా ప్రపంచ మేటి ఆస్ట్రేలియాను ఓడించడం భారత్‌కు ఓ కల. టెస్టు మ్యాచ్‌లో కంగారూలను కంగు తినిపించాలన్న భారత కల మూడదశాబ్దాల తరువాత సాకార మయ్యింది. ముంబైలో ముగిసిన టెస్టులో సైతం ఆస్ట్రేలియాపై భారత్ 8 వికెట్ల సంచలన విజయం సాధించింది.

ఆస్ట్రేలియా ప్రత్యర్థిగా ఆడిన గత 10 టెస్టుల్లో కనీసం ఒక్క గెలుపులేని భారత్ ఎట్టకేలకు తొలి విజయం నమోదు చేయగలిగింది. అత్యంత పటిష్టమైన ఆస్ట్రేలియాను తొలి ఇన్నింగ్స్ లో 219 పరుగులకే కుప్పకూల్చడంతో పాటు... తన తొలి ఇన్నింగ్స్ లో 406 పరుగులతో భారీ ఆధిక్యం సంపాదించిన భారత్... రెండో ఇన్నింగ్స్‌లోనూ కంగారూ జట్టును 261 పరుగులకే కట్టడి చేసింది. భారత మహిళా క్రికెట్ చరిత్రలో 2023 అత్యంత విజయవంతమైన సంవత్సరంగా నిలిచిపోతుంది. ఇదేజోరును కొత్త సంవత్సరంలోనూ భారత్ కొనసాగించగలిగితే ప్రపంచ మూడు అత్యుత్తమ జట్లలో ఒకటిగా నిలువగలుగుతుంది. ★



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

కేంద్ర పారిశ్రామిక భద్రతాదళం. నైనాసింగ్.

ఆ సంస్థకి, ఈ వ్యవస్థీకృత అధికారిణికి అవినాభావ సంబంధముంది.

ఎలా అంటే...

సీఐఎస్ఎఫ్‌కి మొట్టమొదటి మహిళా డైరెక్టర్ జనరల్ (డీజీ) ఆమె!

మన దేశంలో ఇదొక రికార్డు!

రికార్డుల సృష్టి తనకు కొత్త కాదు. మునుపు రాజస్తాన్‌లో పరమోన్నత స్థాయి పోలీస్ హోదా సైతం తనదే!!

మరో ఆసక్తికర అంశం – మూడేళ్లనాడే తను విశిష్ట సేవా పురస్కృతిని సాధించడం. ఎప్పుడో 18 ఏళ్ల క్రితం ఆమె చేపట్టిన పరిశోధనా ప్రాజెక్టు 'పోలీస్‌స్టేషన్ల అభివృద్ధి'. ఇలా ఎన్ని విధాలుగా చూసినా, తనదే ఒక విలక్షణత, అన్నిటా అంతటా ప్రత్యేకత.

ఒకే సమయంలో పలు పనులు చేపట్టి, ఆశించిన ఫలితాలు వచ్చేదాకా పరిశ్రమించడం తన అలవాటు. ఆ 'పరిశ్రమ'కి, ఈ 'పారిశ్రామిక'కి ఎన్నో రకాలుగా పొంతన. మరింత వివరం కావాలంటే –



# ప్రత్యేకతల వనిత

**ముం**దుగా తెలుసుకోవాల్సింది ఆ సాహస నారి పేరు! 'నైనా' అనుకున్నాం కదా! ఏ పని అప్పగించినా 'నై' / నో / కాదు, కూడదూ అనకుండా చేసి తీరడం తనదైన స్వభావం.

అలా విధుల నిర్వహణలో నిమగ్నమైనపుడు, విభిన్న వ్యూహ రచన చేయడమూ ఆమె నైజమే. అదంతా సహజ లక్షణం.

ఆ కార్యాచరణే వేరుగా ఉంటుంది. ఎలా అంటారా?

2021–2023.... ఈ మధ్యకాలంలో రెండు కీలక బాధ్యతలను తాను చేపట్టాల్సి వచ్చింది. సీఐఎస్ఎఫ్‌కి సంబంధించి అదనపు డీజీ, స్పెషల్ డీజీ. ఆ రెండేళ్లలోనే పలు సవాళ్లు నైనాకు ఎదురయ్యాయి. వాటిల్లో ప్రధానమైనవి 1. విమానాశ్రయాల పరిరక్షణ. 2. ఓడరేవుల వద్ద సంరక్షణ. భూమార్గంలో ఒకటి, జలమార్గంలో వేరొకటి.

రెండింటినీ స్పోర్టివ్‌గా తీసుకున్నారు. ఇందులో భాగంగానే, సంస్థాగత మార్పుచేర్పులను వేగవంతం చేశారు. నిరంతర భద్రతను అంచెల వారీగా విశ్లేషిస్తూ / పర్యవేక్షిస్తూ వచ్చారు.

**చెదరని ధీరత**

దాదాపు ప్రతీ సందర్భంలోనూ బెదిరింపులు ఎదురయ్యాయి. హెచ్చరికలు నిత్య అనుభవాలుగా మారిపోయాయి. వాటిని ఖాతరు చేయనట్లు ఉంటూనే, ఇంకో కోణం నుంచి గూఢచర్య కార్యకలాపాలను విస్తృతపరచారు. దీనిలో యువసిబ్బంది సేవలను పూర్తిగా వినియోగించు కున్నారు.

ఆ వినియోగ విధానం ఆమె మంత్రిత్వ శాఖను అబ్బురపరచింది. ప్రశంసలు పరంపరగా లభించాయి. అభినందన పత్రాలు వెల్లువలయ్యాయి. అనేక సత్కారాలకు కూడలి స్థలిగా మారింది తన నివాస ప్రాంతం!

నైనాసింగ్ స్వరాష్ట్రం బిహార్. సొంత ప్రాంతం పట్నా నగరం. పుట్టిన సంవత్సరం 1964. అంటే, ఇప్పుడామె వయసు రమారమి అరవై.

పట్నా లోనే అదీ మహిళా కళాశాలలోనే డిగ్రీ తీసుకున్నారు. మాస్టర్ డిగ్రీ చేసేందుకు ఢిల్లీలోని జేఎన్‌యుకి వెళ్లారు. అనంతరం హార్వర్డ్ విశ్వవిద్యాల యాన్ని సందర్శించారు.

ఐపీఎస్ చేశాక, సీఐఎస్ఎఫ్ పై మక్కువ ఎక్కువైంది. ఎందుకని అడిగితే, చాలా చెప్పాల్సి వస్తుంది...

ప్రభుత్వరంగ సంస్థలకు సంపూర్ణ భద్రత కలిగించడమే సీఐఎస్ఎఫ్ ప్రధాన బాధ్యత. ఒక్క మాటలో – అది రక్షణ ఛత్రం. ఆ లక్ష్యంతోనే ఆ సెక్యూరిటీ ఫోర్స్ దశాబ్దాల కిందట రంగ ప్రవేశం చేసింది. ఎంతో నైపుణ్యశక్తిగా ఇన్నేళ్లలో విస్తృతి అందుకుంది.

**పలు బాధ్యతల నిర్వహణ**

ఈ దళంలో మొత్తంమీద రెండు లక్షలమంది వరకు సిబ్బంది ఉన్నారు. వీరివి విభిన్న స్థాయిల్లో కర్తవ్యాలు. ఈ ఉద్యోగులు, పరిరక్షక బృంద సభ్యులంతా ఇప్పుడు సుమారు నాలుగువందల సంస్థలకు భద్రత కలిగిస్తున్నారు. ఈ రీత్యా చూసినపుడు, సీఐఎస్ఎఫ్ మహా వ్యవస్థ. అంచెలంచెలుగా రక్షణ కల్పించే ఏర్పాటు.

విమానాశ్రయాలు, ఓడరేవులు మాత్రమే కాదు – పలు అంతరిక్ష సంబంధ సంస్థలు, అణు కర్మాగారాలు, తదితరాలకు కూడా అన్ని వేళలా రక్షణ కల్పిస్తోంది దళం. వివిధ ప్రభుత్వ భవనాలు, చారిత్రక ప్రశస్త స్మారక కట్టడాల వద్ద కూడా నిఘా వేసి ఉంటోంది. పైగా మెట్రో సర్వీసులకు సైతం తన సేవలు అందిస్తోంది.



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్

ఇంత భారీ బృందానికి ఆధిపత్యం మాటలతో అయ్యే పని కాదు. సంక్షేమం, సాంకేతికం, శిక్షణ, వ్యవస్థాపనం, నిర్వహణ, పర్యవేక్షణ... ఇలా ఎన్నో విధులు ఉంటుంటాయి. సరైన ప్రణాళిక, సకాల ఆచరణ ఉంటేనే; పనులు సజావుగా పూర్తవుతాయి. వీటికితోడు అత్యవసర వేళల్లో రంగంలోకి దిగడం మరింత కీలక కర్తవ్యం.

సిబ్బంది సంఖ్యను పెంచుకుంటూ పోవాలి. ఖాళీల భర్తీ ఎప్పటికప్పుడు జరుగుతుండాలి. పనుల నిర్వాహకత్వం కొనసాగుతూనే ఉండాలి. ఇదంతా డీజీ పరిధిలోనిది. దీన్ని సమర్థంగా నెరవేర్చాలంటే దీక్షాదక్షతలు అపారంగా ఉండాలన్నది అందరికీ తెలిసిందే. అంతకుమించి ఓరిమీ అవసరమే.

**రక్షణ, భద్రత, నిఘా**

కళ్లు విప్పార్చి చూస్తూ, పహరా కాయడమన్నది సిబ్బంది విధ్యుక్తధర్మం. ప్రముఖులకు సంరక్షణ, భద్రత కలిగించడమనే బాధ్యతలు ఎటూ ఉంటాయి. రక్షణ వలయాన్ని నిర్వహించే తరుణంలో డీజీ స్థాయి సమున్నత అధికారిమీద విపరీత ఒత్తిడి ఉంటుంది. వీటిని గమనించి, గుర్తించి, ఆచరించి, పురస్కారాలు స్వీకరించిన మహిళామణి నైనాసింగ్.

ఆమె మొదట్లో జైపూర్‌లో పనిచేశారు. అదీ మహిళా పోలీసుస్టేషన్‌లో. అటు తర్వాత అజ్మీర్, సిరోహి, మరికొన్ని ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు.

ఆమె యూపీఎస్‌సీ పరీక్షలు రాయడంలోనూ ఎంతో నిబద్ధత కనబరిచారు. తొలుత మణిపూర్ కేడర్‌లో నియమితులయ్యారు నైనా.

కాలక్రమంలో విధుల పరంపర ఎక్కువైంది. బహుళ స్థాయిలో తన సేవలు అందించారామె.

భర్త రోహిత్‌కుమార్‌సింగ్, రాజస్తాన్ కేడర్. వివాహానంతరం నైనాకు రాజస్తాన్ కేడర్ ప్రాప్తించింది.

అక్కడ ఉండగా ఆమె మరికొన్ని కర్తవ్య నిర్వహణలు చేపట్టారు. మానవ అక్రమ రవాణా నిరోధానికి పలు చర్యలు తీసుకున్నారు. విశేషం ఏమిటంటే, పౌరహక్కుల పరిరక్షణకూ ఆమె తనవంతు కృషి చేయడం. పోలీసులు, పౌరుల అనుసంధానికి తగినంతగ కృషిచేసిన నేర్పరి.

**ఎనలేని గుర్తింపు**

ఆ మహిళారత్నం ప్రతిభా సామర్థ్యాలను అదే రాజస్తాన్ ప్రభుత్వం గుర్తించి గౌరవించింది. మహిళా సంక్షేమానికి ఉద్దేశించిన కమిషన్ సభ్యురాలిగా నియామకం చేసింది.

కరోనా కాలంలో నైనా బాధ్యతలు మరింత విభిన్నంగా రూపొందాయి. వైద్యసేవల మీద కూడా చూపు మళ్లించారామె. వైద్య సంబంధ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించి అందరి మన్ననలూ అందుకున్నారు.

తనకు నచ్చిన అవార్డులూ రికార్డులూ అనేకం. రాష్ట్రపతి పోలీసు పతకం, ప్రత్యేక గుర్తింపు మెడల్, ఇలా ఎన్నెన్నో ఆమెనే వరించి వచ్చాయి.

**సంస్కరణశీలి**

పోలీసు వ్యవస్థలో సంస్కరణలపైనా చూపు కేంద్రీకరించారు నైనాసింగ్. తన లక్ష్య సాధనకు అనువుగా పలు రచనలు చేశారు. ప్రసంగాలిచ్చారు. పోటీలు నిర్వహించారు.


కొన్ని ప్రత్యేక కేసుల నిర్వహణను ఆమెకే అప్పగించింది కేంద్ర ప్రభుత్వం. కేంద్ర నేర పరిశోధక సంస్థ సంయుక్త సంచాలకురాలిగా దక్షత కనబరచిన నైనా, ప్రభుత్వం నుంచి ప్రత్యేక ప్రశంస స్వీకరించడం మరెంతో విశేషాంశం.

ఎన్ని ప్రత్యేకతలున్నా, వినమ్రంగా కనిపించే ఆమె నిస్సందేహంగా అందరికీ ఆదర్శప్రాయ.

స్ఫూర్తి ప్రియ. ★



## బాలికల కోసం మొదటి సైనిక స్కూల్



మహిళా సాధికారత చరిత్రలో ఇదొక స్వర్ణపుట అన్నారు రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్. కాదా మరి! దేశంలోనే తొలి బాలికా సైనిక్ స్కూల్‌ను ఆయన జనవరి 1న ప్రారంభించారు. ఆ సమయంలో అన్న మాటే ఇది. ఉత్తరప్రదేశ్‌లోని మధుర జిల్లా, బృందావన్‌లో ఈ స్కూల్‌ను నిర్మించారు. సైన్యంలోచేరి దేశ రక్షణకు పాటు పడాలని కోరుకునే మహిళలకు ఈ స్కూల్ మంచి అవకాశం ఇస్తుంది. సంవిద్ గురుకులం గర్ల్స్ సైనిక్ స్కూల్ పేరుతో ఏర్పాటు చేసిన ఈ సంస్థలో 870 మంది విద్యార్థినులు ఉన్నారు. దేశవ్యాప్తంగా మొత్తం వంద సైనిక్ స్కూల్స్ ఏర్పాటు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా ఇప్పటికే 42 స్కూల్స్ పని చేయడం మొదలుపెట్టాయి. తాజాగా ఇప్పుడు బృందావన్ స్కూల్ కూడా చేరింది.

# బాలజాగృతి


## తెలుసుకుందాం

# భాగ్యనగరంలోని అష్టలక్ష్మి ఆలయం



భాగ్యనగరంలోని కొత్తపేట సమీపం వాసవి కాలనీలో ఈ ఆలయం కొలువుదీరింది. అష్టలక్ష్మీ దేవి ప్రధాన దైవంగా గల ఆలయమిది. ఇక్కడ అమ్మవారు నిత్యం పూజలందుకుంటున్నారు. ఈ ఆలయ ప్రాంగణంలో ఆదిలక్ష్మీ, ఐశ్వర్యలక్ష్మీ, సంతానలక్ష్మీ, ధనలక్ష్మీ, ధాన్యలక్ష్మీ, గజలక్ష్మీ, విజయలక్ష్మీ, వరలక్ష్మీ తదితర అమ్మవార్ల విగ్రహాలు కూడా ఉన్నాయి. ఆలయంలోని శిల్పసంపద ఆకట్టుకుంటుంది.

## కథ | రామయ్య-ఆవు



రామయ్య దగ్గర ఒక ఆవు వుండేది. అది దండిగా పాలు ఇచ్చేది.

రామయ్య ఆ ఆవును ఎంతో శ్రద్ధగా మేత, కుడితి పెట్టి జాగ్రత్తగా చూసుకునేవాడు.

అంతేగాక ఆవును దైవస్వరూపంగా భావించి ప్రతి శుక్రవారం దానికి స్నానం చేయించి, పసుపు కుంకుమలతో పూజ చేసి, హారతి ఇచ్చేవాడు.

ఆ ఆవు కొన్నాళ్లకు దూడను ఈనింది. రామయ్య ఎంతగానో సంతోషించాడు.

పాల దిగుబడి మరింతగా పెరిగింది.

కానీ ఒకరోజు ఆ ఆవు తప్పిపోయింది. ఎంత వెతికినా దొరకలేదు.

రామయ్య చాలా విచారించాడు. దూడ కూడా తల్లి కోసం దిగులుపడింది.

దాంతో రామయ్య ఒక ఉపాయం ఆలోచించి "నా ఆవు తప్పిపోయింది. దాన్ని తెచ్చి ఇచ్చిన వాళ్లకు దూడను కూడా ఇచ్చేస్తాను" అని దండోరా వేయించాడు.

## పద్యం

కల్లలాడువాని గ్రామకర్త యెఱుంగు
నీరు పల్ల మెఱుగు నిజముగాను
దల్లి తానెరుగును దనయుని జన్మంబు
విశ్వదాభిరామ! వినుర వేమ!

**భావం :** మనుజుడు ఆడే అబద్ధములు, నిజాములు ఈశ్వరునకు తెలుసును. నీరు పల్లపు ప్రదేశమునకే పోవును. కుమారుని పుట్టుక తల్లికి మాత్రమే తెలుస్తుందని భావం.

## శ్లోకం

శ్రోత్రం శ్రుతేనైవ నతు కుండలేన

'శ్రోత్రం శ్రుతేనైవ నతు కుండలేన
దానేన పాణిర్నతు కంకణేన
విభాతికాయః కరుణాపరాణామ్
పరోపకారేణన చందనేన'

**భావం :** మంచి మాటలు చెవికి అందాన్ని ఇస్తాయి కాని కుండలాలు కాదు. చేతికి అందాన్ని ఇచ్చేది దానమే తప్ప కంకణం కాదు. దయ వల్లనే దేహం అందంగా ఉంటుంది కానీ గంధం పూత వల్ల కాదు. పరోపకారంతోనే శరీరం కాంతి మంతంగా ఉంటుంది.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| ఆరెంజ్ సిటీ | జంషెడ్‌పూర్ |
| సిటీ ఆఫ్ స్టీల్ | పుణె |
| దేవభూమి | నాగ్‌పూర్ |
| సన్ సిటీ | ఉత్తరాఖండ్ |
| దక్కన్ క్వీన్ | జోద్‌పూర్ |

జవాబులు : ఆరెంజ్ సిటీ–నాగ్‌పూర్, సిటీ ఆఫ్ స్టీల్–జంషెడ్‌పూర్, దేవభూమి–ఉత్తరాఖండ్, సన్ సిటీ–జోద్‌పూర్, దక్కన్ క్వీన్–పుణె


నిర్వహణ : నయనశ్రీ

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### పుష్పలత దాస్



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, సామాజిక కార్యకర్త, గాంధేయవాది. 1915 మార్చి 27న ఉత్తర లఖింపూర్‌లో జన్మించారు. చిన్నప్పటి నుంచే దేశభక్తి భావాలు ఎక్కువ. 1931లో విప్లవకారుడు భగత్ సింగ్‌ను బ్రిటిషర్లు ఉరితీయడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టి పాఠశాల నుండి సస్పెండ్ అయ్యారు. క్విట్ ఇండియా, శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొని అరెస్ట్ కూడా అయ్యారు. 2003 నవంబరు 9న తుదిశ్వాస విడిచారు.



దూడ కోసం ఆశపడిన గోపన్న అనేవ్యక్తి తన కొట్టంలో కట్టేసుకున్న ఆ ఆవును తీసుకుని రామయ్య దగ్గరికి వచ్చాడు.

“ఆవును తెచ్చాను, దూడను కూడా ఇస్తే తీసుకుపోతాను” అన్నాడు.

దూడను గుర్తుపట్టిన ఆవు గోపన్నను ఒక తన్ను తన్ని దూడ దగ్గరికి పరుగెత్తింది.

నడుము విరిగిన గోపన్న లబోదిబోమన్నాడు.

రామయ్య తన ఆవు తనకు దక్కినందుకు, దూడకు తల్లి దొరికినందుకు సంతోషించారు. ★

## జనరల్ నాలెడ్జ్

1. భారతదేశంలోనే అతిపెద్ద జైలు ఏది?
2. ప్రపంచంలోనే అతిపెద్ద జలపాతం ఏది?
3. దాశరథి శతకాన్ని ఎవరు రచించారు?

సమాధానాలు : 1. తీహార్ జైలు 2. విక్టోరియా జలపాతం 3. కంచర్ల గోపన్న.

## మెదడుకు మేత



మంచం కింద మావయ్య..
ఊరికి పోదాం రావయ్య..
ఏమిటది?

జవాబు : చెప్పులు

## మంచిమాట



నీ సందేహం తీర్చడానికి
ఎవరూ లేనప్పుడు
నీ అనుభవమే నీకు
మార్గదర్శి అవుతుంది...




# వారఫలాలు

8 -14 జనవరి 2024

**మేషం :** అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

ఇంటిలో శుభకార్యాలు నిర్వహిస్తారు. నిరుద్యోగుల శ్రమ ఫలిస్తుంది. ఆస్తి వివాదాలు కొలిక్కి వస్తాయి. ఇంటి నిర్మాణయత్నాలలో కదలికలు. విద్యార్థులకు అనుకూల సమయం. రావలసిన సొమ్ము కొంత జాప్యమైనా పూర్తిగా అందుతుంది. వ్యాపారాలు ఉత్సాహంగా సాగి లాభాలు పొందుతారు. ఉద్యోగులకు అనుకూల మార్పులు. 8,9 తేదీల్లో అనారోగ్యం. బంధువులతో వివాదాలు. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.

**వృషభం :** కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ఆర్థిక పరిస్థితి మరింత మెరుగుపడి ఉత్సాహంగా గడుపుతారు. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగి సమస్యలను అధిగమిస్తారు. ఆస్తుల వ్యవహారాలు కొలిక్కి వస్తాయి. వ్యాపారులు అనుకున్న విధంగా విస్తరణ పూర్తిచేస్తారు. రాజకీయవేత్తలు, కళాకారులు, పరిశోధకులు లక్ష్యాలు సాధిస్తారు. 11,12తేదీల్లో వృథా ఖర్చులు. అనారోగ్యం. దూరప్రయాణాలు. గణేశాష్టకం పఠించండి.

**మిథునం :** మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

పరిస్థితులు అనుకూలిస్తాయి. చిన్ననాటి స్వల్ప అనారోగ్యం కలిగినా ఉపశమనం పొందుతారు. ఆస్తుల వ్యవహారాలు కొలిక్కివస్తాయి. యుక్తితో కొన్ని వివాదాలు పరిష్కరించుకుంటారు. విద్యార్థులు విదేశీ విద్యావకాశాలు సాధిస్తారు. వ్యాపారులు నూతన పెట్టుబడులను అందుకుంటారు. 13,14 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. కుటుంబంలో ఒత్తిడులు. ఆంజనేయ దండకం పఠించండి.

**కర్కాటకం:** పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

విలువైన సమాచారం అందుతుంది. విద్యార్థులు అనుకూల ఫలితాలు సాధిస్తారు. ఆస్తుల వ్యవహారాలలో సమస్యలు తీరి ఊరట లభిస్తుంది. ఆదాయ పరంగా ఇబ్బందులు తొలగుతాయి. వ్యాపారులు లాభాల బాటలో పయనిస్తారు. ఉద్యోగులకు ఉన్నత పోస్టులు రావచ్చు. రాజకీయవేత్తలు, కళాకారులు, రచయితలకు ఆకస్మిక విదేశీ పర్యటనలు. 7,8 తేదీల్లో శారీరక రుగ్మతలు. బంధువులతో వివాదాలు. శివాష్టకం పఠించండి.

**సింహం :** మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

అపరిష్కృత కార్యక్రమాలను పూర్తి చేస్తారు. రాబడి మరింత ఉత్సాహాన్నిస్తుంది. ఆస్తుల వివాదాలు పరిష్కారదశకు చేరతాయి. ఆరోగ్యం మెరుగుపడుతుంది. పరిస్థితులు అనుకూలిస్తాయి. ఇంటి నిర్మాణాలు కొలిక్కి వస్తాయి. ఉద్యోగస్తులకు అనుకూల సమాచారం రాగలదు. వ్యాపారులు లాభాలదిశగా అడుగులేస్తారు. 8,9 తేదీల్లో వృథా ఖర్చులు. మానసిక అశాంతి. హయగ్రీవస్తోత్రాలు పఠించండి.

**కన్య :** ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

కొత్త కాంట్రాక్టులు దక్కించుకుంటారు. జీవితాశయం నెరవేరుతుంది. గృహ నిర్మాణయత్నాలు సానుకూలం. రావలసిన సొమ్ము అంది అవసరాలు తీరతాయి. ఉద్యోగులు సంతోషకరమైన సమాచారం అందుకుంటారు. రాజకీయవేత్తలు, కళాకారులు, రచయితలకు విశేష గుర్తింపు లభిస్తుంది. 12,13 తేదీల్లో వ్యయప్రయాసలు. ఖర్చులు. అనారోగ్యం. వేంకటేశ్వరస్వామిని పూజించండి.

**తుల :** చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు


ముఖ్య కార్యక్రమాలలో కొద్దిపాటి అవ రోధాలు. ఆస్తుల విషయంలో అగ్రిమెంట్లు వాయిదా వేస్తారు. వాహన, కుటుంబసౌఖ్యం. నిరుద్యోగులు నిరాశ చెందుతారు. రావలసిన సొమ్ము సకాలంలో అందక ఇక్కట్లు. ఉద్యోగులకు స్థానచలనం. కళా కారులు, పరిశోధకులు, క్రీడాకారులకు పురస్కారాలు అందుతాయి. 12,13 తేదీల్లో ఆకస్మిక ధనలాభం, యత్న కార్యసిద్ధి. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

**వృశ్చికం :** విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

కార్యక్రమాలలో ఆటంకాలు తొలగుతాయి. చిన్ననాటి స్నేహితులను కలుసుకుని మంచీ చెడ్డా విచారిస్తారు. విద్యార్థులు, నిరుద్యోగులకు విజయాలు సొంతమవుతాయి. రావలసిన సొమ్ము సకాలంలో అందుతుంది. ఉద్యోగవర్గాలు నూతనోత్సాహంతో విధులు నిర్వర్తిస్తారు. 13,14 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. అనారోగ్యం. బంధువిరోధాలు. నవగ్రహ స్తోత్రాలు పఠిం

**ధనుస్సు :** మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. అప్ప




సింహంభట్ల సుబ్బారావు

6300674054


గించిన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. ఆర్థిక లావాదేవీలు సంతృప్తికరంగా ఉంటాయి. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి వ్యాపారులకు లాభాలు. రాజకీయవేత్తలు, కళాకారులు, పరిశోధకులు విశేష గుర్తింపు పొందుతారు. 7,8 తేదీల్లో దూర ప్రయాణాలు. సోదరులతో వివాదాలు. శివాలయంలో అభిషేకం చేయించుకుంటే మంచిది.

**మకరం :** ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

చేపట్టిన కార్యక్రమాలు అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు శుభకార్యాలకు హాజరవుతారు. విద్యార్థులకు ఆశించిన అవకాశాలు తథ్యం. ఉద్యోగులు అనుకున్న హోదాలు దక్కించుకుంటారు. వ్యాపారులు స్వశక్తితో లాభాలబాటలో నడుస్తారు. రాజకీయవేత్తలు, రచయితలు, కళాకారులకు పట్టింది బంగారమే. 12,13 తేదీల్లో దూరప్రయాణాలు. ఆరోగ్య సమస్యలు. ఆదిత్య హృదయం పఠించండి.

**కుంభం :** ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

అనుకున్న కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. మీ ఆశయం నెరవేరుతుంది. దొమ్ము అందుతుంది. భాగస్వామ్య వ్యాపారాలు పుంజుకుంటాయి. ఉద్యోగులకు ఉన్నత హోదాలు తథ్యం. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, పరిశోధకుల కృషి ఫలిస్తుంది. 12,13 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. ఖర్చులు. కుటుంబంలో చికాకులు. లక్ష్మీనృసింహ స్తోత్రాలు పఠించండి.

**మీనం :** పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

పరిచయాలు మరింత విస్తృతమవుతాయి. ఆర్థికంగా బలం చేకురుతుంది. దీర్ఘకాలిక సమస్యల నుంచి గట్టెక్కుతారు. మీలోని నైపుణ్యం వెలుగులోకి వస్తుంది. కీలక నిర్ణయాలు తీసుకుంటారు. సభలు, సమావేశాలకు హాజరవుతారు. దేవాలయదర్శనాలు. వ్యాపారులు ఆశించిన లాభాలు అందుకుంటారు. పారిశ్రామివేత్తలు,కళాకారులు, క్రీడాకారులకు విస్తృత అవకాశాలు. 8,9 తేదీల్లో దుబారా ఖర్చులు. ఆరోగ్య సమస్యలు. అంగారక స్తోత్రాలు పఠించండి.

# పదరసం-447

## ఆధారాలు

**అడ్డం**

1) మనదేశపు జాతీయపక్షి (3)
2) ఇవి ఎరుగనివాడంటే అమాయకుడు, నిరపాయకారి(5)
5) వండిన రాగిపిండి మొదలైనది, అంబలి (3)
6) వనరక్షకుడు తిరగబడ్డాడు (4)
8) కోపంవస్తే మహర్షులు అటునుంచి ఇచ్చేది (2)
9) అసహ్యం (3)
11) చాలా ఎక్కువ (3)
13) వడ్లు మొదలైన ధాన్యపు పొట్టు (2)
14) పేద (2)
16) తేనెటీగల గూడు, పట్టు (2)
17) ఘనుడు, అధికుడు తిరగబడ్డాడు (2)
18) కాయగూరలలో రసంపోగా మిగిలిన చెత్త తిరగబడింది (2)
19) ఇప్పుడు ప్రతిపనికి ఇది వచ్చేసింది (2)
21) అనుమానం (2)
22) గుండె ధైర్యం (3)
23) 9 అడ్డం లాంటిదే (2)
25) కొట్టు (3)
27) చెప్పు, పలుకు (3)
28) అర్జునుని కొడుకు (6)

**నిలువు**

1) ప్రియ సఖి (3)
2) గాడాంధకారం (6)
3) సామంతరాజులు చెల్లించేది (2)
4) నాణెములు ముద్రించే చోటు (4)
5) ఆనందం (3)
7) మచ్చిక, వాత్సల్యం (3)
10) ఖరీఫ్ కాదు(2)
11) శరణుకోరిన వారికి ధైర్యంచెప్పి ఇచ్చేది (3)
12) కార్యక్రమం(2)
15) దాహం (3)
20) మాటలు త్వరగా రావడానికి పసివారికి పోసేది పైకొచ్చింది (2)
21) భీష్ముని తండ్రి (4)
22) కొట్టే దుడ్డుకర్ర తలక్రిందులైంది (3)
24) జండా (3)
25) చివర, తుద (2)
26) వళ్ళు తెలిసి ఉండడం (2)

మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | | ■ | ■ | 2 | | 3 | | 4 |
| | ■ | ■ | 5 | | | ■ | | ■ | |
| 6 | 7 | | | ■ | | ■ | ■ | 8 | |
| ■ | | ■ | | ■ | 9 | | 10 | ■ | |
| 11 | | 12 | ■ | 13 | | ■ | 14 | 15 | ■ |
| | ■ | 16 | | ■ | 17 | | ■ | 18 | |
| 19 | | ■ | ■ | 20 | ■ | ■ | 21 | | ■ |
| ■ | ■ | 22 | | | ■ | 23 | | ■ | 24 |
| 25 | | | ■ | ■ | 26 | ■ | 27 | | |
| | ■ | 28 | | | | | | ■ | |

పదరసం - 447

పేరు : ..........................................................................................

చిరునామా:..........................................................................................

..........................................................................................


పిన్‌కోడ్ : .................. మొబైల్ : ..........................................................

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం.వేసి 2024 జనవరి 22 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారి పేర్లు ప్రకటిస్తాం. తుది నిర్ణయం జాగృతి సంపాదక మండలిదే.

## పదరసం - 443 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| దే[1] | వీ | భా[2] | గ | వ | తం[3] | ■ | క[4] | స[5] | వు |
| వ | ■ | మా | ■ | ■ | జా[6] | గు | ■ | త | ■ |
| నా[7] | అ | క | మి | ■ | వూ | ■ | ■ | మ[8] | చ్చు |
| గ | ■ | లా | ■ | ఝం[9] | రు | ఝా | మా[10] | తం | ■ |
| రి[11] | ది[12] | పం | ళ్ళి[13] | పె | ■ | ■ | లి | ■ | గో[14] |
| ■ | మ | ■ | కు | ■ | ఈ[15] | శా | న్యం | ■ | రిం |
| రం[16] | ■ | తు[17] | ళ్ళి | ప | డు | ■ | ■ | లం[18] | క |
| బ[19] | ల్లి | ■ | కు | ■ | జో[20] | గు | లాం | బ | ■ |
| డం | ■ | తే[21] | ■ | కీ[22] | డు | ■ | ■ | సిం | ■ |
| ఆ[23] | లు | మ | గ | లు | ■ | దా[24] | దా | గి | రి |

**సరైన సమాధానాలు వ్రాసినవారు.** జి. సీతామహాలక్ష్మి, పి.సీతా మహాలక్ష్మి, కాండేపూడి శంకరరావు, పెమ్మరాజు సత్య రామచంద్రరావు, గడియారం రవీంద్ర, డి.ఎస్. అన్సిత, రద్రభట్ల సుగుణారాజారాం, పులికంటి రాజేశ్వర రావు, నేమాని బాలశైలజలు, కాశీభట్ల రామచంద్ర, చింతకుంట దేవలక్ష్మి, వై.హనుమంతరావు, జి.వెంకటేష్ బాబు, టి.నాగ లక్ష్మి, టి.వెంకాయమ్మ, సుభాష్ చంద్ర బోస్, శ్రీరాములు విజయకుమార్, మత్స్యరాజ విజయ లక్ష్మి, కె.అల్లీరాణి, ఆర్.అంజనీదేవి,తాళ్ళూరి సుబ్బారావు, లక్ష్మీదేవి,వి.రాము, వెంకటసుబ్బారావు, ఎస్.పూర్ణకుమారి




అరుణ

# రాశిలో గ్రేట్... వాసిలో వేస్ట్!

**నిన్నగాక మొన్న 2023 వచ్చినట్టుగా ఉంది... అప్పుడే కరిగిపోయింది... పన్నెండు నెలలలో వందలాది చిత్రాలు ప్రేక్షకులను పలకరించాయి. అందులో స్ట్రయిట్ సినిమాలు సుమారు 250 ఉంటే.. అనువాద చిత్రాలు 80 వరకూ ఉన్నాయి. మొత్తం మీద 330 చిత్రాలు ప్రేక్షకు ముందుకొచ్చాయి. అందులో కొన్ని కలెక్షన్ల పరంగా అహో అనిపించాయి. మరికొన్ని అంచనాలు అందుకోలేక చతికిలపడ్డాయి. చిత్రం ఏమంటే కమర్షియల్ సక్సెస్ సాధించిన సినిమాలు సైతం వాసిలో వేస్ట్ అనిపించు కున్నాయి.**

2023 సంక్రాంతికి వచ్చిన సినిమాలో బాలకృష్ణ 'వీరసింహారెడ్డి', చిరంజీవి 'వాల్తేరు వీరయ్య' ఘన విజయాన్ని సొంతం చేసుకున్నాయి. మొదటి సినిమా రూ. వంద కోట్లు, రెండో సినిమా రూ. రెండు వందల కోట్ల గ్రాస్ వసూలు చేశాయి. ఈ రెండు కూడా సిస్టర్ అండ్ బ్రదర్ సెంటిమెంట్‌తో వచ్చినవే అయినా... కథలో బలం కానీ కథనంలో ఆసక్తికానీ లేవు. సంక్రాంతి సీజన్ పుణ్యమా అని వాటికి ఆ ఓపెనింగ్స్ వచ్చాయనే చెప్పాలి.

ఇక అప్పుడే వచ్చిన 'వారసుడు' ఫర్వాలేదనిపించింది. అదే నెలాఖరులో వచ్చిన షారుఖ్ ఖాన్ 'పఠాన్' అవుట్ అండ్ అవుట్ యాక్షన్‌తో ఆకట్టుకుంది. ఫిబ్రవరిలో వచ్చిన సినిమాల్లో మీడియం బడ్జెట్‌తో తెరకెక్కిన 'రైటర్ పద్మభూషణ్', 'వినరో భాగ్యము విష్ణు కథ' గౌరవప్రదమైన విజయాన్ని అందుకోగా, ధనుష్ కథాంశం పాతదే అయినా మెరుగైనా ఫలితాన్ని పొందింది. మార్చిలో వచ్చిన సినిమాలలో 'బలగం'ది పైచేయిగా నిలిచింది. ఈ సినిమా వందకు పైగా అంతర్జాతీయ అవార్డు లనూ అందుకోవడం విశేషం. నాని 'దసరా' తెలుగు రాష్ట్రాలలో ఫర్వాలేదనిపించింది కానీ ఉత్తరాదిన మెప్పించలేకపోయింది.

ఇక మరాఠీ చిత్రం 'నటసమ్రాట్'ను కృష్ణవంశీ 'రంగస్థలం'గా రీమేక్ చేశారు. ఇది విమర్శకుల ప్రశంసలు అందుకున్నా కమర్షియల్‌గా సక్సెస్ కాలేదు. ఏప్రిల్‌లో వచ్చిన సినిమాలలో చాలా వరకూ తీవ్ర నిరాశపరిచాయి. వాటిలో ఘన విజయం సాధించింది 'విరూపాక్ష' ఒక్కటే. ఈ సినిమాతో తొలి సారి సాయిధరమ్‌తేజ్ రూ.వందకోట్ల క్లబ్‌లో చేరాడు. మేలో యువ కథానాయకుల సినిమాలు బాగానే వచ్చాయి. కానీ అన్నీ ప్రతికూల ఫలితాన్నే అందు కున్నాయి. అదే నెలలో వచ్చిన విజయ్ ఆంటోని 'బిచ్చగాడు-2' కాస్తంత ఫర్వాలేదని పించింది.

జూన్‌లో వచ్చిన సినిమాలలో ప్రభాస్ అభిమానులను అశనిపాతానికి గురిచేసిన చిత్రం 'ఆదిపురుష్'. భారీ అంచనాలతో వచ్చిన ఈ సినిమా ఏరకంగానూ మెప్పించలేకపోయింది.

2023 ద్వితీయార్థంలో 'బేబీ' మూవీ కలెక్షన్స్ పరంగా శుభారంభాన్ని ఇచ్చిందనే చెప్పాలి. అదేమీ గొప్ప కథ కాకపోయినా... యువతను బాగానే ఆకట్టుకుంది. దాంతో కమర్షియల్‌గా భారీ విజయాన్ని సాధించింది. దీనితో పాటు వచ్చిన మిగిలిన సినిమాలన్నీ 'బేబీ' దెబ్బకు వెలవెల బోయాయి.

ఈ ఏడాది పవన్ కళ్యాణ్ నటించిన ఒకే ఒక్క సినిమా 'బ్రో'. తమిళ చిత్రం 'వినోదయ సితం'కు ఇది రీమేక్. కానీ అక్కడి మ్యాజిక్‌ను ఇక్కడ దర్శకుడు సముతిర ఖని రిపీట్ చేయలేకపోయాడు. దాంతో పవన్ కళ్యాణే కాదు... ఆయన మేనల్లుడు సాయిధరమ్ తేజ్ సైతం ఓ ఫ్లాప్‌ను తమ ఖాతాలో వేసుకున్నారు. ఈ ఏడాది వచ్చిన అనువాద చిత్రాలలో చెప్పుకోదగ్గ విజయం సాధించిన మరో సినిమా రజనీకాంత్ 'జైలర్'.

ఆ మధ్య కమల్ హాసన్ 'విక్రమ్'తో ఎలా అయితే బౌన్స్ బ్యాక్ అయ్యాడో అలా రజనీని తిరిగి తన సింహాసనంపై 'జైలర్' కూర్చోపెట్టింది. అదే నెలలో వచ్చిన చిరంజీవి 'భోళాశంకర్' బాక్సాఫీస్ బరిలో బోర్లాపడింది. సెప్టెంబర్‌లో వచ్చిన సినిమాలలో చాలా మంది 'ఖుషీ'పై ఆశలు పెట్టుకున్నారు. సమంత నటించిన 'శాకుంతలం' పరాజయం పాలు కావడంతో.. ఈ సినిమా అయినా ఆమెకు సక్సెస్ ఇస్తుందని అనుకున్నారు. అలానే 'లైగర్' తర్వాత విజయ్ దేవరకొండ చేసిన సినిమా కావడంతో అతనికి కచ్చితంగా హిట్ వస్తుందని భావించారు. పాటలు కూడా బాగానే పాపులర్ అయ్యాయి. కానీ సినిమా మాత్రం నిరాశ పరిచింది. అదే నెలలో వచ్చిన నవీన్ పోలిశెట్టి 'మిస్ శెట్టి - మిస్టర్ పోలిశెట్టి', షారుఖ్ ఖాన్ అనువాద చిత్రం 'జవాన్' ఈ నెలలో బాగానే సొమ్ము చేసుకున్నాయి.

అక్టోబర్‌లో మొత్తం గడ్డుకాలాన్నే తలపించింది. యువ కథానాయకుల చిత్రాలన్నీ బాక్సాఫీస్ దగ్గర పరాజయం పాలైతే... దాదాపు అందరూ కొత్తవారితో వచ్చిన 'మ్యాడ్' బెటర్ రిజల్ట్‌ను అందుకుంది. ఇదే నెలలో దసరా కానుకగా వచ్చిన 'భగవంత్ కేసరి' మరోసారి బాలకృష్ణకు ఘన విజయాన్ని అందించింది. వరుసగా హ్యాట్రిక్ సక్సెస్ సాధించేలా చేసింది. అక్టోబర్ 17న వచ్చిన రవితేజ 'టైగర్ నాగేశ్వరరావు' మెప్పించలేకపోయింది. స్టూవర్ట్‌పురానికి చెందిన నాగేశ్వర రావు బయోగ్రఫీతో ఈ సినిమా తెరకెక్కింది. నవంబర్‌లోని మూవీస్‌లో 'మా ఊరి పొలిమేర-2' మాత్రమే కమర్షియల్ గా సక్సెస్‌ను అందుకుంది. అలానే 'టైగర్-3' కూడా ఫర్వాలేదనిపించింది.

ఇక మిగిలిన సినిమాలన్నీ కంచికెళ్లిపోయాయి. 2023 డిసెంబర్ లో వచ్చిన చిత్రాలలో అనువాద చిత్రం 'యానిమల్' కమర్షియల్‌గా ఓకే అనిపించుకుంది. ప్రభాస్ 'సలార్'తో కాస్తంత ఊపిరి పోసుకున్నారు. నాని 'హాయ్ నాన్న' మోడరేట్ సక్సెస్ అందుకుంది. చివలో వచ్చిన నందమూరి కళ్యాణ్ రామ్ 'డెవిల్' కూడా ఆకట్టుకునేలానే ఉన్నా... కమర్షియల్ సక్సెస్ కష్టమనే అనిపిస్తోంది. మొత్తం మీద మొదట్లో చెప్పుకున్నట్టుగా... ఎప్పటిలానే విజయాలను సాధించిన సినిమాలేవి గొప్పవి కాదు... అయితే పరాజయం పాలైన సినిమాలు మాత్రం కచ్చితంగా చెత్తవే! ఈ ఏడాది అయినా వాసి ఉన్న చిత్రాలే విజయం సాధించాలని కోరుకుందాం... అదే సమయంలో సమాజహితాన్ని కాంక్షించే చిత్రాలు రావాలని, అవి ప్రేక్షకాదరణ పొందాలని ఆశిద్దాం.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# అయోధ్యలో కొత్త గుర్తులు

అయోధ్య నగరం రూపురేఖలు పూర్తిగా మారిపోతున్నాయి. నిన్న మొన్నటి వరకు వెనుకబడిన పట్టణంలా కనిపించిన అయోధ్య నేడు అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో ముస్తాబవుతోంది. అక్కడ ప్రతి కట్టడం చూసేవారిని అబ్బురపరిచేలా నిర్మిస్తున్నారు. ఆలయం మాత్రమే కాదు అడుగడుగునా ఆధ్యాత్మికతను తలపింప చేసేలా నిర్మాణాలు సాగుతున్నాయి. నిన్నటివరకూ అయోధ్యలో ఉన్నవారు కూడా నేడు చూసిన మార్పులు చూసి అబ్బురపడి, గర్వపడేలా అవి ఉంటున్నాయి.

తాజాగా, నగరంలో లతా మంగేష్కర్ చౌక్ పేరుతో ఒక పెద్ద వీణను, ఆలయం బయట పెద్ద జటాయు విగ్రహాన్ని, శ్రీరామ స్తంభాన్ని, చూడామణి చౌక్ వద్ద పెద్ద చూడామణి చిహ్నాన్ని ఏర్పాటు చేస్తున్నారు. అంతర్జాతీయ పర్యాటకులను, భక్తులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేయాలన్న పట్టుదలతో ప్రభుత్వం ఈ నిర్మాణాలను చేస్తోంది.



లతా మంగేష్కర్ చౌక్



చూడామణి చౌక్



శ్రీరామ స్తంభం




జటాయువు విగ్రహం


From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 76 Issue : 09


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు





వెల : ₹.220/-





వెల : ₹.200/-





వెల : ₹.390/-





వెల : ₹.250/-




వెల : ₹.250/-





వెల : ₹.360/-




వెల : ₹.100/-




వెల : ₹.200/-





వెల : ₹.100/-





వెల : ₹.150/-





వెల : ₹.799/-





వెల : ₹.499/-




వెల :₹.495/-




వెల : ₹.799/-




వెల : ₹.549/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.
040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 8333812687